www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

శనివారం
01-02-2025

సంపుటి : 01 | సంచిక : 270 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్


V3 NEWS



డా॥ కాచం సత్యనారాయణ
CMD

# గ్లోబల్ ఇన్నోవేషన్ పవర్‌హౌస్‌గా భారత్

- మూడు రెట్లు వేగంతో పనిచేస్తున్న ఎన్డీఏ సర్కార్
- 25 కోట్ల మందిని దారిద్ర్యం నుంచి బయటకు తీసుకొచ్చాం
- మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం
- విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి
- ఒకే దేశం-ఒకే ఎన్నిక, వక్ఫ్ సవరణ బిల్లు అమలు దిశగా సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నాం
- ప్రపంచంలో మూడో ఆర్థికవ్యవస్థగా మారనున్న ఇండియా
- పార్లమెంట్‌లో ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**ఢిల్లీ:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగించారు. ఆరంభంలో ప్రయాగ్‌రాజ్‌లోని మహా కుంభమేళాలో జరిగిన తొక్కిసలాట ఘటనపై రాష్ట్రపతి విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. ఇటీవలే తుదిశ్వాస విడిచిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. ''మహా కుంభమేళా జరుగుతున్న సమయంలో పార్లమెంట్ సమావేశాలు ప్రారంభించుకుంటున్నాం. ఇటీవల గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నాం'' అని రాష్ట్రపతి హర్షం వ్యక్తంచేశారు. బడ్జెట్‌లో రైతులు, మహిళలు, పేదలు, యువతకు ప్రాధాన్యం ఉంటుందని ఆమె తెలిపారు.

**రాష్ట్రపతి ప్రసంగంలోని ముఖ్యాంశాలివే..**

- మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే సర్కారు.. గత ప్రభుత్వాల పాలనతో పోలిస్తే మూడు రెట్లు వేగంతో పనిచేస్తోంది. త్వరలో ప్రపంచంలో మూడో ఆర్థికవ్యవస్థగా భారత్ మారనుంది.
- పేదరిక నిర్మూలన కోసం అనేక పథకాలు అమలుచేస్తున్నాం. 25 కోట్ల మందిని దారిద్ర్యం నుంచి బయటకు తీసుకొచ్చాం. అర్హులందరికీ లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలను వేగంగా అమలుచేస్తున్నాం.
- మధ్యతరగతి ప్రజల

మిగతా2లో...



## నేను కొడితే మామూలుగా ఉండదు!

- ఏడాది పాలనలో రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించారు
- కాంగ్రెస్ వాళ్లు కనబడితే జనాలు కొట్టేలా ఉన్నారు
- పాలనా వైఫల్యాలను నిలదీస్తే కేసులు పెడుతున్నారు
- నేను చెప్పినా ప్రజలు వినలేదు.. అత్యాశకు పోయి కాంగ్రెస్‌కు ఓటేశారు
- రైతుబంధుకు రాం రాం.. దళితబంధుకు జై భీం చెబుతారని చెప్పా
- ప్రత్యక్ష పోరాటాలకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధం కావాలి
- కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు..!

**విశ్వంభర, జహీరాబాద్:**



బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు కీలక వ్యాఖ్యలు చేశారు. తాను కొడితే మామూలుగా కాదు.. గట్టిగా కొట్టడం తన అలవాటన్నారు. జహీరాబాద్ బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజలు సంతోషంగా లేరన్నారు. గంభీరంగా, మౌనంగా ఈ ప్రభుత్వాన్ని చూస్తున్నానన్నారు. తాను ఎన్నో ప్రభుత్వాలను చూశానని.. ఇలాంటి ప్రభుత్వాన్ని మాత్రం చూడలేదన్నారు. ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందని, కాంగ్రెస్

మిగతా2లో...



నేడే కేంద్ర బడ్జెట్

## మధ్య తరగతి ప్రజల ఆశలు తీరేనా?

- ప్రజాకర్షక పథకాలకు ఈసారి పెద్దపీట వేసే అవకాశం
- మహిళలకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా పథకాలు ప్రకటించే అవకాశం
- ఉచిత ఆహార ధాన్యాలు, పీఎంఏవై, జాతీయ ఉపాధి హామీ పథకం కేటాయింపులు పెంచే అవకాశం
- సామాజిక భద్రతను మరింత విస్తరించే అవకాశం
- కొత్తచర్చకు దారితీసిన మోదీ వ్యాఖ్యలు

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**

భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా పేర్కొనే మధ్యతరగతి.. ఇటీవల అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. ధరలు, జీవన వ్యయాలు ఆర్థిక భారం మోపుతుండగా, వేతనాలు మాత్రం పెరగడం లేదు. రాబోయే బడ్జెట్‌లో సామాన్యులు చూడాలనుకుంటున్న కీలక మార్పులు చూద్దాం. ట్యాక్స్ శ్లాబ్ సవరణలు ఎగ్జంప్షన్ లిమిట్

మిగతా2లో...

కేంద్ర ప్రభుత్వం నేడు పార్లమెంట్‌లో 2025 బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఎలాంటి ప్రకటనలు చేస్తారోనని అందరూ ఆశగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా మధ్య తరగతి ప్రజలు తమ ఆర్థిక భారాన్ని తగ్గించి, జీవన నాణ్యతను మెరుగుపరిచే ఉపశమన చర్యల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా పేర్కొనే మిడిల్ క్లాస్.. ఇటీవల అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. ధరలు, జీవన వ్యయాలు ఆర్థిక భారం మోపుతుండగా, వేతనాలు మాత్రం పెరగడం లేదు. రాబోయే బడ్జెట్‌లో సామాన్యులు తమ ఆశలు తీరుతాయా అని ఆశగా ఎదురుచూస్తున్నారు.

## ఆలయాల్లో వీఐపీ దర్శనానికి వ్యతిరేకంగా పిల్


- విచారణకు నిరాకరించిన సుప్రీంకోర్టు
- ఎవరికీ ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వకూడదనేది మా అభిప్రాయం
- అయినప్పటికీ, ఎటువంటి ఆదేశాలనూ ఇవ్వలేం
- సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్



2

## కేజ్రీవాల్‌కు బిగ్ షాక్

- ఎన్నికల వేళ పార్టీని వీడిన ఏడుగురు ఎమ్మెల్యేలు
- ప్రాథమిక సభ్యత్వాలకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటన



2



## నీటి విషయంలో నిజాలు చెప్పాలి

- కేసీఆర్ పై అక్కసుతో కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం
- మేడిగడ్డ బ్యారేజీ మేరునగధీరుడిలా నిలబడింది
- కాంగ్రెస్ ప్రభుత్వం రాజనీతిజ్ఞతను ప్రదర్శించాలి
- సీఎం రేవంత్ రెడ్డి మిస్ గైడెడ్ మిస్సెల్ లా పనిచేస్తున్నారు
- నీళ్లు - నిజాలు రౌండ్ టేబుల్ సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

3



## ప్రతి పేద కుటుంబానికి ఇల్లు ఉండాలన్నది నా కల

- ఆ కలను తీర్చేందుకు ఇక్కడ బిజెపి ప్రభుత్వం ఏర్పడాలి
- ఆప్ దేశ రాజధానిని ఏటీఎంలా మార్చింది
- ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో మోదీ

2

## అసెంబ్లీకి రండి.. లెక్కలు చెబుతాం

- ఫామ్‌హౌస్‌లో ఉండి చెప్పటం కాదు..
- కేసీఆర్‌కు చిత్తశుద్ధి, నిజాయతీ ఉంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి
- అనేక హామీలు ఇచ్చి మాట తప్పిన చరిత్ర ఆయనది
- రూ.7లక్షల కోట్లు అప్పు చేసి 2023లో మాకు అప్పగించారు
- పదేళ్లు పాలించి ప్రజల దగ్గరకు వెళ్తే పార్లమెంట్ ఎన్నికల్లో డిపాజిట్లు కోల్పోయారు
- సీఎం రేవంత్ రెడ్డి

2



మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి

అంతేగా!



## ఏ ఎన్నిక వచ్చినా గెలిచినప్పుడే సుస్థిర పాలన

- తొలిసారి గెలిచిన, కొత్తగా వచ్చిన నేతలు మరింత చిత్తశుద్ధితో పని చేయాలి
- ఎన్డీఏ కూటమి నేతలతో టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

3



నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 98 | ₹ 120 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 174 | ₹ 198 |

## హైదరాబాద్‌లో గులియన్ బారే సిండ్రోమ్ కేసు నమోదు

- సిద్దిపేట మహిళకు జీబీఎస్ ఉన్నట్లు వైద్యులు నిర్ధారణ
- ఇది అంటువ్యాధి కాదు.. చికిత్సతో నయం చేయొచ్చన్న వైద్యులు



2

## అంకితభావంతో పని చేయాలి

- సమాజానికి మేలు చేసేలా సేవలు అందించాలి
- మాదకద్రవ్యాల బారినుంచి యువతను కాపాడేందుకు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి
- ఎక్సైజ్ అకాడమీలో మంత్రి జూపల్లి కృష్ణారావు ఆకస్మిక తనిఖీ

2

## హైదరాబాద్‌లో గులియన్ బారే సిండ్రోమ్ కేసు నమోదు

**విశ్వంభర, హైదరాబాద్:** నగరంలో గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) కేసు నమోదైంది. సిద్దిపేట మండలానికి చెందిన మహిళకు జీబీఎస్ ఉన్నట్లు వైద్యులు నిర్ధరించారు. బాధితురాలు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతోంది. ఇప్పటికే మహారాష్ట్రలో వంద వరకు ఈ కేసులు నమోదైన విషయం తెలిసిందే. గత కొన్ని రోజులుగా మహారాష్ట్రలో గులియన్ బారే సిండ్రోమ్ కేసులు నమోదవడం ఆందోళనకు గురిచేస్తోంది. బ్యాక్టీరియా, వైరల్ ఇన్ఫెక్షన్ కారణంగా బలహీన రోగనిరోధక శక్తి కలిగిఉన్న వ్యక్తులు ఈ జీబీఎస్ బారినపడే అవకాశాలు ఉంటాయని వైద్యులు వెల్లడించారు. శరీరానికి సోకిన ఇన్ఫెక్షన్‌కు ప్రతిస్పందించే రోగ నిరోధక వ్యవస్థ పొరపాటున నరాలపై దాడి చేసే అరుదైన పరిస్థితి ఇది. ఆ రుగ్మత బారినపడిన వారికి ఒళ్లంతా తిమ్మిరిగా అనిపించడం, కండరాలు బలహీనంగా మారడం, డయేరియా, పొత్తికడుపు నొప్పి, జ్వరం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. కలుషిత ఆహారం, నీటి ద్వారా ఆ బ్యాక్టీరియా సోకుతుందని వైద్యులు చెబుతున్నారు. అయితే, ప్రజలు భయాందోళనకు గురికావొద్దని, జీబీఎస్ అంటువ్యాధి కాదని, చికిత్సతో నయం చేయొచ్చని వైద్యులు వెల్లడించారు.

## ఆలయాల్లో వీఐపీ దర్శనానికి వ్యతిరేకంగా పిల్

**న్యూఢిల్లీ:** హిందూ దేవాలయాల్లో ప్రముఖులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ, భగవంతుడిని ప్రత్యేకంగా దర్శనం చేసుకునే అవకాశం కల్పించడం, వీఐపీ దర్శనాల కోసం అదనపు రుసుమును వసూలు చేయడం ఆపాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)ను సుప్రీంకోర్టు శుక్రవారం తిరస్కరించింది. ఎవరికీ ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వకూడదనేది తమ అభిప్రాయమని, అయినప్పటికీ, ఎటువంటి ఆదేశాలనూ ఇవ్వలేమని సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ చెప్పారు.ఈ పిల్‌ను డిస్మిస్ చేసినంత మాత్రానికి అధికారులు తగిన చర్యలు చేపట్టడంపై ఎటువంటి ఆంక్షలు లేవని స్పష్టం చేశారు. తమ వినతులపై హోం మంత్రిత్వ శాఖ స్పందించి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వానికి మాత్రమే ఆదేశాలు జారీ చేసిందని పిటిషనర్ తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న హిందూ దేవాలయాల నిర్వహణ, పరిపాలనను పర్యవేక్షించేందుకు జాతీయ స్థాయిలో ఓ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు.

## ప్రతి పేద కుటుంబానికి ఇల్లు ఉండాలన్నది నా కల

**ఢిల్లీ:** తనకు సొంతిల్లు లేదని, కానీ ప్రతి పేద కుటుంబానికి ఇల్లు ఉండాలన్నది తన కల అని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. తన రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకోవడానికి ఆమ్‌ఆద్మీపార్టీ దేశ రాజధానిని ఒక ఏటీఎంలా మార్చిందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఢిల్లీలోని ద్వారకా ప్రాంతంలో మోదీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆప్‌పై విమర్శలు గుప్పించారు. ''నాకు సొంతిల్లు లేకపోయినా.. ప్రతి పేదవాడికి కాంక్రీట్ ఇల్లు ఉండాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాన్ని ఆప్ అడ్డుకుంటోంది. ఢిల్లీలో పేదల కోసం కేంద్రం నిర్మించిన ఇళ్లను ఆప్ కేటాయించడం లేదు. కోట్ల రూపాయలతో శీష్‌మహల్‌ను నిర్మించుకున్నవారికి ఈ పేదల బాధ అర్థంకాదు. పేదల సొంతిల్లు కలను తీర్చేందుకు ఇక్కడ బిజెపి ప్రభుత్వం ఏర్పడాలి'' అని మోదీ అన్నారు.''మేము ఢిల్లీలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వెంటనే ఆప్ అవినీతిపై చర్యలు తీసుకుంటాం. దోపిడీకి పాల్పడిన వారిని జవాబుదారీ చేస్తాం. వారు తీసుకున్న వాటిని వెనక్కి రప్పిస్తాం. అసెంబ్లీ మొదటి సెషన్‌లోనే కాగ్ నివేదికను సమర్పిస్తాం. అది ఆప్ సర్కార్ కుంభకోణాలను బయటపెడుతుంది'' అని వ్యాఖ్యానించారు. దేశాన్ని పాలించే అవకాశాన్ని తనకు ప్రజలు పలుమార్లు కల్పించారని, అలాగే ఢిల్లీని పరిపాలించే అవకాశాన్ని ఇవ్వాలని ఓటర్లను కోరారు. ఆప్ అందరితో గొడవలు పెట్టుకోవడంలో బిజీగా ఉందని మండిపడ్డారు. యమునా నదిని విషతుల్యం చేశారంటూ అరవింద్ కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలను ఉద్దేశించి మోదీ ఈ విధంగా వ్యాఖ్యానించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ ఢిల్లీలో యమునా నది కాలుష్యంపై రగడ నానాటికి ముదురుతోంది. ఎన్నికలను ప్రభావితం చేయడానికి హర్యానా ముఖ్యమంత్రి కుట్రచేస్తున్నారని కేజ్రీవాల్ ఆరోపించారు. ''జనవరి 15 తర్వాత ఆశ్చర్యకరంగా నీటిలో అమ్మోనియం మోతాదు అధికమైనట్లు గుర్తించాం. దానికి మమ్మల్ని బాధ్యులను చేయాలని కుట్ర పన్నినట్లు పసిగట్టిన సీఎం ఆతిశీ ఈ విషయం ప్రజలకు తెలిసేలా చేశారు. మేం చేస్తున్న పోరాటం వల్ల ఇప్పుడు నీటిలో అమ్మోనియం స్థాయిలు 2.1కు తగ్గాయి. దీన్నిబట్టి ఇందులో హర్యానా ప్రభుత్వ హస్తం ఉన్నట్లు స్పష్టమవుతోంది'' అని కేజ్రీవాల్ అన్నారు.

## కేజ్రీవాల్‌కు బిగ్ షాక్..

**ఢిల్లీ:** మరో ఐదు రోజుల్లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనున్న వేళ ఢిల్లీలో కేజ్రీవాల్ కు గట్టి షాక్ తగిలింది. భాజపాతో నువ్వా నేనా అన్నట్లుగా పోటీ నెలకొన్న అత్యంత కీలక సమయంలో ఏడుగురు ఎమ్మెల్యేలు ఆమ్ ఆద్మీ పార్టీని వీడారు. పార్టీలో తమ ప్రాథమిక సభ్యత్వాలకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఎమ్మెల్యేలు భావనా గౌర్, మదన్‌లాల్ కేజ్రీవాల్‌పైనా, పార్టీపైన విశ్వాసం కోల్పోయినట్లు తెలిపారు. ఈ మేరకు ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు లేఖలు పంపారు. 'మీ పట్ల, పార్టీ పట్ల విశ్వాసం కోల్పోయాను. అందువల్లే ఈ నిర్ణయం తీసుకున్నా. దయచేసి నా రాజీనామాను ఆమోదించండి' అని కేజ్రీవాల్‌కు రాసిన లేఖలో భావనా గౌర్ పేర్కొన్నారు. ఆప్‌లో అవినీతి, ఇతర అంశాలను లేవనెత్తుతూ పలువురు ఎమ్మెల్యేలు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. తనతో పాటు, మరో ఆరుగురు ఎమ్మెల్యేలు ఆప్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ఎమ్మెల్యే మదన్‌లాల్ తెలిపారు. రాజీనామా చేసిన వారిలో త్రిలోక్‌పురి ఎమ్మెల్యే రోహిత్ మెహ్రౌలియా, జనక్‌పురి ఎమ్మెల్యే రాజేశ్ రిషి, కస్తూర్బానగర్ ఎమ్మెల్యే మదన్‌లాల్, మెహ్రౌలి ఎమ్మెల్యే నరేశ్ యాదవ్‌తో పాటు పవన్ శర్మ (ఆదర్శ్‌నగర్) బీఎస్ జూన్ (బిజ్వాసన్) ఉన్నారు. వీరంతా తమ రాజీనామా లేఖలను ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ రాం నివాస్ గోయెల్‌కు పంపినట్లు మదన్‌లాల్ వెల్లడించారు. అయితే, ఈసారి ఎన్నికల్లో తిరిగి పోటీ చేసేందుకు వీరెవరికీ ఆప్ నుంచి అవకాశం రాకపోవడం గమనార్హం. మొత్తం 70 స్థానాలు ఉన్న ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5న ఎన్నికల పోలింగ్ జరగనున్న విషయం తెలిసిందే. ఫిబ్రవరి 8న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.



# మధ్య తరగతి ప్రజల ఆశలు తీరేనా?

**మొదటిపేజీ తరువాయి**

పెంచడమే కాకుండా, ఇన్‌కమ్ ట్యాక్స్ శ్లాబ్‌లలో సవరణ ఆశిస్తున్నారు. మధ్య-ఆదాయ వర్గాలకు ఆర్థిక ఉపశమనం కల్పించేలా తక్కువ పన్ను రేట్లు విధించాలని కోరుతున్నారు. ముఖ్యంగా ఉద్యోగ వర్గం ఎగ్జమ్షన్, ట్యాక్స్ శ్లాబ్ సవరణ డిమాండ్ చేస్తోంది. కొత్త పన్ను విధానంలో రూ.3- రూ.7 లక్షలు మధ్య సంపాదిస్తున్న వ్యక్తులకు పన్ను రేటు తగ్గించాలని నిపుణులు సూచిస్తున్నారు. మధ్యతరగతి ప్రజలు తమ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవడానికి చాలా కాలంగా ట్యాక్స్ రిలాక్సేషన్స్ కోరుతున్నారు. ప్రస్తుతం కొత్త పన్ను విధానంలో రూ.3 లక్షలుగా ఉన్న ట్యాక్స్ ఎగ్జమ్షన్ లిమిట్‌ని రూ.5 లక్షలు పెంచాలని కోరుతున్నారు. ఈ నిర్ణయంతో పన్ను చెల్లింపుదారులకు మరింత డబ్బు ఆదా అవుతుందని, వ్యయం, ఆర్థిక వృద్ధిని పెంచడంలో సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. పొదుపును ప్రోత్సహించడానికి ప్రభుత్వం కొత్త పన్ను విధానంలో సెక్షన్ 80C, 80D, 10(13A) వంటి డిడక్షన్‌లు చేర్చాలని కూడా సూచిస్తున్నారు.

**కొత్త చర్చకు దారితీసిన ప్రధాని వ్యాఖ్యలు**

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభం వేళ ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలు కొత్త చర్చకు దారితీశాయి. రేపటి బడ్జెట్‌లో పేద, మధ్యతరగతితో పాటు మహిళలకు పెద్దపీట వేస్తారన్న అంచనాలు పెంచేందుకు కారణమయ్యాయి. పేదలు, మధ్యతరగతిపై మహాలక్ష్మి కటాక్షం చూపించాలంటూ ఆయన పేర్కొనడం ఇందుకు నేపథ్యం. దీంతో పాటు సమ్మిళిత అభివృద్ధి పెట్టుబడులు, ఆవిష్కరణలే లక్ష్యంగా దూసుకెళుతున్నామని ఆయన పేర్కొనడంతో ప్రజాకర్షక పథకాలకు ఈసారి పెద్దపీట వేస్తారన్న అంచనాలు నెలకొన్నాయి. వృద్ధికి ఊతం ఇచ్చేలా మధ్యతరగతికి పన్ను ప్రయోజనాలు, మహిళలకు సంబంధించిన పథకాలు ప్రకటించొచ్చన్న ఆశలు రేపాయి.

- బడ్జెట్ వచ్చిన ప్రతిసారీ ఆదాయపు పన్ను ఊరట కల్పిస్తారంటూ వేతన జీవుల ఆశగా ఎదురుచూస్తుంటారు. అయితే వృద్ధి నెమ్మదించిన నేపథ్యంలో ఈసారి మార్పులు ఉండొచ్చన్న అంచనాలు ఉన్నాయి. కొత్త పన్ను విధానంలో శ్లాబుల సవరణ, స్టాండర్డ్ డిడక్షన్ పెంపు, రిబేట్ పెంపు వంటి అంశాలపై ఉద్యోగులు ఆశపెట్టుకున్నారు. ప్రధాని మోడీ వ్యాఖ్యలు ఒకవేళ బడ్జెట్‌లో ప్రతిఫలిస్తే మధ్యతరగతికి పెద్ద శుభవార్తే అవుతుంది.
- మహిళలకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా పథకాలు ఈసారి బడ్జెట్‌లో ప్రకటించే అవకాశం ఉందన్న విశ్లేషకులు భావిస్తున్నారు. మహిళలకు నైపుణ్య శిక్షణ కల్పించండంతో పాటు జన్‌ధన్ యోజన, ముద్ర యోజన వంటి పథకాలు కేటాయింపులు పెంచడం వంటివి చేయొచ్చని భావిస్తున్నారు. మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ గడువు ఈ మార్చితో ముగియనుండడంతో దాన్ని కొనసాగించడం, లేదా కొత్త పథకాన్ని తీసుకురావొచ్చని భావిస్తున్నారు.
- పేదలకు సంబంధించి ఇప్పటికే ఉచిత ఆహార ధాన్యాలు, పీఎంఏవై, జాతీయ ఉపాధి హామీ పథకం వంటి పథకాలు అమలవుతున్నాయి. వీటిని కేటాయింపులు పెంచడంతో పాటు సామాజిక భద్రతను మరింత విస్తరించే అవకాశం ఉందని భావిస్తున్నారు. మరి ప్రధాని మోడీ వ్యాఖ్యలు బడ్జెట్‌లో ప్రతిబింబిస్తాయా? లేదా? అన్నది మరికొన్ని గంటల్లో తెలిసిపోతుంది.



# గ్లోబల్ ఇన్నోవేషన్ పవర్‌హౌస్‌గా భారత్

**మొదటిపేజీ తరువాయి**

సొంతింటి కలను నెరవేరుస్తున్నాం. అదనంగా మూడు కోట్ల కుటుంబాలకు ఇళ్ల నిర్మాణం కోసం ప్రధానమంత్రి ఆవాస్ యోజనను పొడిగించాం.



- ఆయుష్మాన్ భారత్ పథకం కింద.. 70 ఏళ్లు పైబడిన ఆరు కోట్ల మంది వృద్ధులకు ఆరోగ్య బీమా అందిస్తోంది. అమృత్ భారత్, నమో భారత్ రైళ్లు ప్రవేశపెడుతున్నాం.
- విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది. యువతకు నూతన ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. నూతన విద్యా విధానంతో ఆధునిక విద్యా వ్యవస్థను ఏర్పాటుచేశాం.
- సంస్కరణలు వేగవంతం చేశాం. ఒకే దేశం-ఒకే ఎన్నిక, వక్ఫ్ సవరణ బిల్లు అమలు దిశగా సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నాం.
- దేశంలో కార్పొరేట్ సంస్థలకు మహిళలు నాయకత్వం వహిస్తున్నారు. ఒలింపిక్ పతకాలు సాధిస్తూ దేశం గర్వించేలా చేస్తున్నారు. వారి సాధికారకతకు కృషి చేస్తున్నాం. మారుమూల ప్రాంతాల్లో డిజిటల్ సేవల కల్పనలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు.
- చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు గొప్ప ముందడుగు. నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ కింద 91 లక్షలకు పైగా స్వయం సహాయక బృందాలకు సాధికారికత కల్పిస్తున్నాం. 3 కోట్ల మందిని లక్‌పతీ దీదీగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.
- భారత్‌ను గ్లోబల్ ఇన్నోవేషన్ పవర్‌హౌస్‌గా మార్చడమే మా లక్ష్యం. నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను ప్రారంభించాం. కృత్రిమ మేధ రంగంలో 'భారత ఏఐ మిషన్'ను మొదలుపెట్టాం.
- భారత్ తన సొంత మానవ సహిత అంతరిక్ష ప్రయోగం గగన్‌యాన్‌ను ప్రయోగించే రోజు ఎంతో దూరంలో లేదు.
- ఎంఎస్ఎంఈలకు క్రెడిట్ గ్యారెంటీ పథకాలు, ఇ-కామర్స్ ఎగుమతి కేంద్రాలు దేశంలో అన్ని రంగాల్లో వ్యాపారాలను ప్రోత్సహిస్తున్నాయి.
- సైబర్ సెక్యూరిటీలో సమర్థత కోసం నిరంతరం కృషి చేస్తున్నాం. డిజిటల్ మోసాలు, సైబర్ నేరాలు, డీప్‌ఫేక్ వంటివి సామాజిక, ఆర్థిక, దేశ భద్రతకు పెను సవాళ్లుగా మారాయి.
- ప్రపంచ వేదికపై డిజిటల్ టెక్నాలజీలో భారత్ కీలకపాత్ర పోషిస్తోంది. మన యూపీఐ లావాదేవీల వ్యవస్థ విజయాన్ని అభివృద్ధి చెందిన దేశాలు కూడా ప్రశంసించాయి.
- భారత మెట్రో నెట్‌వర్క్ 1000 కిలోమీటర్ల మైలురాయిని దాటింది. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద మెట్రో నెట్‌వర్క్‌గా నిలిచింది.
- ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం దేశవ్యాప్తంగా 1.75లక్షల ఆరోగ్య మందిర్‌లను ఏర్పాటుచేశాం. క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల కోసం వారు ఉపయోగించే పలు ఔషధాలపై కస్టమ్ సుంకాన్ని రద్దు చేశాం. గర్భిణులు, పిల్లల వ్యాక్సినేషన్ కోసం యు-విన్ పోర్టల్‌ను ప్రారంభించాం.
- రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు సాగు ఉత్పత్తులకు గిట్టుబాటు ధర అందిస్తున్నాం. కచ్చితమైన వాతావరణ సమాచారాన్ని అందించేందుకు రూ.2000 కోట్లతో 'మిషన్ మౌసం'ను ప్రారంభించాం. సహకార రంగంలో అనేక ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం.
- ఆర్టికల్ 370 తర్వాత జమ్మూకశ్మీర్‌లో పరిస్థితులు మెరుగయ్యాయి. సంస్కరణలు, పనితీరు, పరివర్తన అనేవి ప్రభుత్వ పాలనకు బలమైన స్తంభాలుగా మారాయి.
- సరిహద్దుల రక్షణ, అంతర్గత భద్రత కోసం ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. వామపక్ష అతివాదానికి వ్యతిరేకంగా పోరాటం చివరిదశకు చేరింది. నక్సల్స్ ప్రభావిత జిల్లాల సంఖ్య 38కు తగ్గింది. రక్షణ రంగంలో స్వావలంబన దిశగా కీలక అడుగులు వేస్తున్నాం.
- సామాజిక, ఆర్థిక, రాజకీయ సుస్థిరతలో ఈ ప్రపంచానికి భారత్ ఆదర్శంగా నిలిచింది. మన ముందున్న ఏకైక లక్ష్యం.. 'వికసిత్ భారత్' నిర్మాణమే..!

# అసెంబ్లీకి రండి.. లెక్కలు చెబుతాం

**విశ్వంభర, మొగిలిగిద్ద:** ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను బీఆర్ఎస్ అప్పుల రాష్ట్రంగా మార్చిందని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. 150 ఏళ్లు పూర్తి చేసుకున్న రంగారెడ్డి జిల్లా మొగిలిగిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం ప్రసంగించారు.

''రూ.7లక్షల కోట్లు అప్పు చేసి 2023లో మాకు అప్పగించారు. గత ప్రభుత్వం రూ.18వేల కోట్లే రుణమాఫీ చేసింది. గత ప్రభుత్వం చేసిన రుణమాఫీ వడ్డీలకే సరిపోయింది. మేం అధికారంలోకి వచ్చిన 60 రోజుల్లోనే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేశాం. రుణమాఫీ చేయలేదంటున్న కేసీఆర్ అసెంబ్లీకి వస్తే లెక్కలు చెబుతాం. ఫామ్‌హౌస్‌లో ఉండి సోది చెప్పటం కాదు.. అసెంబ్లీకి రండి.. లెక్కలు చెబుతాం. ఏ గ్రామంలో ఏ రైతుకు ఎంత రుణమాఫీ చేశామో శాసనసభలో పెడతాం. కేసీఆర్‌కు చిత్తశుద్ధి, నిజాయతీ ఉంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి. రైతు భరోసా ఎగ్గొడతారని కేసీఆర్ చెబుతున్నారు. మీలాగా మాట తప్పే వ్యక్తిని కాదు. దళితులకు 3 ఎకరాల భూమి, దళిత ముఖ్యమంత్రి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అని అనేక హామీలు ఇచ్చి మాట తప్పిన చరిత్ర కేసీఆర్‌ది. పదేళ్లు పాలించి ప్రజల దగ్గరకు వెళ్తే పార్లమెంట్ ఎన్నికల్లో డిపాజిట్లు కోల్పోయారు. పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేస్తానని హామీ ఇచ్చి.. ఇక్కడి ప్రాజెక్టులను పండబెట్టారు''



**సోషల్ మీడియాలో లైక్‌లు చూసి సంబరపడుతున్నారు**

''కేసీఆర్ రద్దైన వెయ్యి నోటు లాంటి వారు.. ఆయనకు విలువలేదు. ఫామ్‌హౌస్‌లో ఉన్న ఆయనకు ప్రజలతో సంబంధాలు తెగిపోయినట్లున్నాయి. ప్రజలు తిరస్కరించినా భారాస మారలేదు. భారాస పదేళ్లలో ఇవ్వలేని ఉద్యోగాలను ఏడాదిలో ఇచ్చాం. సోషల్ మీడియాలో నాకంటే ఎక్కువ లైక్‌లు వచ్చాయంటున్నారు. కేంద్రమంత్రి, సీఎంగా చేసిన కేసీఆర్ సోషల్ మీడియాలో లైక్‌లు చూసి సంబరపడుతున్నారు. అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొంటే. మీరో.. నేనో తేల్చుకుందాం. ప్రజలు బాధపడుతున్నారని కేసీఆర్ అంటున్నారు. ఎవరూ బాధపడటం లేదు. రూ.2లక్షల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ రూ.10లక్షలు, రైతు భరోసా పథకాలు అమలు చేస్తున్నాం'' అని సీఎం వివరించారు.

**విద్యపై చేసేది ఖర్చు కాదు.. భవిష్యత్ పెట్టుబడి...**

రాష్ట్ర బడ్జెట్‌లో రూ.21వేల కోట్లు విద్యాశాఖ కోసం కేటాయించామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మొగిలిగిద్దకు దాదాపు రూ.16 కోట్లు నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ మంజూరు చేస్తున్నట్టు సీఎం ప్రకటించారు.

''గత ప్రభుత్వ హయాంలో టీచర్ నియామకాలు జరగలేదు. మా ప్రభుత్వం రాగానే 11వేల టీచర్ పోస్టులు భర్తీ చేశాం. గతంలో నోటిఫికేషన్లు ఇస్తే సంవత్సరాల తరబడి నియామక ప్రక్రియ జరిగేది. మా ప్రభుత్వం 55 రోజుల్లోనే డీఎస్సీ నియామక ప్రక్రియ పూర్తి చేసింది. గత ప్రభుత్వం వర్సిటీలను నిర్లక్ష్యం చేసింది. భారాస హయాంలో వర్సిటీలు పునరావాస కేంద్రాలుగా మారాయి. మా ప్రభుత్వం రాగానే వీసీలను నియమించాం. ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసు 65 ఏళ్లకు పెంచాం. 21వేల మంది టీచర్లకు పదోన్నతులు కల్పించాం. ఎలాంటి వివాదం లేకుండా 35 వేల మంది ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ చేపట్టాం. ఎందరో ప్రముఖులు మొగిలిగిద్ద పాఠశాలలో చదివారు. ఈ పాఠశాలను అద్భుతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. విద్యపై చేసేది ఖర్చు కాదు.. భవిష్యత్‌పై పెట్టుబడి. విద్యాశాఖను నా దగ్గరే ఉంచుకొని నిత్యం పర్యవేక్షిస్తున్నా'' అని సీఎం తెలిపారు.



## అంకితభావంతో పని చేయాలి

**విశ్వంభర, హైదరాబాద్ :** బండ్లగూడలోని ఎక్సైజ్ అకాడమీలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆకస్మిక తనిఖీ చేశారు. అకాడమీ పనితీరును అధికారులు మంత్రికి వివరించారు. అకాడమీ అంతా కలియతిరిగిన మంత్రి ఆయా విభాగాల పనితీరు తెలుసుకున్నారు. అనంతరం ప్రస్తుతం అకాడమీలో శిక్షణ పొందుతున్న 129 మంది మంది మహిళా ట్రైనీ కానిస్టేబుళ్లతో సంభాషించారు. శిక్షణ తరగతుల్లో చెబుతున్న పాఠాలు, ఫిజికల్ ట్రైనింగ్ గురించి చర్చించారు. అకాడమీలో భోజనం ఎలా ఉందని? నీటి సమస్య ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. అకాడమీలో అందుతున్న సేవలు, అక్కడి సౌకర్యాలు, శిక్షణ తరగతులు, ఇతర అంశాల గురించి శిక్షణ పొందుతున్న ఎక్సైజ్ మహిళా కానిస్టేబుల్స్ ను అడిగి తెలుసుకున్నారు. ట్రైనీలను ఉద్దేశించి మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న పోటీని తట్టుకుని.. మీరంతా ఎంతో కష్టపడి, స్వయంకృషితో ఈ ఉద్యోగానికి ఎంపికయ్యారని అభినందించారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. సమాజానికి మేలు చేసేలా సేవలు అందించాలని, అంకితభావంతో పని చేయాలని కోరారు. సమాజ శ్రేయస్సుకు మాదకద్రవ్యాల నియంత్రణ ఎంతో ముఖ్యమని, గంజాయి, డ్రగ్స్, అక్రమ మద్యం, సారా అమ్మకాలు, రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టి, వాటి బారి నుంచి యువతను కాపాడేందుకు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. మంత్రి వెంట ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తజా రిజ్వీ, అబ్కారీ శాఖ కమిషనర్ చేవూరు హరికిరణ్ ఉన్నారు.

## నేను కొడితే మామూలుగా ఉండదు..!

**మొదటిపేజీ తరువాయి**

వాళ్లు కనబడితే జనాలు కొట్టేలా ఉన్నారన్నారు. ఏ ప్రభుత్వం కావాలని కాంగ్రెస్ సోషల్ మీడియాలో ఓటింగ్ పెట్టారన్నారు. ఇప్పుడే మన ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వమే కావాలని ఓట్లు వేశారన్నారు. కాంగ్రెస్ పాలకులు రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించారని ఆరోపించారు. గురుకులాల్లో చదువు అగమ్యగోచరమైందని.. పురుగుల అన్నం పెడుతున్నారని మండిపడ్డారు. తాను చెప్పినా ప్రజలు వినలేదని.. అత్యాశకు పోయి కాంగ్రెస్‌కు ఓటేశారన్నారు. రైతుబంధుకు రాం రాం.. దళితబంధుకు జై భీం చెబుతారని తాను ఎన్నికల సమయంలోనే చెప్పానని గుర్తు చేశారు. తులం బంగారానికి ఆశపడి కాంగ్రెస్‌కు ఓటు వేశారన్నారు. రాబోయే రోజుల్లో విజయం మనదేనన్నారు. మన విజయం తెలంగాణ ప్రజల విజయం కావాలన్నారు. ప్రత్యక్ష పోరాటాలకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పోరాటం చేస్తే తప్ప ఈ ప్రభుత్వం దిగిరాదన్నారు. ఫిబ్రవరి నెలాఖరులో భారీ సభ పెడుతామని.. బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలని కోరారు. కాంగ్రెస్ పాలనలో భూముల ధరలు అమాంతం పడిపోయాయని.. రాష్ట్రంలో ప్రాజెక్టులు అక్కడే ఆగిపోయాయని మండిపడ్డారు. సంగమేశ్వర, బసవేశ్వర, కాళేశ్వరం ప్రాజెక్టులను ఎండబెడుతున్నారంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని మబ్బులు ఇప్పుడే తొలగిపోయి నిజాలు బయటకు వస్తున్నాయన్నారు. మంచేదో చెడు ఏదో ప్రజలకు తెలుస్తుందన్నారు. మాట్లాడితే ఫామ్ హౌస్.. ఫామ్ హౌస్ అని బద్నాం చేస్తున్నారన్న కేసీఆర్.. ఫామ్ హౌస్‌లో పంటలు తప్ప ఏముంటాయని ప్రశ్నించారు. ఓట్ల కోసం కాంగ్రెస్ ముస్లింలను వాడుకుంటుందన్నారు. సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల టెండర్లు ఎందుకు పిలువలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనపై అంతా అసంతృప్తే ఉందన్నారు. అన్ని వర్గాలను కాంగ్రెస్ ముంచిందన్నారు. పాలనా వైఫల్యాలను నిలదీస్తే కేసులు పెడుతున్నారని ఆరోపించారు.





# నీటి విషయంలో నిజాలు చెప్పాలి

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలోని సాగునీటి విషయాల్లో రాజకీయం మాని అసలు నిజాలు చెప్పాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని డిమాండ్ చేశారు.తెలంగాణ జలవనరులు, ప్రాజెక్టలపై "నీళ్లు - నిజాలు" అనే అంశంపై తెలంగాణ జాగృతి సంస్థ శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. సమావేశంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో పాటు మేధావులు, విశ్రాంత ఇంజనీర్లు పాల్గొన్నారు.ఈసందర్భంగా కవిత మాట్లాడారు. నీళ్ల విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం నీచ రాజకీయం చేస్తున్నదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విరుచుకుపడ్డారు.కేసీఆర్ పై అక్కసుతో కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేయడమే కాకుండా రైతులకు నీళ్లు ఇవ్వకుండా పొలాలను ఎండబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బురదరాజకీయానికి గోదావరి వరదను కూడా తట్టుకొని మేడిగడ్డ బ్యారేజీ మేరునగధీరుడిలా నిలబడిందని అన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... కేసీఆర్ పూర్తి చేసిన ప్రధాన ప్రాజెక్టుల్లో మిగిలి ఉన్న చిన్న చిన్న పనులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకు అతీయంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని, కాంగ్రెస్ ప్రభుత్వం రాజనీతజ్ఞతను ప్రదర్శించాలని సూచించారు. "వైఎస్ఆర్ ప్రారంభించిన ఆరోగ్య శ్రీని కేసీఆర్ కొనసాగించారు.. కాంగ్రెస్ ప్రారంభించిన ఉపాధి హామీ పథకాన్ని బీజేపీ కొనసాగిస్తోంది. అదే తరహాలో కేసీఆర్ ప్రారంభించిన పనులను సీఎం రేవంత్ రెడ్డి కొనసాగించాలి. సీఎం రేవంత్ రెడ్డి మిస్ గైడెడ్ మిస్సైల్ లా పనిచేస్తున్నారు. కేసీఆర్ శత్రువు అని రేవంత్ రెడ్డి అనుకుంటున్నారు.. కానీ మన జలాలను తరలిస్తున్న ఆంధ్రా పాలకులు మన శత్రువులని ఆయన గమనించాలి.'' అని వ్యాఖ్యానించారు. ఆంధ్ర కేడర్ లో పనిచేసిన ఆదిత్యానాథ్ దాస్ ను ఇరిగేషన్ సలహాదారు పదవి నుంచి తొలగించాలని, కృష్ణ ట్రైబ్యునల్ లో రాష్ట్రం తరఫున బలంగా వాదనలు వినిపించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ నాయకత్వంలో అవిశ్రాంతంగా పని చేస్తేనే కోటి ఎకరాల మాగాణంగా మారిందని, ఎంతో మంది మేధావుల, ఇంజనీర్ల కృషి ఫలతమే అనేక ప్రాజెక్టుల నిర్మాణమని తెలిపారు. తెలంగాణ సమగ్రాభివృద్ధిలో నీటి వనరులు ఒక ప్రధాన అంశంగా పెట్టుకొని ముందుకెళ్లామని, కానీ ఈ ప్రభుత్వం జలవనరుల రంగాన్ని విర్మిస్తున్నదని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో 60 ఏళ్లలో కేవలం 50 లక్షల ఎకరాలకు నీళ్లందించారని, కానీ తెలంగాణ ఏర్పడిన తర్వాత పదేళ్లలో కోటి ఎకరాలకుపైగా నీళ్లందించామని, కాలంతో పోటీ పడి ప్రపంచంలోనే అత్యద్భుతమైన కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ నిర్మించారని వివరించారు. మొత్తం కోటి 24 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా బిఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టులను పూర్తి చేశామని పేర్కొన్నారు.

మిషన్ కాకతీయ ద్వారా చెరువులను బాగు చేసుకొని 15 లక్షల ఎకరాలకు నీళ్లించుకోవడం జరిగిందని, కేవలం చెరువులను బాగు చేసుకోవడం వల్ల 9.6 టీఎంసీల నీటిని ఒడిసి పట్టుకున్నామని అన్నారు. అందుకు సాక్ష్యం తెలంగాణ ఏర్పడే సమయానికి 68 లక్షల టన్నుల వరి పండితే... 2022-23 నాటికి కోటి 68 లక్షల టన్నుల ధాన్యం పండిందని, వరి పండించే రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానానికి ఎదిగిందని స్పష్టం చేశారు. ఇన్ని చేసినా పదేళ్లలో ఏమి జరగలేదని కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు.

గతంలో కాంగ్రెస్, టీడీపీ పార్టీలు పరిపాలించి ప్రాజెక్టుల్లో పల్లేర్లు మొలిపించాయని, కాంగ్రెస్ నాయకులు పదవుల కోసం పైరవీలు చేసుకున్నారు తప్ప ప్రాజెక్టుల కోసం కొట్లాడలేదని మండిపడ్డారు. గట్టిగా జై తెలంగాణ అంటే... వెంటనే ఫేక్ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేసేవారని గుర్తు చేశారు. "వైఎస్ఆర్ పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు ద్వారా రాయలసీమ ప్రాంతానికి మన జలాలను తరలించారు. అదే ఒరవడిని జగన్, చంద్రబాబు కొనసాగించారు. అందులో భాగంగానే ఏపీ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల, పోలవరం-బనకచర్ల ప్రాజెక్టులను చేపడుతున్నాయి. ఇన్నాళ్లు కాంగ్రెస్, టీడీపీలే అన్యాయం చేశాయనుకుంటే... ఇప్పుడు వాటికి బీజేపీ తోడయ్యింది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు వద్ద కేంద్ర బలగాలను మోహరింపజేశారు. కృష్ణా జలాల దోపిడీని ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్ఎస్, జగన్ కొనసాగించారు. ఇప్పుడు గోదావరి నదిపై కూడా ఆంధ్రా నాయకుల కన్ను పడింది. రాష్ట్రంలో తెలంగాణ సోయితో పరిపాలనం జరగడం లేదు." అని వ్యాఖ్యానించారు. కేసులు వేసి ప్రాజెక్టులను అడ్డుకున్న నీచమైన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని ధ్వజమెత్తారు. జలవనరుల విషయాల్లో ఇతర రాష్ట్రాల్లో పార్టీలకు అతీతంగా ఒక్కటవుతారని, కానీ తెలంగాణ మాత్రం కాంగ్రెస్, బీజేపీ పార్టీలు రాజకీయం చేస్తున్నాయని ఎండగట్టారు. కేసీఆర్ నిర్మించిన ప్రాజెక్టులు పనికిరావని దుష్ప్రచారం చేస్తున్నారని, నీళ్లు ఇవ్వక రైతుల పొట్టకొడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సొంత జిల్లా, ఇరిగేషన్ శాఖ మంత్రి సొంత జిల్లాలో పంటను ఎండగొట్టారని ఉదాహరించారు. బీఆర్ఎస్ హయాంలోనే సీతారామ ఎత్తిపోతల పథకం పనులు దాదాపు పూర్తయ్యాయని, కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని ఆర్భాటంగా ప్రారంభించినా ఆ ప్రాజెక్టు ద్వారా చుక్క నీరు కూడా ఇవ్వలేదని చెప్పారు. రౌండ్ టేబుల్ సమావేశంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్ వీ ప్రకాశ్, సాగునీటి శాఖ మాజీ ఓఎస్డీ, విశ్రాంత ఇంజనీర్ శ్రీధర్ రావు దేశ్ పాండే, బీఆర్ఎస్ నాయకుడు పల్లె రవి కుమార్ గౌడ్, రిటైర్డ్ సీఈ ఖగేందర్, తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్స్ ఫోరం మాజీ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, తెలంగాణ ఇంజనీర్స్ జేఏసీ కార్యదర్శి వెంకటేశం, అంతర్ రాష్ట్ర వ్యవహారాల మాజీ ప్రభుత్వ సలహాదారు టంకశాల అశోక్, ఫ్లోరోసిస్ విమోచన సమితి నాయకులు కంచుకట్ల శ్రీనివాస్, తెలంగాణ గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, టీఎస్పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ దేవి ప్రసాద్, సీనియర్ జర్నలిస్టు కామెర నవీన్ కుమార్, బీసీ సంఘం నాయకుడు బొళ్ల శివశంకర్ , ఏల్చల దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

## ఏ ఎన్నిక వచ్చినా గెలిచినప్పుడే సుస్థిర పాలన

**విశ్వంభర, అమరావతి:** ఏ ఎన్నిక వచ్చినా గెలిచినప్పుడే సుస్థిర పాలన ఉంటుందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలపై ఎన్డీయే కూటమి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి ఎన్డీయే పక్షాలు సమన్వయ సమావేశాలు ఏర్పాటుచేసుకుని పని చేయాలన్నారు. ''తొలిసారి గెలిచిన, కొత్తగా వచ్చిన నేతలు మరింత చిత్తశుద్ధితో పని చేయాలి. రాత్రికి రాత్రే అన్నీ జరిగిపోతాయని మనం చెప్పట్లేదు. గాడి తప్పిన వ్యవస్థలను సరిదిద్దుతున్నాం. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత 16,347 టీచర్ పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తున్నాం. ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు తదితర అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'' అని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో ఎన్నికల నిర్వహణకు ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గాలు, శ్రీకాకుళం-విజయనగరం-విశాఖపట్నం ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 27న ఎన్నికల పోలింగ్ ఉంటుంది. మార్చి 3న ఫలితాలను వెల్లడించనున్నారు.

## సోనియా గాంధీ వ్యాఖ్యలు సరికాదు: రాష్ట్రపతి భవన్

ఢిల్లీ: బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ చేసిన వ్యాఖ్యలను రాష్ట్రపతి కార్యాలయం తప్పుబట్టింది. దేశంలోనే అత్యున్నత వ్యక్తి గౌరవానికి భంగం వాటిల్లేలా ఆమె ప్రవర్తించారని పేర్కొంది. రాష్ట్రపతి ప్రసంగంపై కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలు దురదృష్టకరమని తెలిపింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. కాంగ్రెస్ నేతలు మాట్లాడకుండా ఉండాల్సిందని హితవు పలికింది. ''నిజాన్ని ఎవరూ దాచలేరని రాష్ట్రపతి కార్యాలయం చెప్పదలచుకుంది. ప్రసంగం సమయంలో రాష్ట్రపతి అలసిపోయిటన్లు కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలు అవాస్తవం. అమె అసలు అలసిపోలేదు. అణగారిన వర్గాలు, మహిళలు, రైతుల కోసం మాట్లాడుతున్నప్పుడు ఆమెకు అలసట దరిచేరదు. రాష్ట్రపతి ప్రసంగంపై వ్యాఖ్యలు చేసిన నాయకులకు భారతీయ భాష, యాసలతో పరిచయం లేకపోయి ఉండొచ్చు. అందుకే రాష్ట్రపతి అలసిపోయినట్లు వాళ్లకు అనిపించొచ్చు. ఏదేమైనా రాజ్యాంగబద్ధంగా అత్యున్నత స్థానంలో ఉన్న వ్యక్తి గురించి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం. ఎట్టిపరిస్థితుల్లోనూ ఆమోదయోగ్యం కాదు'' అని రాష్ట్రపతి భవన్ ఓ ప్రకటనలో తెలిపింది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం పూర్తయిన అనంతరం సోనియా, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను మీడియా పలకరించింది. ఆ సందర్భంగా సోనియా మాట్లాడుతూ.. ''ప్రసంగం చివరకు వచ్చేసరికి రాష్ట్రపతి బాగా అలసిపోయారు. ఆమె మాట్లాడలేకపోయారు'' అంటూ బదులిచ్చారు. దీనిపై అధికార భాజపా కూడా తీవ్రంగా స్పందించింది. సోనియా గాంధీ వ్యాఖ్యలను తప్పుబట్టింది.''ఇవి అభ్యంతరకర వ్యాఖ్యలు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ వంటి నేతలు ఇలాంటి మాటలు మాట్లాడకూడదు. మరీ ముఖ్యంగా రాష్ట్రపతిని ఉద్దేశించి చేయకూడదు. ఆదివాసీ కుటుంబం నుంచి వచ్చిన ద్రౌపదీ ముర్ము.. రాష్ట్రపతిగా ఉన్నారు. కాంగ్రెస్ జమిందారీ మైండ్‌సెట్ ఆ విషయాన్ని అంగీకరించలేకపోతోంది. అందుకే ఆమె ప్రసంగాన్ని వారు వ్యతిరేకిస్తున్నారు'' అని భాజపా ఎంపీ సుకంతా మజుందార్ విమర్శించారు.





## సంస్థ అభివృద్ధిలో మహేందర్ రెడ్డి సేవలు మరవలేనివి

**వీ3 న్యూస్ ఛానల్, విశ్వంభర దినపత్రిక సీఎండీ డా. కాచం సత్యనారాయణ**

**విశ్వంభర, ఎల్బీనగర్:** సంస్థ అభివృద్ధికి శానిటరీ ఇన్స్పెక్టర్ మహేందర్ రెడ్డి చేసిన సేవలు మరువలేనివని వీ3 న్యూస్ ఛానల్, విశ్వంభర దినపత్రిక సీఎండీ కాచం సత్యనారాయణ అన్నారు. శుక్రవారం జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ శానిటరి ఇన్స్పెక్టర్ మహేందర్ రెడ్డి పదవీ విరమణ సందర్భంగా కాచం సత్యనారాయణ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగి కి పదవీ విరమణ తప్పదని అన్నారు. పదవి విరమణ అనంతరం సమాజసేవకు తన వంతు సహాయ సహకారాలు అందించాలని అన్నారు. అంతకుముందు ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్, డిప్యూటీ కమిషనర్లు తిప్పర్తి యాదయ్య, సుజాత శ్రీధర్, డీఈఈ నీలిమ, ఏయంహెచ్ ఓ నగేష్ నాయక్, డి ఈ ఈ చందన, ఉప్పల్ డీసీ అంజనేయులు, బుచ్చయ్య ఎస్ఎఫ్ఏలు తదితరులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ క్యాంపెయినింగ్ కమిటీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మహేందర్ యాదవ్, శ్రీధర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉస్మానియా ఆసుపత్రి నూతన భవనానికి సీఎం రేవంత్ శంకుస్థాపన



**విశ్వంభర, హైదరాబాద్:** ప్రజలకు అత్యాధునిక వైద్య సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో పునర్నిర్మించ తలపెట్టిన ఉస్మానియా ఆసుపత్రి భవనానికి ముఖమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఇతర మంత్రులతో కలిసి ఆసుపత్రి నిర్మాణానికి సీఎం భూమిపూజ చేశారు. ప్రస్తుతం ఆసుపత్రి అఫ్జల్‌గంజ్‌లో ఉండగా.. నూతన భవనాన్ని గోషామహల్ స్టేడియంలో నిర్మించనున్నారు. 2 వేల పడకల సామర్థ్యంతో 32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త భవనం రానుంది.

**రెండేళ్లలో నిర్మాణం పూర్తి:** మంత్రి దామోదర రాజనర్సింహ

ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజ నర్సింహ మాట్లాడారు. 30 ఏళ్ల కల కొత్త ఉస్మానియా ఆసుపత్రి అని.. ఇది చారిత్రక దినమని చెప్పారు. ''ఉస్మానియా దేశంలోనే పేరెన్నికగన్న ఆసుపత్రి. దీని నూతన భవనం కోసం 6 నెలల్లోనే ప్రక్రియ పూర్తి చేసి సీఎం శంకుస్థాపన చేశారు. వేలాది మంది రోగులకు ఉస్మానియా అంటే ఓ నమ్మకం. అందుకే ఇతర ప్రాంతాలకు దీన్ని తరలించకుండా గోషామహల్‌లోనే ఉంచి ఆసుపత్రి నిర్మాణం చేస్తున్నాం. 5 భాగాలుగా నిర్మాణం జరుగుతుంది. 100% ఉచితంగా అన్ని రకాల సేవలు అందుబాటులోకి తీసుకొస్తాం. దీనికోసం రూ.2700 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నాం. రెండేళ్లలో మొత్తం భవనం నిర్మాణం పూర్తిచేయాలని భావిస్తున్నాం'' అని దామోదర రాజనర్సింహ అన్నారు.

**రాబోయే వందేళ్ల అవసరాలకు తగినట్లు తీర్చిదిద్దాలని..**

26 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకోనున్న భవనం కార్పొరేట్ ఆసుపత్రులను తలదన్నేలా నిర్మించాలని నిర్ణయించారు. రాబోయే వందేళ్ల అవసరాలకు తగినట్లు తీర్చిదిద్దాలని ఇటీవల నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి.. అధికారులను ఆదేశించారు. అన్నిరకాల సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు, ప్రతి వైద్య విభాగానికి ప్రత్యేకంగా ఆపరేషన్ థియేటర్లు, ప్రతి థియేటర్‌కు అనుబంధంగా పోస్ట్ ఆపరేటివ్, ఐసీయూ వార్డులు, కిందిభాగంలో ఒకేచోట అన్నిరకాల డయాగ్నొస్టిక్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. భవన నిర్మాణానికి సుమారు రూ.2500 కోట్ల నుంచి రూ.2700 కోట్ల వరకు వ్యయం కానుందని అంచనా. కొత్త భవనం ప్రారంభోత్సవం తర్వాత 20 శాతం వైద్యుల సంఖ్య పెరగనుంది. రోజూ 5 వేల మంది ఓపీ రోగులను చూసేలా.., 30 విభాగాలతో రోబోటిక్ సర్జరీలు చేపట్టే విధంగా సౌకర్యాలు ఏర్పాటుచేస్తారు.

## తెలంగాణ ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టులో విచారణ



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంపై సుప్రీంకోర్టు లో విచారణ జరిగింది. భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ జార్జి మైస్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. హైకోర్టు నాలుగు నెలల్లో ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయం తీసుకోవాలని గతేడాది మార్చిలో చెప్పినా ఇంతవరకు నిర్ణయం తీసుకోలేదని కౌశిక్‌రెడ్డి తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తగిన సమయంలో స్పీకర్ నిర్ణయం తీసుకోవడం లేదని తెలిపారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చామని అసెంబ్లీ కార్యదర్శి తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ కోర్టుకు తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకునేందుకు ఎమ్మెల్యేలకు స్పీకర్ తగిన సమయం ఇవ్వాలని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఆయన గుర్తుచేశారు. ఎంత సమయం కావాలో స్పీకర్‌ను కనుక్కొని చెప్పాలని ముకుల్ రోహత్గీకి జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం సూచించింది. అనంతరం తదుపరి విచారణను వారం రోజులకు సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

## కుంభమేళా రద్దీ.. ఘాట్‌ల వద్ద గంగా హారతి నిలిపివేత!

**వారణాసి:** ప్రయాగ్‌రాజ్‌లో వైభవంగా జరుగుతున్న మహా కుంభమేళాకు భక్తులు భారీగా పోటెత్తుతున్నారు. కోట్లాదిగా తరలివస్తుండటంతో నెలకొన్న రద్దీ దృష్ట్యా కొన్ని రోజుల పాటు ఘాట్‌ల వద్ద గంగా హారతి కార్యక్రమాన్ని నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. జనం రద్దీని దృష్టిలో ఉంచుకుని ఫిబ్రవరి 5 వరకు వారణాసిలోని దశాశ్వమేధ్, శీత్ల, అస్సీ మొదలైన ఘాట్‌లలో నిర్వహించే గంగా హారతిని నిలివేస్తున్నామని.. స్థానిక ప్రజలు అవసరం అయితే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని పోలీస్ కమిషనర్ మోహిత్ అగర్వాల్ విజ్ఞప్తి చేశారు. ఘాట్‌ల వద్ద ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రయాగ్‌రాజ్‌కు వచ్చిన భక్తులు వారణాసికి పెద్ద సంఖ్యలో వస్తుండడంతో కొందరు ప్రయాణికులు వారణాసి, బనారస్ రైల్వే స్టేషన్‌లలో చిక్కుకుపోయినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ఎటువంటి ఘటనలు జరగకుండా భద్రతా బలగాలు నిరంతరం గస్తీ తిరుగుతున్నాయని తెలిపారు. మౌని అమావాస్య నుంచి కాశీలో భక్తుల రద్దీ పెరిగిందని.. వారి సంఖ్య తగ్గేవరకు ఇతరులు ఎవరూ వారణాసికి రావద్దని విజ్ఞప్తి చేశారు.మహా కుంభమేళాలో మౌని అమావాస్య సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 30 మంది ప్రాణాలు కోల్పోయిన దుర్ఘటన నేపథ్యంలో ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం రద్దీ నియంత్రణకు పలు కీలక నిర్ణయాలు తీసుకొంది. ఈ క్రమంలోనే కుంభమేళా ప్రాంతంలోకి వాహనాల రాకపోకలను నిషేధించారు. వీవీఐపీ, స్పెషల్ పాసులను రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రయాగ్‌రాజ్ పొరుగున ఉన్న జిల్లాల నుంచి వచ్చే వాహనాలను సరిహద్దుల వద్దే నిలిపివేయనున్నారు. భక్తుల సౌకర్యార్థం వన్ వే ట్రాఫిక్ వ్యవస్థను అమల్లోకి తెచ్చారు. ఇప్పటివరకు 29.64 కోట్లమంది భక్తులు కుంభమేళాకు వచ్చినట్లు అంచనా వేస్తున్నారు.

# నిర్మలమ్మ బడ్జెట్ పై గంపెడాశలు పెట్టుకున్న

# తెలుగు రాష్ట్రాలు

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేడు మరోసారి కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. 2019లో ఆమె బాధ్యతలు స్వీకరించిన నాటినుంచి తాత్కాలిక బడ్జెట్లతో కలిపి మొత్తం ఏడు బడ్జెట్లు సమర్పించారు. ఎనిమిదో దానికి సిద్ధమవుతున్నారు.కేంద్ర బడ్జెట్ లో తమ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న ప్రాజెక్టులు, పథకాలకు నిధులు కేటాయించాలని తెలుగు రాష్ట్రాలు కేంద్రాన్ని కోరాయి. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు నిధులు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం కోరుతోంది. పోలవరం, అమరావతి ప్రాజెక్టులకు కేంద్ర బడ్జెట్ లో నిధుల కోసం ఏపీ ప్రభుత్వం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ను కోరారు. నిర్మలమ్మ బడ్జెట్‌లో తమకు ఎన్ని వందల కోట్లు కేటాయిస్తారని రెండు తెలుగు రాష్ట్రాలు ఆశగా చూస్తున్నాయి.

**రూ. 1.63లక్షల కోట్లు కోరుతున్న తెలంగాణ ప్రభుత్వం**

ఫిబ్రవరి ఒకటో తేదీన ప్రవేశ పెట్టనున్న కేంద్ర బడ్జెట్‌పై తెలంగాణ ప్రభుత్వం ఎన్నడు లేనంతగా భారీ ఆశలు పెట్టుకుంది. గత బడ్జెట్‌లో తెలంగాణకు తక్కువ కేటాయింపులు జరగడం, ఆ కేటాయింపులు కూడా కార్యరూపం దాల్చకపోవడంతో ఈ ఏడాది కేంద్ర బడ్జెట్ నుంచి దాదాపు రూ.40,000 కోట్లు కేటాయించాలని, ముఖ్యంగా మౌలిక సదుపాయాలు, రవాణా, పట్టణ అభివృద్ధి, నీటి నిర్వహణ, బయ్యారం స్టీల్ ప్లాంట్, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ వంటి కీలక ప్రాజెక్టులకు ఈ సారైనా కేంద్ర సాయంతో పూర్తి చేయాలనే ఆలోచనలతో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించింది.

**రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనలు..**

ఈసారి బడ్జెట్‌లో రీజినల్ రింగ్ రోడ్ ప్రాజెక్టుకు, మూసీ నది పునరుద్ధరణ, పునరుజ్జీవనం ప్రాజెక్టుకు, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు, స్కిల్ యూనివర్సిటీల నిర్మాణం కోసం తెలంగాణ ప్రభుత్వం కేంద్రం నుండి సహాయం కోరుతోంది. ఇక హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దే ఈ ప్రాజెక్ట్ కోసం ప్రత్యేకంగా నిధుల కోసం విజ్ఞప్తి చేస్తుంది. అలాగే రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ కేంద్ర నిధులు, సుందరీకరణ సమయంలో రుణాలు, గ్రాంట్లు కలిపి దాదాపు రూ. 6,347.07 కోట్లు ఇవ్వాలని కేంద్రాన్ని తెలంగాణ కోరుతోంది. ఇక రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం హామీ ఇచ్చిన కాజీపేట్ కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ప్లాంట్ పరిశ్రమల కోసం కేంద్రం నిధులు కేటాయించాలని, అలాగే ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం కింద తెలంగాణకు రావలసిన నిధులను విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తుంది. రాష్ట్రానికి ఆర్థిక మద్దతు, రాయితీలు, ఎంఎస్ఎంఈలకు, టెక్స్‌టైల్, ఫార్మా రంగాలకు ప్రత్యేక ప్యాకేజీలు ఇవ్వాలని కోరుతుంది. అలాగే రైల్వే, ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి, కొత్త విమానాశ్రయాలు, రైల్వే కనెక్టివిటీ మెరుగుపరిచే ప్రాజెక్టులు.. సాంకేతిక విద్య, ఉపాధి, స్కిల్ డెవలప్‌మెంట్ హబ్‌లు, కొత్త ఐఐటీ, ఐఐఎం వంటి సంస్థలకు నిధులు, కొత్త నవోదయ, కేంద్ర విద్యాలయాల కోసం కేంద్ర నిధులను మంజూరు చేయాలని అభ్యర్థిస్తుంది.

**రూ. 1.63లక్షల కోట్లు కోరుతున్న తెలంగాణ ప్రభుత్వం**


తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని రూ. 1.63 లక్షల నిధులు ఇవ్వాలని కోరుతోంది. రీజినల్ రింగ్ రోడ్డు, హైదరాబాద్ మెట్రో, మూసీ పునరుజ్జీవం వంటి పథకాలకు కేంద్ర ప్రభుత్వం సహాయం చేయాలని కోరుతోంది. పెద్దన్న మాదిరిగా రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని గతంలో రాష్ట్రంలో పర్యటించిన ప్రధాని మోడీని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు అవసరమైన నిధులను కోరుతోంది.ఆర్ఆర్ఆర్ కు రూ.34,367 కోట్లు ఇవ్వాలని కోరింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ ను కూడా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ కు సమర్పించాయి. మరో వైపు హైదరాబాద్ మెట్రో రెండో దశకు రూ.24, 269 కోట్లను కేంద్రాన్ని కోరుతోంది. మూసీ పునరుజ్జీవం కోసం మూసీకి రూ. 14, 100 కోట్లను కేంద్ర ప్రభుత్వాన్ని ఇవ్వాలని అభ్యర్థిస్తోంది.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రధానమంత్రి అవాస్ యోజన కింద నిధులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపికను జనవరి 26 నుంచి ప్రారంభించారు. ఇక వీటితో పాటు కేంద్ర ప్రభుత్వ స్పాన్సర్డ్ స్కీమ్స్ కింద రాష్ట్రానికి రూ. 1800 కోట్లు రావాల్సి ఉంది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 ప్రకారం రాష్ట్రంలో బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

**ఆంధ్రప్రదేశ్ ఏం కోరుతోందంటే?**

పోలవరం, అమరావతి విషయంలో 2024 బడ్జెట్ లో కేంద్ర ప్రభుత్వం ఏపీకి ప్రాధాన్యత ఇచ్చింది. పోలవరం ప్రాజెక్టుకు రూ. 12500 కోట్లను కేంద్రం ఇప్పటికే ప్రకటించింది. ఇందులో కొంత మేరకు విడుదల చేసింది. ఈ ప్రాజెక్టును 2028 నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొంది. నిర్ణీత సమయంలో ప్రాజెక్టు పూర్తి చేయడానికి డబ్బులు అవసరం. ప్రాజెక్టు పనులు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని ఏపీ ప్రభుత్వం కోరుతోంది. అమరావతి నిర్మాణానికి గత బడ్జెట్ లో రూ. 15 వేల కోట్లను కేటాయించారు. అయితే ఇవన్నీ అప్పులే. దీంతో పనులు వేగంగా నిర్వహించేందుకు ఈ బడ్జెట్ లో మరిన్ని నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోంది. దావోస్ టూర్ నుంచి న్యూఢిల్లీకి చేరుకున్న వెంటనే ఏపీ సీఎం చంద్రబాబు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తో భేటీ అయ్యారు. రాష్ట్రానికి అవసరమైన నిధులు కేటాయించాలని చంద్రబాబు కేంద్ర మంత్రిని కోరారు.

**ఎనిమిదో బడ్జెట్ ప్రవేశపెడుతున్న నిర్మలమ్మ**

దేశానికి పూర్తిస్థాయి ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ ఎనిమిదో వార్షిక బడ్జెట్ సమర్పించబోతున్నారు.మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ సమర్పించిన పది వార్షిక బడ్జెట్‌ల రికార్డుకు చేరువలో ఉన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రిగా మొరార్జీ దేశాయ్ 1959-1964 మధ్య ఆరు, 1967-1969 మధ్య నాలుగు బడ్జెట్‌లు సమర్పించారు. తొలి ప్రధాని పండిట్ నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ ప్రభుత్వ హయాంల్లో బడ్జెట్‌లు సమర్పించారు. 1959 ఫిబ్రవరి 28న తొలిసారి బడ్జెట్ సమర్పించారు. అటుపై 1962లో ఇంటరిం బడ్జెట్, తిరిగి రెండు వార్షిక బడ్జెట్‌లు పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టారు. నాలుగేండ్ల తర్వాత 1967లో ఇంటరిం బడ్జెట్, 1967-1969 మధ్య మూడు వార్షిక బడ్జెట్‌లు సమర్పించారు.వేర్వేరు సమయాల్లో మాజీ ఆర్థిక మంత్రి పీ చిదంబరం తొమ్మిది బడ్జెట్‌లను పార్లమెంట్‌కు సమర్పించారు. తొలిసారి 1996 లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వ హయాంలో బడ్జెట్ సమర్పించారు. హెచ్‌డీ దేవెగౌడ ప్రధానిగా ఉండగా 1996 మార్చి 19న తొలి బడ్జెట్ పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టారు. తిరిగి 1997లో బడ్జెట్ సమర్పించారు. 2004-08 మధ్య వరుసగా ఐదు బడ్జెట్‌లను పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టారు. కొంత కాలం హోంమంత్రిగా పని చేసిన చిదంబరం.. తిరిగి 2013, 2014ల్లో బడ్జెట్ సమర్పించారు.ఇందిరాగాంధీ హయాం నుంచి వేర్వేరు సందర్భాల్లో ప్రణబ్ ముఖర్జీ ఎనిమిది బడ్జెట్‌లు సమర్పించారు. తొలిసారి 1982, 1983, 1984, 2009 ఫిబ్రవరి – 2012 మార్చి మధ్య ఐదు బడ్జెట్‌లను పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టారు.ఆర్థిక సంస్కరణల రూపశిల్పి, మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ 1991 నుంచి 1996




వరకూ ఐదు బడ్జెట్లు సమర్పించారు. పీవీ నర్సింహారావు ప్రభుత్వంలో మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా పని చేశారు.




**బడ్జెట్ లో నిర్మలమ్మ ముద్ర**

నిర్మలా సీతారామన్ 2019లో బాధ్యతలు స్వీకరించగానే ప్రవేశపెట్టిన తొలిపద్దులో పారిశ్రామిక రంగానికి సంబంధించి పన్నుల్లో కీలక సంస్కరణలను తీసుకొచ్చారు. వాస్తవానికి అప్పటికే దేశంలో ప్రైవేటు రంగంలో పెట్టుబడులు మందగించాయి. దీంతో ఆర్థికమంత్రి కార్పొరేట్ పన్ను రేట్లను తగ్గించారు. దీంతో ఇవి ఇతర పెద్ద ఆర్థికవ్యవస్థల పన్నురేట్లతో కొంత పోటీపడే పరిస్థితి వచ్చింది. వ్యాపారాల మధ్య పోటీతత్వం పెంచడంతోపాటు.. భారీ పెట్టుబడులను ప్రోత్సహించే దిశగా ఈ నిర్ణయం ఉంది. అప్పట్లో ఈ నిర్ణయాన్ని చాలామంది స్వాగతించారు. కానీ, కాలం గడిచేకొద్దీ ఆ మేరకు కొత్త ఉద్యోగాలు రాకపోవడం చర్చనీయాంశమైంది. ఈనేపథ్యంలో ఆర్థిక సంస్కరణలను అత్యంత జాగ్రత్తగా అమలుచేయాలన్న విషయాన్ని ఇది మరోసారి చెప్పినట్లైంది. పాత ఆదాయపు పన్ను విధానంలోని సంక్లిష్టతలను తొలగిస్తూ.. కొత్త విధానాన్ని 2020లో ప్రతిపాదించారు. దీనిలో తక్కువ పన్ను రేట్లను ఇచ్చారు. పాత, కొత్త విధానాల్లో ఒక దానిని ఎంపిక చేసుకొనే అవకాశం పన్ను చెల్లింపుదారులకు ఇచ్చారు. హౌసింగ్‌లోన్, ఇతర ప్రత్యేకమైన వ్యయాలు ఉన్నవారు పాత విధానంలోనే కొనసాగేందుకు దీనిలో ఛాన్స్ ఉంది. ముఖ్యంగా పన్ను చెల్లింపుదారుల వ్యయాలు పెంచి ఆర్థికవ్యవస్థ వృద్ధికి బాటలు పరచాలన్నది దీని వ్యూహం. తాజాగా దానిలో కూడా స్టాండర్డ్ డిడక్షన్ తీసుకొచ్చారు. నిర్మలా సీతారామన్ అత్యధికంగా స్టార్టప్‌లు, సూక్ష్మ,చిన్న,మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి పైనే అధికంగా దృష్టి సారించారు. ఆమె గత బడ్జెట్ ప్రసంగాలు వింటే ఈ విషయం స్పష్టంగా తెలుస్తుంది. ఎంఎస్ఎంఈలకు క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్ పొడిగింపు, ఇతర మార్గాల్లో కూడా వాటికి రుణ సౌకర్యాలు అందేలా నిధుల కేటాయింపులు చేశారు. ఫలితంగా చిన్న సంస్థలకు తక్కువ ధరకే రుణాలు లభించాయి. గతంలో కంపెనీ చట్టంలో కొన్ని ప్రొవిజన్లు అత్యంత కఠినంగా ఉండేవి. వీటిని 2021-22 బడ్జెట్‌లో సీతారామన్ డీక్రిమినలైజ్ (నేర రహితంగా) చేశారు. ఇది దేశంలో వ్యాపారానుకూల వాతావరణాన్ని ప్రోత్సహించేందుకు ఉపయోగపడింది. చిన్న ఉల్లంఘనలను నేరాల నుంచి తొలగించారు. ప్రొసీజర్‌లో లోపాలు, టెక్నికల్ డీఫాల్ట్‌లు వంటివి వీటిల్లో ఉన్నాయి. అనుకోకుండా జరిగే లోపాల విషయంలో వ్యాపారులకు ఊరటనిచ్చారు. కొన్ని రకాల వాటిని సివిల్ పెనాల్టీలతో సరిపెట్టారు. కంపెనీలు, సంస్థలు న్యాయసంబంధ ఇబ్బందులపై కాకుండా.. వృద్ధి పైనే దృష్టిని కేంద్రీకరించేలా చేసేందుకు ఈ నిర్ణయం ఉపయోగపడింది.





## హైదరాబాద్ మెట్రోకు కేంద్ర బడ్జెట్‌లో నిధులు దక్కేనా?

హైదరాబాద్ నగరానికి మెట్రో రెండో దశ విస్తరణ అత్యంత కీలకంగా మారింది. కేంద్ర వాటాతో కలిసి తొలిసారిగా చేపడుతున్న ఈ ప్రాజెక్టు మొత్తం విలువ రూ. 24వేల కోట్లు కాగా, ఇందులో కేంద్రం నుంచి 18శాతం మేర ఆర్థిక సహకారం అందాల్సి ఉంది. ప్రస్తుతం ఫేజ్-2 విస్తరణ కోసం అనుమతులు కోరుతూ కేంద్రానికి పంపిన ప్రతిపాదనలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు అత్యంత ముఖ్యంగా మారాయి. కేంద్రం నుంచి వచ్చే వాటా ఆధారంగా ప్రాజెక్టు పనులు ముందుకు సాగనున్నాయి.హైదరాబాద్ నగరంలో 76.4 కిలోమీటర్ల మేర మెట్రో విస్తరించాలని, రూ. 24,269 కోట్ల అంచనా వ్యయంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి ప్రాజెక్టుగా నిర్మించేందుకు డీపీఆర్ రూపొందించారు. ఇందులో కేంద్రం 18శాతం వాటాగా రూ. 4,230 కోట్లు.. రాష్ట్ర ప్రభుత్వం 30శాతం వాటాగా రూ.7,313 కోట్లు.. లోన్ల రూపంలో 11,693.. పీపీపీ కంపొనెంట్‌గా రూ. 1033 కోట్లతో వచ్చే నాలుగేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ప్రణాళికలను హెచ్ఎంఆర్ఎల్ సన్నాహాలు చేసింది.ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టుకు ఆమోద ముద్ర ఇప్పటికీ పడలేదు. 76 కిలోమీటర్ల పొడువునా నగరం నలువైపులా విస్తరించేలా హెచ్ఎంఆర్ఎల్ రూపొందించిన డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టును, రాష్ట్ర కేబినెట్ ఆమోదంతో.. నవంబర్ మొదటి వారంలోనే కేంద్రానికి చేరింది. కానీ ఇప్పటివరకు ఆ ప్రాజెక్టు కేంద్ర ప్రభుత్వం దృష్టికి రాలేదు. అదేవిధంగా కీలకమైన డీపీఆర్‌కు ఇప్పటి వరకు ఆమోదం లభించకపోవడంతో.. నిధుల సర్దుబాటు ఎలా ఉంటుందనేది ఇప్పుడు మెట్రో వర్గాలను ఆందోళన కలిగిస్తోంది.కేంద్రం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో మెట్రో విస్తరణకు నిధులపై రాష్ట్ర ప్రభుత్వం ఆశలు పెట్టకుంది. ఈ క్రమంలో మెట్రో ఫేజ్-2 ప్రతిపాదనలకు కేంద్రం బడ్జెట్ కేటాయింపులు జరిగితే.. ప్రాజెక్టుకు భవిష్యత్తులో నిధుల కొరత తలెత్తే పరిస్థితి ఉండదు. లేదంటే ప్రభుత్వమే సొంతంగా నిధులు సేకరించుకుని ప్రాజెక్టులను పట్టాలెక్కించాల్సిన పరిస్థితి రానుంది. ఇక ఇతర బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి సేకరించే దాదాపు రూ. 11,000 కోట్లకు కేంద్రం పూచీకత్తుగా ఉంటుంది. ఈ విషయంలోనూ కేంద్రం ఎలాంటి మెలిక లేకుండా ఆమోదం తెలిపితేనే నగరానికి రెండో దశ మెట్రోకు తుది రూపం రానుంది.

## కేంద్ర పథకాలకు బడ్జెట్ కేటాయింపులు పెరిగే అవకాశం

కేంద్ర ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోంది. ఆయుష్మాన్ భారత్, జల్ జీవన్ మిషన్, పీఎం కిసాన్, పీఎం ఆవాస్ యోజన వంటి పథకాలకు బడ్జెట్ కేటాయింపులు పెరిగే అవకాశం ఉంది. ఈ పథకాలకు తోడుగా మరికొన్ని కొత్త పథకాలు ఏమైనా ప్రవేశపెడతారనే ఆసక్తి నెలకొంది. దేశంలో దాదాపు 12 కోట్ల మంది పేద కుటుంబాలకు ఆరోగ్య భీమా కల్పించాలనే లక్ష్యంతో ఆయుష్మాన్ భారత్‌ను 2018లో ప్రవేశపెట్టారు. అయితే కోవిడ్ తర్వాత కాలంలో లబ్దిదారుల సంఖ్య 50 కోట్లకు చేరుకుంది. తాజాగా బడ్జెట్‌లో ఈ పథకానికి కేటాయింపులు మరింతగా పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. పీఎం ఆవాస్ యోజన పథకం ద్వారా ఇప్పటి వరకు 3 కోట్ల మంది గ్రామీణ పేదలకు సొంతిళ్లు నిర్మించారు. రెండో దశలో పట్టణ ప్రాంతాల్లో కూడా కోటి మంది పేదలు, మధ్య తరగతి వారికి పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పింది. దీనికి ఏ మేరకు నిధులు కేటాయిస్తారో చూడాలి. ముద్రా యోజన ద్వారా చిన్న, మధ్య స్థాయి పారిశ్రామికవేత్తల కోసం హామీ లేని రుణాలను అందించేందుకు ముద్ర యోజన పథకాన్ని ప్రవేశపెట్టారు. శిశు, కిశోర్, తరుణ్ విభాగాలుగా రుణాలు ఇస్తున్నారు. గతంలో తరుణ్ కింద రూ.10 లక్షల లోన్ ఇచ్చేవారు. కానీ ఇటీవల రూ.20 లక్షలకు పెంచారు. మిగిలిన రెండు విభాగాల్లో కూడా లోన్ అమౌంట్ పెంచుతారేమోనని అందరూ ఎదురు చూస్తున్నారు. సౌర విద్యుత్ వాడకాన్ని ప్రొత్సహించడానికి పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజనను ప్రవేశపెట్టారు. ఇప్పటి వరకు 3 కిలోవాట్లకు రూ.78 వేల రాయతీ ఇస్తుండగా.. దీన్ని మరింతగా పెంచాలని డిమాండ్లు వస్తున్నాయి. ఈ సారి బడ్జెట్‌లో దీనిపై ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

గరీబ్ కల్యాణ్ యోజన ద్వారా పేదలకు ఉచితంగా ఆహార ధాన్యాలను 2028 వరకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకానికి కూడా భారీగా కేటాయింపులు ఉండబోతున్నాయనే అంచనాలు ఉన్నాయి. ప్రతీ రైతు కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలనే లక్ష్యంతో 2018లో పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని ప్రవేశపెట్టారు. ఏడాదికి రూ.6 వేలను మూడు విడతల్లో అందిస్తున్నారు. తాజా బడ్జెట్‌లో దీనికి కూడా కేటాయింపులు పెరిగే అవకాశం ఉంది. కాగా, మోడీ ఇప్పటికే వేతన జీవులకు, మధ్య తరగతి ప్రజలకు ఊరట కలిగిస్తామని వాగ్దానం చేశారు. శుక్రవారం జరిగిన పార్లమెంట్ సెషన్‌లో ఈ మేరకు బడ్జెట్‌పై హింట్ ఇచ్చారు. దీంతో ధరల నియంత్రణ, ఇన్‌కమ్ ట్యాక్స్ వంటి అంశాల్లో కీలక నిర్ణయాలు ఉంటాయని అందరూ అంచనా వేస్తున్నారు.

# పేదల కలలు సాకారం అయ్యేనా?

దేశంలోని పేదకుటుంబాలకు ఆరోగ్య బీమా కల్పించే లక్ష్యంతో 2018లో ప్రారంభమైన ప్రధానమంత్రి జనారోగ్య పథకం ద్వారా 50 కోట్ల మందికిపైగా లబ్ధి పొందుతున్నారు. ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ మినహా అన్నిరాష్ట్రాలు ఈ పథకాన్ని అమలుచేస్తున్నాయి. 70 ఏళ్లు పైబడిన వృద్ధులందరికీ దీనిని విస్తరించారు. కనుక బడ్జెట్‌లో కేటాయింపులు పెరిగే అవకాశముంది.సౌరవిద్యుత్తును ప్రోత్సహిస్తున్న కేంద్రం పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ పథకాన్ని తీసుకొచ్చింది. పైకప్పులపై సౌరవిద్యుత్తు ఉత్పత్తికి సంబంధించిన ఈ పథకం ద్వారా 78 వేల చొప్పున ఒక్కో ఇంటికి గరిష్ఠంగా 3 కిలోవాట్లకు రాయితీ ఇస్తోంది. 2026-27 నాటికి కోటి ఇండ్లు లక్ష్యంగా పెట్టుకోగా, దాదాపు 1.45కోట్లకుపైగా రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ఈ పథకం రాయితీ కోసం బడ్జెట్‌లో కేటాయింపులు పెంచే అవకాశం ఉంది.

గ్రామీణ పేదల సొంతింటి కలను సాకారం చేయటమే లక్ష్యంగా పీఎం ఆవాస్ యోజన ద్వారా 3కోట్ల ఇళ్ల నిర్మాణం చేపట్టిన కేంద్రం, రెండో-విడతలో హౌసింగ్ ఫర్ ఆల్ పేరుతో సాయం చేయనుంది. పట్టణప్రాంతాల్లో 2029 నాటికి కోటి మంది పేదలు, మధ్య తరగతి కుటుంబాలకు ఇళ్ల నిర్మాణానికి సాయం అందించనున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం రూ.2.30 లక్షల కోట్లు ఖర్చు చేయనుంది. హామీ లేని రుణాలు ఇచ్చేందుకు ఉద్దేశించిన ప్రధానమంత్రి ముద్రా పథకం 2015 ఏప్రిల్ 8న ప్రారంభమైంది. తరుణ్ కింద 10లక్షల రుణ పరిమితిని 20లక్షలకు పెంచారు. ఈసారి ఎలాంటి మార్పులు ఉంటాయనేది ఆసక్తి రేపుతోంది.

కొవిడ్ వేళ పేదలకు ఉచితంగా ఆహార ధాన్యాలు అందించేందుకు మార్చి 2020లో గరీబ్ కల్యాణ్ యోజనను ప్రవేశపెట్టారు. లబ్ధిదారులకు నెలకు 5కేజీల బియ్యం, గోధుమలు అందిస్తున్నారు. ఈ పథకాన్ని 2028వరకు పొడిగించిన కేంద్రం ఈ బడ్జెట్‌లో అందుకు నిధులు కేటాయించే అవకాశం ఉంది. రైతు కుటుంబాలకు ఆర్థికసాయం అందించేందుకు 2018లో ప్రవేశపెట్టిన పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ఏడాదికి రూ.6వేలు మూడు విడతల్లో అందిస్తున్నారు. ఈసారి ఈ ఆర్థికసాయం పెంచే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

**రాస్తి రంగానికి ఊరట లభించేనా?**

ఈ ఏడాది ప్రవేశపెట్టే కేంద్ర వార్షిక బడ్జెట్‌పై గృహ నిర్మాణ రంగం, పట్టణ రంగానికి చెందిన వారు గంపెడాశలు పెట్టుకున్నారు. ఈ రంగం పుంజుకుంటే లక్షలాది మందికి ఉపాధి లభించడం సహా వ్యవస్థలోకి భారీగా డబ్బు వచ్చి చేరుతుంది. హౌసింగ్ రంగానికి పన్ను మినహాయింపుతో పాటు, రియల్ ఎస్టేట్‌ను పరిశ్రమగా గుర్తించాలని డిమాండ్ల నెలకొన్న వేళ ఈ ఏడాది పద్దుపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది.

**జీఎస్‌టీ మినహాయింపు?**

పెద్ద పెద్ద నగరాల్లో జీఎస్‌టీ వల్ల వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎవరైనా రూ.50 లక్షలకు ఒక ఫ్లాట్ కొనుగోలు చేస్తే దాదాపు రూ.9 లక్షల వరకు జీఎస్‌టీ కట్టాల్సి వస్తోంది. అందుకే జీఎస్‌టీని మినహాయిస్తే వారికి పెద్ద ఉపశమనం లభించే అవకాశం ఉంటుంది.

'ఇప్పటివరకు గృహ రుణాలపై రూ.2 లక్షల వరకు వడ్డీ రాయితీ ఇస్తున్నారు. కానీ అది పాత పన్ను విధానంలో ఉంది. ప్రస్తుతం 70 నుంచి 75 శాతం మంది పన్ను చెల్లింపుదారులు కొత్త పన్ను విధానానికి మారారు. ఇందులో ఎలాంటి మినహాయింపు లేదు. ఈ నేపథ్యంలో వడ్డీ రాయితీని కొత్త టాక్స్ విధానంలో కూడా ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఇది జరిగితే, రియల్ ఎస్టేట్ మార్కెట్ బాగా పుంజుకునే అవకాశం ఉంది. గృహ రుణ వడ్డీలో తగ్గింపు కొనుగోలుదారులకు మద్దతు లభిస్తుంది. అలాగే గృహ రుణ వడ్డీ చెల్లింపులపై పన్ను మినహాయింపు పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెంచి మధ్యతరగతి వారు సొంతింటి కలను నిజం చేసుకునే దిశగా వారిని మరింత ప్రోత్సహించాలి' అని నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఛైర్మన్ నిరంజన్ హిరానందనీ అన్నారు. స్మార్ట్ సిటీ మిషన్‌ను టైర్-2, టైర్-3 నగరాలకు విస్తరించాలని ఆయన కోరుతున్నారు.

**ఆదాయపు పన్ను శ్లాబ్‌ల్లో మార్పులు?**

ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని ప్రభుత్వం మరింత పెంచుతుందనే ఆశాభావంతో వేతన జీవులు/ఉద్యోగ వర్గాలు ఉన్నాయి. అల్ప ఆదాయ వర్గాల వారికి పన్ను మినహాయింపు పరిమితి సాధ్యమైనంత ఎక్కువగా ఉండాలని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. అయితే ద్రవ్యోల్బణ పరిస్థితులకు అనుగుణంగా పన్ను చట్టాలను సరళీకరిస్తారని అంచనా వేస్తున్నారు. పన్ను విధానాన్ని మరింత సరళీకరించడంలో భాగంగా టాక్స్ శ్లాబుల్ని 6 నుంచి 3 శ్లాబులకు కుదించే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం గరిష్ఠ పన్ను రేటు 30 శాతంగా ఉండగా, దీనిని 25 శాతానికి తగ్గిస్తారని వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం సెక్షన్ 87A కింద రూ.7 లక్షల ఆదాయం వరకు టాక్స్ రిబేట్ వర్తిస్తుండగా, దీనిని రూ.10 లక్షలకు పెంచే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. ఇదే జరిగితే మధ్యతరగతి వర్గానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.భ్ధి కలుగుతుంది. వీరికి ఉపశమనం కలిగించేలా సెక్షన్ 80సీ పన్ను మినహాయింపు పరిమితిని రూ.2.50 లక్షలకు పెంచే అవకాశం ఉంది.

**టీడీఎస్, టీసీఎస్ నిబంధనల సరళీకరణ**

మూలం వద్ద పన్ను కోత (టీడీఎస్), మూలం వద్ద పన్ను సేకరణ (టీసీఎస్) అనేవి భారత పన్ను విధానంలోని ప్రాథమిక భావనలు. టీడీఎస్, టీసీఎస్ నిబంధనలను సరళతరం చేసే అంశంపై ఈసారి కేంద్ర బడ్జెట్‌లో ప్రకటన చేసే అవకాశం ఉంది. ఆయా నిబంధనల మధ్య సారూప్యత లేకుండా చేయడం, స్పష్టత ఉండేలా మార్చడం, సామాన్యులకూ అర్థమయ్యేలా అందుబాటులోకి తేవడం అనేవి ఈ సంస్కరణల ప్రధాన లక్ష్యం. టీడీఎస్ నిబంధనల్లో పదేపదే సవరణలు చేస్తుండటంతో గతంలో పలు న్యాయవివాదాలు తలెత్తాయి. దీనివల్ల పన్ను చెల్లింపుదారులను అయోమయం ఆవరించింది. కొత్త పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్ రూ.50,000 నుంచి రూ.75,000కు పెంచారు. దీనిని ఇప్పుడు ఒక లక్ష రూపాయలకు పెంచాలని వేతన జీవులు కోరుకుంటున్నారు.

## సియాటెల్ బిజినెస్ ఫోరమ్ భారత్‌లో పెట్టుబడులు



**విశ్వంభర, బషీర్ బాగ్:** సియాటెల్‌లోని భారత కాన్సులేట్ జనరల్ తొలి ఇన్వెస్ట్ ఇండియా బిజినెస్ ఫోరం (ఐఐబీఎఫ్)ను నిర్వహించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), అగ్రిటెక్, హెల్త్ కేర్, ఉన్నత విద్య, టూరిజం వంటి రంగాల్లో అమెరికా నుంచి భారత్ కు పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ఫోరం వివరించింది. బెల్ హార్బర్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సెంటర్ లో జరిగిన ఈ కార్యక్రమాన్ని గ్రేటర్ సియాటెల్ పార్టనర్స్, నార్త్ వెస్ట్ సీపోర్ట్ అలయన్స్ సహకారంతో నిర్వహించారు. గ్రేటర్ సియాటెల్ ప్రాంతం నుంచి భారత్ కు ఎగుమతులకు అవసరమైన వస్తువులను కూడా ఫోరం ప్రదర్శించింది. వివిధ సెషన్లలో, కృత్రిమ మేధ, అగ్రిటెక్, హెల్త్కేర్, ఉన్నత విద్య, పర్యాటక రంగాలకు చెందిన నిపుణులు ప్రాజెక్టునిర్దిష్ట పెట్టుబడి అవకాశాలు ఈ పరిశ్రమలలో వృద్ధి, అన్ని భారతీయ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన ప్రత్యేక ఉత్పత్తులను ప్రదర్శించిన వన్ డిస్ట్రిక్ట్, వన్ ప్రొడక్ట్ (ఓడీఓపీ) ఎగ్జిబిషన్ను హైలైట్ చేస్తూ కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా సోషల్ మీడియా ప్లాట్ఫామ్ 'ఎక్స్'లో ఈ కార్యక్రమానికి సంబంధించిన చిత్రాలను పంచుకుంది.

## డీర్ పార్క్ ప్రభుత్వ భూమి కబ్జా కేసులో ముగ్గురు అరెస్ట్

**విశ్వంభర, ఎల్బీనగర్:** వనస్థలిపురం ఆటోనగర్ లోని డీర్ పార్క్ సర్వే నెం.7 లో ప్రభుత్వ భూమిని తమ భూమిగా నమ్మించి అమ్ముతున్న ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్కు తరలించిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వనస్థలిపురం ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం షేక్ జిలానీ, యూసుఫ్ ఖాన్ , అతని భార్య తులసమ్మలు అమాయక ప్రజలను మోసం చేయాలనే ఉద్దేశ్యంతో సర్వే నెం.7, ఆటొ నగర్, వనస్థలిపురం లో ఉన్న ప్రభుత్వ భూమి పై భూమి వారిది అని ప్రజలను నమ్మించి రూ.100ల ఇండియా నాన్ జ్యూడిషియల్ స్టాంప్ పేపర్ పై షేక్ జిలానీ హై కోర్ట్ అడ్వికేట్ ప్రజలను సమకూర్చుకొని, వారికి ఆటొ నగర్, వనస్థలిపురం ప్లాట్ లు అమ్మకంనకు ఉన్నవి అని మోసం చేయాలనే ఉద్దేశముతో, ప్రభుత్వ భూమిని, యూసుఫ్ ఖాన్, అతని భార్య తులసమ్మలది అని చెప్పి, వారి ద్వారా ప్రజలకి మేమో రాండం ఆఫ్ గిఫ్ట్ డీడ్ ద్వారా చేసి, చాలా మంది ప్రజల వద్ద నుండి రూ.5000 ల నుండి రూ. 10,000 ల వరకు తీసుకొని మోసము చేసినారు. సమాచారం ఫారెస్ట్ ఆఫీసర్, డీర్ పార్క్ వారి ద్వారా ఫిర్యాదు అందగా షేక్ జిలానీ, యూసుఫ్ ఖాన్, అతని భార్య తులసమ్మ లపై కేసు నమోధు చేసి అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు.

## తొలి స్వతంత్ర వీరుడు వడ్డెర ఓబన్న

**- విగ్రహ ఆవిష్కరణ చేసిన ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్**



**విశ్వంభర, కోరుట్ల:** జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామంలో తొలి దశ స్వతంత్ర వీరుడు వడ్డెర ఓబన్న విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఘన గ్రామస్తులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.


## సాయి నగర్ సంక్షేమ సంఘం ఎన్నికల్లో మంగతాయారు పోటీ



**విశ్వంభర, చైతన్యపురి:** చైతన్యపురి డివిజన్ సాయి నగర్ సంక్షేమ సంఘం కార్యవర్గ ఎన్నికల్లో సహాయ కార్యదర్శి, జాయింట్ సెక్రెటరీగా మంగతాయారు పోటీలో నిలబడ్డారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ సంఘం ఎన్నికల్లో తనను మెజార్టీతో గెలిపించాలని కోరారు. ముఖ్యంగా కాలనీలో ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్య, విపరీతమైన హాస్టల్ స్థాపన వల్ల కాలనీ వాసులు పడుతున్న ఇబ్బందులు, పాడైన రోడ్ల ను త్వరితగతిన వేయించడానికి, కాలనీలో ట్రాఫిక్ సమస్య మిగతా సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన పెద్ది కృష్ణమూర్తి గౌడ్

**విశ్వంభర, దేవరుప్పల:** జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ యూత్ అధ్యక్షుడు కారుపోతుల శ్రీనివాస్‌భాగ్యమ్మ దంపతుల కూతురి ఎంగేజ్మెంట్ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన దేవరుప్పుల పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్. వారి వెంట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుకూరి నరసయ్య, తీగల కొండయ్య, కారుపోతుల మహేందర్, పాము యాకస్వామి, కారుపోతుల యాకస్వా మి, నరేష్, సురేష్, సతీష్, అశోక్, గొడిశాల ఉప్పలయ్య, పలుసం వెంకటేష్, తదితరులున్నారు.



## కార్మికుల శ్రమను దోపిడీ చేయాలని చూస్తే తిరుగుబాటు తప్పదు



**విశ్వంభర, హుజూర్ నగర్:** 8 గంటల పని విధానం సాధించి 25 సంవత్సరాలు పైగా అవుతుంది. సుమారు 250 నుంచి 300 మందిరి కార్మికులు పోరాటానికి సుదీర్ఘంగా 54 రోజులు వేతనం పోగొట్టుకొని సాధించుకున్న 8 గంటలపని విధానాన్ని రద్దు చేసి 12 గంటల పని విధానం అమలు కోసం కార్మిక సంఘాల మధ్య ఘర్షణ సృష్టించి కార్మికలలో ఐక్యత లేకుండా చేయాలని యాజమాన్యం చూడటం సరైనది కాదని, కార్మికులందరూ ప్రతి అంశాన్ని గమనిస్తున్నారని కార్మికుల శ్రమను దోపిడీ చేయాలని చూస్తే తిరుగుబాటు తప్పదని తగిన మూలం యాజమాన్యం చెల్లించుకోక తప్పదని టీఎన్ టీ యూ సీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులకు గత పోరాటాలను గుర్తు చేశారు.హుజూర్నగర్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవన్లో రైస్ మిల్ డ్రైవర్ల వేతన అలవెన్సులు శుక్రవారం నాలుగు కార్మిక సంఘాలు మరియు యాజమాన్యంతో చర్చలు జరిగాయి. చర్చల్లో ప్రధానంగా 8 గంటల పని విధానం సవరించి 12 గంటల పని విధానం అమలు చేయాలని యాజమాన్యం చర్చ పెట్టడం సరైనది కాదని పాత సంప్రదాయం ప్రకారం కార్మికులు వేతన అలేవెన్సులు పెంచాలని, గత 25 సంవత్సరాలుగా లేని నిబంధనలు ఇప్పుడు యజమాని ప్రవేశపెట్టడం ఏంటి అని ప్రశ్నించారు. వేతనాలు పెంచాల్సిన విషయం పక్కనపెట్టి కార్మిక సంఘాలను విభజించి పాలించాలని చూడటం సరైనది కాదని మీ యూనియన్ కింద ఎంత మంది కార్మికులు ఉన్నారు. లిస్టు కావాలని కొత్తగా అడగటం రిజిస్టర్ ఉన్న యూనియన్ అని అడగటం మంచిది కాదని అలాగే మీ మిల్లులో ఎంత మంది పార్టనర్లు ఉన్నారు వారు వాటా ఎంత లిస్ట్ రాసిస్తారా అని కార్మికులు అడుగుతున్నారని రోషపతి తెలిపారు. కొత్త పద్ధతులు వద్దు పాత సంప్రదాయాల ప్రకారం చర్చలు ముగించాలని అన్నారు. నేడు జరగాల్సిన చర్చలు వాయిదా పడ్డాయని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పోలిశెట్టి లక్ష్మీ నరసింహారావు, అప్పారావు, ఓరుగంటి నాగేశ్వరరావు, శ్రీనివాస్, గంధి ప్రమోద్, శ్రావణ్, నాలుగు కార్మిక సంఘాల ప్రతినిధులతో పాటు టీ యన్ టీ యూ సీ రైస్ మిల్ డ్రైవర్ యూనియన్ అధ్యక్షులు గుండెబోయిన ఎంకన్న, యాదవ్ ప్రధాన కార్యదర్శి కంకణాల రామయ్య, శాసనాల శ్రీను, కోటయ్య, బైరు యల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ అవగాహన ర్యాలీ



**విశ్వంభర, భూపాలపల్లి;** హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాలలో ప్రాణాలు పోకుండా బయట పడొచ్చని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా రవాణా మరియు పోలీసుశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్మెట్ అవగాహన మోటారు సైకిల్ ర్యాలీలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేలు పాల్గొన్నారు. ఐడిఓసి కార్యాలయం నుండి గణేష్ చౌక్ మీదుగా డా బిఆర్ అంబేద్కర్ సెంటర్ వరకు కొనసాగిన ర్యాలీని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ జెండా ఊపి ప్రారంభించగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలు హెల్మెట్ ధరించి వాహనాలు నడిపి పలువురిని ఆకర్షించారు.అనంతరం డా బిఆర్ అంబేద్కర్ సెంటర్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ పలువురు డ్రైవర్లకు ఉచిత కళ్లద్దాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలను కాపాడుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. దేశంలో సగటున 70 శాతం రోడ్డు ప్రమాదాలలో ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధరించకపడోవడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని, ఇది చాలా బాధాకరమని తెలిపారు. ప్రతి ద్విచక్ర వాహన దారులు విధిగా హెల్మెట్ ధరించాలని, ఇతర వాహనాలు నడిపే డ్రైవర్లు సీట్ బెల్ట్ ధరించి వాహనం నడపాలని సూచించారు. రోడ్డు పై ప్రయాణం చేసే సమయంలో ప్రతి ఒక్కరూ ఒక్క సారి తమ కుటుంబ సభ్యులను గుర్తుచేసుకుని వాహనం నడపాలని, తమతో పాటు ఇతరులకు ఇబ్బందులు కలగకుండా రోడ్డు భద్రతా నియమాలను, ప్రమాణాలను పాటిస్తూ వాహనాలు నడిపి సురక్షితంగా గమ్యం చేరాలని కలెక్టర్ సూచించారు.జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూజిల్లాలో వాహనదారులకు రోడ్డు భద్రత, హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పించడానికి హెల్మెట్ ర్యాలీ నిర్వహించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఎక్కువగా బొగ్గు, ఇసుక లారీలు రవాణా ఎక్కువగా జరుగుతుందని రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు పెద్ద సంఖ్యలో ద్విచక్ర ప్రమాదాల బారినపడి గాయపడి మరణిస్తున్నారని తెలిపారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలను కాపాడుకోవచ్చు అని తెలిపారు.ప్రతి రోజు పోలీస్ శాఖ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, మద్యం సేవించి వాహనం నడుపుతున్న కొంత మందిని జైలుకు పంపిన సంఘటనలు ఉన్నాయన్నారు. వాహన దారులు రోడ్డు పై ప్రయాణించేటప్పుడు ఇతరులకు ఇబ్బందులు కలగకుండా ప్రయాణించాలని తెలిపారు. యువత ఎక్కువగా బైక్ లపై రాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాల బారిన పడుతూ తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగులుస్తున్నారని అన్నారు. యువత తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఆశలను, ఆశయాలను గుర్తు పెట్టుకుని, వేగ నియంత్రణ పాటించాలని ఎస్పీ సూచించారు. అంబేద్కర్ సర్కిల్ లో కళాకారులు హెల్మెట్ దరించాలని అట, పాటలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, రవాణా శాఖ అధికారి మహమ్మద్ సంధాని, అదనపు ఎస్పీ బోనాల కిషన్, డిఎస్పీ సంపత్ రావు, సిఐలు నరేష్ కుమార్, మల్లేష్, ఎస్ఐలు, సింగరేణి , జెన్కో అధికారులు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, బార్ అసోసియేషన్ సభ్యులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అధిక శబ్దం కలిగించే సైలెన్సర్లను అమర్చితే కఠిన చర్యలు

***అధిక శబ్దం పర్యావరణానికి విఘాతం**
*** 24 ద్విచక్ర వాహనాలకు జరిమానాలు**
**- సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం**




**విశ్వంభర, సూర్యాపేట:** అధిక శబ్దం కలిగించే సైలెన్సర్లను వినియోగించడం నేరం అని సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం అన్నారు.అధిక శబ్దం ఇచ్చే సైలెన్సర్ల పట్ల కలిగే నష్టాలను ఈరోజు సూర్యాపేట పట్టణంలో ఖమ్మం క్రాస్ రోడ్ వద్ద వాహనచోదకులకు జాతీయ రోడ్డు భద్రత మసోత్సవాల్లో భాగంగా ఎస్ఐ సాయిరాం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ద్విచక్ర వాహనాలకు చట్ట విరుద్ధమైన అతి ధ్వని చేసే సైలెన్సులను ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత శబ్దకాలుష్యం, ధ్వని కలుగజేసే సైలెన్స్లర్లను ఉపయోగించకూడదని యువత ఇలాంటి వాటి పట్ల దూరంగా ఉండి లక్ష సాధన కోసం శ్రమిస్తూ... బాగా చదివి జ్ఞానం సంపాదించుకోవలని అన్నారు. సురక్షత దృష్టితో ప్రతి ఒక్కరూ హెల్మెట్లు ధరించాలన్నారు.అధిక ధ్వని కలిగించే సైలెన్సర్లను అమర్చిన వారు వాటిని తొలగించాలని లేదంటే జరిమానా విధించడంతో పాటు కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు. ధ్వని కాలుష్యం వల్ల కలిగే నష్టాలు వినికిడి లోపంతో పాటు మానసిక వ్యాధులు కలుగుతాయని అంతేకాకుండా గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు ఈ శబ్దం వింటే పెను ప్రభావం చూపుతుదని వాహన చోదకులకు అవగాహన కల్పించారు. గత నెల రోజుల వ్యవధిలో 24 ద్విచక్ర వాహనాలకు జరిమానాలు గత నెల రోజుల వ్యవధిలో ద్విచక్ర వాహనాలకు చట్ట విరుద్ధమైన అతి ధ్వని చేసే సైలెన్సర్‌లను ఉపయోగించిన 24 మంది వాహన చోదకులకు జరిమానాలు విధించడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

## తన్మయ్‌కు జగన్‌మోహన్ రావు అభినందనలు

*** హైదరాబాద్ రంజీ జట్టును ప్రోత్సాహించిన హెచ్‌సీఏ అధ్యక్షుడు**
*** మిలింద్, సిరాజ్, తన్మయ్, తనయ్‌పై ప్రశంసలు**



**విశ్వంభర, హైదరాబాద్:** రంజీ సీజన్‌లో నాలుగు శతకాలు, రెండు హాఫ్ సెంచరీలు సాధించిన హైదరాబాద్ ఓపెనర్ తన్మయ్ అగర్వాల్‌ను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు అభినందించారు. శుక్రవారం నాగపూర్‌లో విదర్భతో జరుగుతున్న ఈ సీజన్ ఆఖరి రంజీ మ్యాచ్‌ను జగన్‌మోహన్ రావు ప్రత్యక్షంగా వీక్షించారు. హైదరాబాద్ ఆటగాళ్ల ప్రదర్శనను తిలకించి మ్యాచ్ అనంతరం జట్టుతో సమావేశమై వారి ఆటతీరుపై విశ్లేషించారు. ఈ సీజన్‌లో ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో 84.36 సగటుతో 928 పరుగులు చేసిన తన్మయ్ అగర్వాల్‌ను ప్రశంసించారు. తన్మయ్ త్వరలో టీమిండియాలోకి రావాలని ఆకాంక్షించారు. లీడింగ్ రన్ స్కోరర్‌గా ఉన్న తన్మయ్‌కు తన సొంత నిధులు నుంచి రూ.1 లక్ష నగదు బహుమతిని జగన్‌మోహన్ రావు ప్రకటించారు. ఇక, ఏడు మ్యాచ్‌ల్లో 33 వికెట్లు పడగొట్టిన స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్ ప్రదర్శనను కూడా కొనియాడారు. ఈ సీజన్‌ను హైదరాబాద్ విజయంతో ముగించాలని, ఆ బాధ్యతను కెప్టెన్ సీవీ మిలింద్, అంతర్జాతీయ పేసర్ మహ్మద్ సిరాజ్ తీసుకోవాలని సూచించారు. జట్టంతా సమష్టిగా రాణించి విజయంతో హైదరాబాద్‌కు రావాలని కోరారు.

## క్లినికల్ రీసెర్చ్‌పై విజయవంతంగా ముగిసిన కార్యశాల



**విశ్వంభర, సంగారెడ్డి:** కెరీర్ గైడెన్స్ సెంటర్ (సీజీసీ) సహకారంతో గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో గురు శుక్ర వారాలలో 'క్లినికల్ రీసెర్చ్, క్లినికల్ డేటా మేనేజ్ మెంట్, ఫార్మకోవిజిలెన్స్, అండ్ మెడికల్ రైటింగ్'పై నిర్వహించిన రెండు రోజుల కార్యశాల విజయవంతంగా ముగిసింది. ఈ రంగంలో పేరొందిన క్లినోసోల్ రీసెర్చ్ భాగస్వామ్యంతో నిర్వహించిన ఈ వర్క్ షాపులో ఆ సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి సీ.ఎస్.ముజీబుద్దీన్ ప్రధాన వక్తగా వ్యవహరించారు. ఫార్మాస్యూటికల్, లైఫ్ సైన్సెస్ రంగాలపై అమూల్యమైన అంతర్ద ష్టులను అందించారు. తమ కెరీర్ లను మెరుగుపరచుకోవడానికి ఆసక్తి ఉన్న విద్యార్థులు, నిపుణుల కోసం రూపొందించిన ఈ కార్యశాల క్లినికల్ రీసెర్చ్, ఫార్మకోవిజిలెన్స్, మెడికల్ రైటింగ్, డేటా మేనేజ్ మెంట్ వంటి కీలకమైన రంగాలలో సమగ్ర జ్ఞానాన్ని, ఆచరణాత్మక నైపుణ్యాలను అందించే లక్ష్యంతో సాగింది. అధ్యయన రూపకల్పన, ప్రోటోకాల్ అభివృద్ధి, నియంత్రణ చట్రాలు, ఫార్మకోవిజిలెన్స్ పద్ధతులు వంటి ముఖ్యమైన అంశాలను ఇందులో విశదీకరించారు. ఈ కార్యశాలలో పాల్గొన్నవారు ఆచరణాత్మక అనుభవాన్ని పొందేందుకు, ఉద్యోగ మార్కెట్ లో పోటీతత్వాన్ని అందించే నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి వీలు కలిగింది.స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జీ.ఎస్.కుమార్ అతిథిని స్వాగతించి, విద్యార్థులకు పరిచయం చేశారు. విద్యపరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించడంలో ఇటువంటి వర్క్ షాప్ ల ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఉత్సాహంగా పాల్గొని, ఆయా అంశాలపై కొంతమేరకు అవగాహన ఏర్పరచుకున్న విద్యార్థులను సీజీసీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రమాకాంత బాల్ వందన సమర్పణలో అభినందించారు. ఇందులో పాల్గొన్న వారందరికీ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఇవి వారి వృత్తిపరమైన అభివృద్ధిలో, కెరీర్ అవకాశాలను మెరుగుపరచుకోవడంతో పాటు ఔషధ రంగంలో రాణించడానికి ఎంతగానో ఉపకరిస్తాయనడంలో సందేహం లేదు.

## ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ఒక్కరోజు నిరసన దీక్ష

*** పార్టీలకతీతంగా బంజారా లందరూ పాల్గొనాలి**
*** మండల అధ్యక్షులు జర్పల రాజు నాయక్**



**విశ్వంభర, షాద్ నగర్:** బంజారాల ఆరాధ్య దైవమైన మహావీర్ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి రోజైన ఫిబ్రవరి 15వ తేదీన ప్రభుత్వం అధికారకంగా జయంతి ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించి, ఆరోజు ను సెలవుదినంగా ప్రకటించాలని లంబాడి హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షులు జర్పల రాజు నాయక్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని బంజారా నాయకులు, బంజారా ప్రజలు, బంజారా మహిళలు పార్టీలకతీతంగా పాల్గొని శనివారం షాద్ నగర్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా నిర్వహించనున్న నిరసన దీక్ష కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలి



**విశ్వంభర, భూపాలపల్లి:** వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలు, కరీంనగర్‌మెదక్ నిజామాబాద్‌ఆదిలాబాద్ పట్టభద్రులు మరియు ఉపాధ్యాయ ఎన్నికల, షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం విడుదల చేయడంతో జిల్లాలో తక్షణమే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, జిల్లా పరిధిలో అభ్యర్థులు, ప్రజలు, రాజకీయ నాయకులు ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలని, భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు ఫిబ్రవరి 3 నోటిఫికేషన్ రానుందని, మార్చి 8న ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని ఎస్పీ తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని, అందరూ పాటించాలని, ర్యాలీలు, సభలు, సమావేశాలకు సంబంధిత అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలని కోరారు. అభ్యర్థులు, నేతలు వారి ప్రచారంలో కులం, మతం పేరుతో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవద్దని, ప్రార్థన స్థలాల్లో ప్రచారం వంటివి చేయకూడదని, ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురి చేయవద్దని అన్నారు. అలాగే సోషల్ మీడియాలో ఇతరులను కించపరిచే విధంగా పోస్టులు పెట్టవద్దని ఎస్పీ కిరణ్ ఖరే కోరారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

## రాజ్యసభ ఛైర్మన్‌ని కలిసిన ఎంపీ రవిచంద్ర



**విశ్వంభర, ఢీల్లీ:** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, కే.ఆర్.సురేష్ రెడ్డి, దీవకొండ దామోదర్ రావు, డాక్టర్ బండి పార్థసారథి రెడ్డి తదితరులు పార్లమెంటులో ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధనఖర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో ప్రారంభమైన విషయం తెలిసిందే. పార్లమెంట్ ఉభయ సభల సమావేశంలో రాష్ట్రపతి ప్రసంగం ముగిసిన తర్వాత ఎంపీలు రవిచంద్ర, సురేష్ రెడ్డి, దామోదర్ రావు, పార్థసారథి రెడ్డిలు రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధనఖర్ ను మర్యాదపూర్వకంగా కలిసి కొద్ది సేపు ముచ్చటించారు.

## భక్తులకు కుంభాభిషేక ఆహ్వానం



**విశ్వంభర, కాళేశ్వరం:** జయశంకర్ భూపాల పల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం లో జగద్గురు శృంగేరి పీఠాధిపతుల ఆశీస్సులతో తపోవన పీఠాధిపతి శ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామి వారి కరకమలములచే లోక కళ్యాణార్థమై ఫిబ్రవరి 07, 2025 నుండి ఫిబ్రవరి 09, 2025 వరకు శతచండి మహారుద్ర సహస్ర ఘటాభిషేక కుంభాభిషేక మహోత్సవములు నిర్వహించబడునని ఆలయ ఈఓ మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు.తేదీ ఫిబ్రవరి 09, 2025 ఉదయం 10 : 42 గంటలకు మహా కుంభాభిషేకం జరుపబడును అని కుంభాభిషేకములో 2516 రూపాయలు చెల్లించిన దాతలకు కుంభాభిషేకం తర్వాత శేష వస్త్రములు కలశ ప్రసాదం ఇవ్వబడునని ఆయన తెలిపారు. విరాళం చెల్లించువారు కౌంటర్లో లేదా దేవస్థానం ఆఫీసులో చెల్లించి రసీదు పొందగలరు అని ఆయన సూచించారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావలసినదిగా ఆలయ ఈవో మహేష్ కోరారు.

# మదర్ డెయిరీ రైతుల పెండింగ్ పాల బిల్లులు చెల్లించాలి



విశ్వంభర, రామన్నపేట: రంగారెడ్డినల్లగొండ మదర్ డెయిరీ పాల రైతులకు రావాల్సిన పెండింగ్ పాల బిల్లులు వెంటనే విడుదల చేసి పాడి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం యాదాద్రి జిల్లా అధ్యక్షులు మేక అశోక్ రెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని స్థానిక సీపీఎం మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాడి రైతుల సమావేశంలో మాట్లాడుతూ 1986 నుండి రంగారెడ్డి నల్లగొండ పాల ఉత్పత్తిదారులకు సేవలందిస్తూ రైతుల కృషితో దినదినం ఆదాయంతో ముందుకు పోతుందని, 24 శీతలీకరణ కేంద్రాలు, 422 సొసైటీలు, 50 వేల రైతు కుటుంబాలతో రోజుకు లక్షా పదిహేను వేల లీటర్ల పాలు పోస్తున్నారు. పాల ఉత్పత్తి రైతులకు ప్రతీ 15 రోజులకు ఒకసారి పాల బిల్లు నికరంగా చెల్లించేది కానీ పాలకవర్గం నిర్లక్ష్యం మూలంగా గత 2 నెలలుగా, నాలుగు దఫాలుగా రైతులకు 25 కోట్ల రూపాయలు పెండింగ్ ఉండటంతో పాడి రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. గత కాలంనుండి లాబాల్లో వెలుగొంది, భూములు, ఆస్తులను కొనుగోలు చేసిన మదర్ డెయిరీ ఇప్పుడు ఎందుకు నష్టాల్లో, అప్పుల్లో ఉందో పాలకవర్గం రైతులకు చెప్పాలన్నారు. ఇంతకు ముందు లీటరుకు 4 రూపాయల ప్రోత్సహాకం ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఒకే దఫా వేసి చేతులు దులుపుకుందని అన్నారు. వెంటనే పాడి రైతులకు బకాయి బిల్లులు విడుదల చేసి పశువుల దాణాకు, పాడి సంరక్షణకై, మందులు, గడ్డి విత్తనాలకు యాభై శాతం సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలన్నారు. గత ప్రభుత్వం నష్టాల్లో ఉన్న విజయ డెయిరీకి 160 కోట్లు ఎలా ఇచ్చిందో అలాగే మదర్ డెయిరీని కూడా ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. లేని పక్షంలో పాడి రైతులతో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామ్మన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, సిరిపురం గ్రామ శాఖ కార్యదర్శి అంబటి మల్లారెడ్డి, పాలసంఘం మాజీ ఛైర్మెన్ బిట్ల రాంరెడ్డి, ఏళ్ల సంతోష్ రెడ్డి, మాజీ కార్యదర్శి కూనూరు వెంకటేశం, ఎండీ రషీద్, అవనగంటి స్వామి, పల్లె సత్యం తదితరులు పాల్గొన్నారు.

## వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవ వేడుకలు



**విశ్వంభర, మిర్యాలగూడ:** వాసవి క్లబ్ గ్రేటర్ మిర్యాలగూడ అధ్యక్షుడు మంచుకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవి కన్యాకాపరమేశ్వరి దేవాలయం నందు వాసవి అమ్మ వారి ఆత్మర్పణ దినోత్సవం సందర్బంగా అమ్మ వారికీ "పట్టు వస్రాలు" పూలు, గాజులు, పండ్లు, పసుపు, కుంకుమ సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రేటర్ క్లబ్ సెక్రటరీ రంగా శ్రీనివాస్, కోశాధికారి ఇడుకుళ్ళ శ్రీనివాస్, గట్ల జవహర్ బాబు, డిస్ట్రిక్ట్ సెక్రటరీ సర్వీసెస్ ఆఫీసర్ లకుమారపు పాండురంగయ్య, మిర్యాల శత్రయ్య, భవాని, జోన్ ఛైర్మన్ రేపాల శ్రీనివాస్, రీజియన్ ఛైర్మన్ వెచ్చ సతీష్,డిస్ట్రిక్ట్ ఆఫీసర్ తిరునగర్ పద్మావతి, ఓరుగంటి వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

## అధికారులు సమన్వయంతో పనిచేయాలి

*** జిల్లా కలెక్టర్ ప్రావిణ్య**



**విశ్వంభర, వరంగల్:** ఎకో టూరిజం పార్క్ ఏర్పాటు కొరకు ధర్మసాగర్ మండలంలోని ఇనుపరాతి గుట్టలో స్థలం ఎంపిక ను అధికారులు సమన్వయంతో పనిచేసి పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు.శుక్రవారం హనుమకొండ కలక్టరేట్ లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కుడా ప్రతిపాదించిన ఎకో టూరిజం పార్క్ స్థలం ఎంపిక కొరకు అటవీ, రెవెన్యూ, కు డా అధికారులు కలిసి స్థలాన్ని ఎంపిక చేయాలని సూచించారు. ఈ స్థలం ఎంపికను ఎలాంటి సమస్యలు రాకుండా పూర్తి చేసి కుడా కు అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పార్క్ ఏర్పాటయితే ప్రజలకు, పిల్లలకు సంబంధించి కార్యక్రమాలు ఉంటాయని, అలాగే హాట్ బెలూన్స్, వాటర్ స్పోర్ట్స్, రకరకాల పక్షులను చూడవచ్చని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి లావణ్య, అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, హనుమకొండ ఆర్డిఓ రాథోడ్ రమేష్ ,కు డా సీపీఓ అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

## కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం



**విశ్వంభర, మెట్ పల్లి:** జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గం మెట్ పల్లి పట్టణం వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని వాసవి దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం మెట్ పల్లి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకం, కుంకుమ పూజ, అష్టోత్తరాలు, నవగ్రహ పూజ, పూర్ణాహుతి కార్యక్రమా లను పురోహితులు భాస్కర శర్మ విధుమౌళి శర్మ ఆధ్వర్యంలో నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో జిల్లా వైశ్య సంఘం అధ్యక్షులు లింబాద్రి, పట్టణ అధ్యక్షులు మైలారపు రాంబాబు, దొంతుల లక్ష్మీనారాయణ, కొత్త నవీన్ బండారి ప్రసాద్, చడ చందు, కోట కిరణ్, చకినం కేదార్నాథ్, చిట్టి మిల్లి శ్రీనివాస్, కటకం శంకర్, రేగళ్ల సాయి, ఆమెటీ సందీప్ మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం



**విశ్వంభర, నాగోల్:** కొత్తపేటలోని కమర్షియల్ టాక్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ హాల్ ఆర్యవైశ్య వాసవి మాత సేవా సమధ్య అధ్యక్షుడు గుండా రామకోటేశ్వరరావు ఆర్యవైశ్య వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా 108 కలశం లతో అభిషేకం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య వాసవి మాత సేవా సమితి కొత్తపేట ఉపాధ్యక్షులు భూశెట్టి సురేష్ ,ప్రధాన కార్యదర్శి పచ్చి పులుసు శ్రీనివాసరావు, కోశాధికారి పట్టుకోరి రమేష్, సంయుక్త కార్యదర్శి పాపిశెట్టి మధు, ఆర్గనైజింగ్ సంయుక్త కార్యదర్శి కొండూరు వెంకటరమణ ,కల్చరల్ సెక్రటరీ మురళి శేఖర్, కార్యవర్గ సభ్యులు కామిశెట్టి శ్రీనివాసులు, పబ్బా కృష్ణమూర్తి, మారం నగేష్ ,వంశీకృష్ణ, మల్లికార్జున్ గుప్తా, సింహయ్య, కళ్యాణ్ గుప్త, నవీన్ కుమార్ ,ప్రేమ్ కుమార్ చంద్రశేఖర్ లు పాల్గొన్నారు.

## గవర్నర్‌కు సమతా కుంబ్ -2025 ఆహ్వాన పత్రిక



**విశ్వంభర, హైదరాబాద్:** శంషాబాద్ లోని సమతా కుంబ్2025 రామానుజ చార్య 108 దివ్య దేశాల తృతీయ బ్రహ్మోత్సవాకు హాజరవ్వాలని కోరుతూ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు వికాస తరంగణి అధ్యక్షులు విశ్రాంత ఐఏఎస్ అధికారి జగదీశ్వర్, సమతా మూర్తి క్షేత్రం ఛైర్మన్ తేలుకుంట్ల రమేష్ గుప్తా లు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమతా స్ఫూర్తి సహకారమై నిలిచి మూడేళ్లు నిండుతున్న సందర్భంగా పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేశామని తెలిపారు. భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని సూచించారు. ప్రతిరోజు తిరుమంజన సేవలు, గరుడ సేవలు, విశేష కార్యక్రమాలు, సామూహిక పూజలు, సామూహిక పారాయణాలు, విశేష ఉత్సవములు, మహా పూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ, లాంటి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.



**చౌటుప్పల్ లోని వీవీఆర్ గార్డెన్ పంక్షన్ హాల్ నందు సమాచార హక్కు వికాస సమితి రాష్ట్ర కార్యదర్శి, డోల్ దెబ్బ వ్యవస్థాపక అధ్యక్షులు మాల్గ యాదయ్య కుమార్తె నిషిక - బిరేష్ వివాహానికి ఉమ్మడి రాష్ట్ర మాజీ ప్రధాన కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు, సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు లయాన్ డాక్టర్ యర్రమాధ కృష్ణారెడ్డి, జేఏసీ జిల్లా నాయకులు డాక్టర్ తోట నరసింహచారి, పన్నాల గోపాల్ రెడ్డి లు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.**

**- విశ్వంభర, చౌటుప్పల్**

# ఆత్మరక్షణ కోసం కరాటే ముఖ్యం

**- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్**



**విశ్వంభర, ఎల్బీనగర్:** ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవడం ప్రతి ఒక్కరికి అవసరమని, క్రమ శిక్షణతో కూడిన విజయాన్ని తెలంగాణ రాష్ట్రం మొట్టమొదటిసారిగా జనవరి నెలలో సీఎం కప్ పేరిట రాష్ట్రంలో క్రీడలను నిర్వహించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. విక్టరీ షోటోఖాన్ కరాటే అసోసియేషన్ దు ఇండియా ఛైర్మన్ కోమాకుల సదాశివుడు ఆధ్వర్యంలో రూపొందించిన 2025 క్యాలెండర్ ను మహేష్ కుమార్ గౌడ్ తో పాటు సినీ హీరో సుమన్ లు ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే క్రీడలలో విద్యార్థులను ప్రోత్సహించడం పట్ల అభినందించారు. సినీ నటుడు సుమన్ మాట్లాడుతూ విక్టరీ షోటోకాన్ కరాటే అసోసియేషన్ రాష్ట్రంలోనే కాకుండా జాతీయ అంతర్జాతీయ స్థాయిలో మంచి క్రీడాకారులను తీర్చిదిద్దుతూ ఎస్ జిఎఫ్, యూనివర్సిటీ గేమ్స్, ఏషియన్ గేమ్స్ లో క్రీడాకారులు పథకాలను కైవసం చేసుకోవడం పట్ల అభినందించారు. తెలంగాణలో సిఎం కప్ లో కూడా ఈ అసోసియేషన్ కు చెందిన క్రీడాకారులు గోల్డ్, సిల్వర్ మెడల్ సాధించి క్రీడా స్ఫూర్తిని పెంపొందించారన్నారు. నారాయణ స్కూల్స్ జనరల్ మేనేజర్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ కరాటేను గుర్తించే విధంగా కృషి చేస్తున్న పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ని కరాటేని ఎంకరేజ్ చేస్తున్న సుమన్ తలవార్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణ స్కూల్స్ జనరల్ మేనేజర్ కే.గోపాల్ రెడ్డి, కూకట్ పల్లి బ్రాంచ్ ఏజీఎం వేణుగోపాల్, విక్టరీ చోటకార్ కరాటే అసోసియేషన్ వ్యవస్థాపకులు ఆర్.మల్లికార్జున్ గౌడ్, సీనియర్ ఇన్స్పెక్టర్ యు. శ్రీనివాస్ ఎం.వెంకటేష్, కొయ్యడ ప్రసాద్ గౌడ్, బండి రామకృష్ణ గౌడ్, భార్గవ్ పాల్గొన్నారు.

## హెచ్ యూ జే పేరును వాడుకుంటున్న వారిపై చర్యలు తీసుకోండి

**కమిషనర్ గంగాధర్ కు హెచ్ యూజే నేతల ఫిర్యాదు**



**విశ్వంభర, హైదరాబాద్:** తొలిసారి ప్రభుత్వ గుర్తింపు పొందిన స్థానిక జర్నలిస్టుల సంఘం ''హైదరాబాద్ యునియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్ యూ జే. రి.నెంబి 2794.) పేరును అనధికారికంగా ఉపయోగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని రిజిస్టర్డ్ హెచ్ యూజే సంఘం అధ్యక్షులు బి అరుణ్ కుమార్, కార్యదర్శి బి జగదీశ్వర్ నేతృత్వంలో శుక్రవారం కార్మిక శాఖ అదనపు కమిషనర్ డా.గంగాధర్, జాయింట్ కమిషనర్ సునీత గోపాల్ దాస్ తో సమావేశమయ్యారు. జర్నలిస్టుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వాల దృష్టికి తీసుకెళుతూ వాటి పరిష్కారానికి హెచ్ యూ జే నిఖార్సుగా పనిచేస్తున్నదని చెప్పారు. తెలంగాణ యునియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీ యూ డబ్లూ జే) సంఘం తమ హైదరాబాద్ యూనిట్ కు అనధికారికంగా హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్ యూ జే) పేరును ఉపయోగిస్తున్నారని వారికి ఫిర్యాదు చేశారు. వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని వారు కార్మిక శాఖ అదనపు కమిషనర్ డా.గంగాధర్ ను కోరారు. విచారణ చేసి చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని గంగాధర్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హెచ్ యూజే ట్రెజరర్ బి.రాజశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గంధ్ర నవీన్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ సీహెచ్ మధుకర్, హెచ్ యూజే ఉపాధ్యక్షులు ఎం.రమేష్, జి. రేణయ్య, జాయింట్ సెక్రెటరీలు ఎం.జీవన్ రెడ్డి, అచ్చిన ప్రశాంత్, టీడబ్లూజేఎఫ్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ విజయానంద్, నాయకులు హరి ప్రసాద్, రోజారాణి, పలువురు సీనియర్ జర్నలిస్టులు ఉన్నారు.

## విద్యారంగ సమస్యలపై విద్యార్థులు ఉద్యమించాలి



**విశ్వంభర, రామన్నపేట:** ప్రభుత్వాలు అవలంబించే విద్యా వ్యతిరేక విధానాలపై విద్యార్థులు ఉద్యమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చింతల శివ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలోని స్థానిక శ్రీ ఇందు కళాశాలలో ఎస్ఎఫ్ఐ రావన్నపేట 21వ మహాసభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందని ద్రాక్షలా మారిందని అన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం విద్యలోకి మతోన్మాద లని ప్రేరేపిస్తూ నూతన జాతీయ విద్యా విధానంతో విద్యార్థులకు విద్యను దూరం చేస్తుందన్నారు. యూనివర్సిటీల్లో వీసీలను ఇష్టారాజ్యంగా నియమిస్తూ వ్యక్తిగత ఎజెండాను అమలు చేస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందుకు విద్య విధానాన్ని సమూలంగా మారుస్తామని చెప్పి అడుగు ముందుకే వేయడం లేదన్నారు. విద్యా కమిషన్ ఛైర్మన్ ను పెట్టారు తప్ప ఎలాంటి చర్యలు చేపట్టలేదని ప్రభుత్వ బడులు మూతబడుతున్నా చూస్తూ పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ మండల నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా మేకల శివకుమార్, పుట్టల ఉదయ్ కుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బత్తిని సందీప్, గట్టు నరేష్, సహాయ కార్యదర్శిగా భూక్యా సంతోష్ నాయక్, నిఖిల్, గౌరిగే ధనలక్ష్మి, బోనగిరి లోకేష్, ఉమ, మౌనిక, సాయి ప్రసన్న, అరుణ్ లతో పాటు 15 మందితో నూతన కమిటిని ఎన్నుకోవడం జరిగింది.ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు నీల ఐలయ్య పాల్గొన్నారు.

## దేవాలయ మహోత్సవాలకు విరాళం అందజేసిన చిలుక



**విశ్వంభర, ఎల్బీనగర్:** మహేశ్వరం నియోజకవర్గం ఆర్కె పురం డివిజన్ టెలిఫోన్ కాలనీ లోని జ్ఞాన సరస్వతి దేవాలయ కుంభాభిషేక మహోత్సవాల అన్న ప్రసాద వితరణ కై కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి రూ. 2 లక్షలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా చిలుక ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 31 వ తేదీ నుండి ఫిబ్రవరి నెల 04వ తేదీ వరకు నిర్వహించే కుంభాభిషేక మహోత్సవాల కార్యక్రమానికి తన వంతుగా ఆర్థిక సాయం అందజేయడం జరిగిందన్నారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ అడగగానే దేవాలయ సముదాయానికి భారీ విరాళాన్ని అందజేసినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సేవా గుణానికి తర్కాణం, అమ్మ వారి ఆశీస్సులతో వారు రాబోయే రోజులలో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేసి, జీవితంలో ఉన్నత విజయాలను అందుకోవాలని కోరుకుంటున్నామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో దేవాలయ సముదాయ కమిటీ సభ్యులు వర ప్రసాద్, ప్రభాకర్ రెడ్డి, రమణయ్య, కాలనీ అధ్యక్షులు సంజీవరెడ్డి, పాము యాదగిరి, మధుసూదన్, సుబ్బారావు, కాంగ్రెస్ నాయకులు పెద్దవూర సైదులు, రాజు, రఘు, మోహన్ రెడ్డి, నగేష్, విప్లవ్ తదితరులు పాల్గొన్నారు.

## మాతా శిశు మరణాలను తగ్గించాలి

**- డీ ఎం హెచ్ ఓ సాంబశివరావు**




**విశ్వంభర, వరంగల్:** వరంగల్ జిల్లాలో జరుగుతున్న మాత శిశు మరణాలను తగ్గించాలని డీఎంహెచ్ఓ సాంబశివరావు అన్నారు. ఆర్మాన్ స్వచ్ఛంద సంస్థ జాతీయ ఆరోగ్య మిషన్ సంయుక్తంగా నిర్వహించిన శిక్షణా కార్యక్రమం లో డీఎంహెచ్ ఓ డాక్టర్ సాంబశివరావు ముఖ్య అతిథి గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీ గా గుర్తించినప్పటి నుండి ప్రసవం అయ్యేవరకు ప్రతీ రోజు ఫాలోఅప్ చేస్తూ వారికీ అన్ని రకాల వైద్య పరీక్షలను నిర్వహించాలి అని అన్నారు. అధిక రక్తపోటు, మధుమేహం, క్షయ వ్యాధి, రక్త హీనత, అధిక బరువు, మెంటల్ హెల్త్, ప్రమాద కరమైన సూచనలు ఉన్నప్పుడు వారి ఆరోగ్యం, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డా. సంతోషిని, డా. స్రవంతి, అర్మాన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, డా. అర్చన, మాతా శిశు సంరక్షణ అధికారి, మనోజ, నాగరాజు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాపు సంఘం అధ్యక్షుడిగా రవి కేశవ నాయుడు



**విశ్వంభర, ఎల్బీనగర్:** రంగారెడ్డి జిల్లా జాతీయ కాపు సంఘం అధ్యక్షుడు గా గంధం రవి కేశవ నాయుడు నియామకమయ్యారు. ఈ మేరకు జాతీయకాపు సంఘం వ్యవస్థాపకులు, అధ్యక్షులు కర్ణ మురళీకృష్ణ నాయుడు ఉత్తర్వులు ఇచ్చారు. సందర్భంగా రవి కేశవ నాయుడు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన తెలంగాణ జిల్లా రాష్ట్ర అధ్యక్షులు సురేష్ నాయుడు, ఇతర పెద్దలందరికీ కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు.ఈ బాధ్యతను కులం వారికి అన్నివేళలా ఉపయోగ పడతానని అన్నారు. ఈ సందర్భంగా స్నేహితులు, బంధువులు కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## 'కన్యకాపరమేశ్వరి మాత ఆత్మార్పణ దినోత్సవం

**విశ్వంభర, ఎల్బీనగర్:** మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే డివిజన్ పరిధిలోని యాదవ్ నగర్ కాలనీలోని శ్రీ క్రిష్ణ దేవాలయంలో ఆర్కే పురం డివిజన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరి మాత ఆత్మార్పణ దినోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన పూజ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షుడు తాడేపల్లి వెంకటేశం గుప్తా, ఆర్కే పురం డివిజన్ అధ్యక్షుడు పొద్దుటూరు శ్రీనివాస్ గుప్తా, మహిళా అధ్యక్షురాలు లక్ష్మి సుబ్రహ్మణ్యం, శ్యామ్, వేణు తదితరులు పాల్గొన్నారు.



# సమాజ అభివృద్ధిలో విద్యార్థుల పాత్ర చైతన్యంగా ఉండాలి

*** మహనీయులు, పోరాట వీరుల స్ఫూర్తితో సాగాలి**

**- పి.డి.ఎస్.యు ప్రజా కవి కొమిరె సాకి**




**విశ్వంభరం, మహబూబాబాద్:** మహబూబాబాద్ పట్టణంలోని టీ.పి.టి.ఎఫ్ జిల్లా కార్యాలయం నందు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యు) జిల్లా జనరల్ కౌన్సిల్ ని నిర్వహించుకోవడం జరిగింది. కౌన్సిల్‌కు ముందుగా పి.డి.ఎస్.యు బిగిపిడికిలి జెండాను జిల్లా నాయకులు బి దేవేందర్ ఎగురవేశారు. అనంతరం విద్యార్థి అమరవీరులకు సంతాపంగా కౌన్సిల్ సభ రెండు నిమిషాలు మౌనం పాటించడం జరిగింది. కౌన్సిల్ లో ప్రజాకవి కొమిరె సాకి ప్రారంభ ఉపన్యాసం చేస్తూ నేటి సమాజంలో విద్యారంగన్ని పాలకులు సామాజిక బాధ్యత నుండి తప్పించి కార్పోరేట్ హస్తగతం చేశారు. కార్పొరేట్ శక్తులు వ్యాపార సరుకుగా మార్చి వ్యాపార లక్షణాలు పులుముకున్న విద్యా వ్యవస్థ కనీస మానవ విలువల్ని విద్యార్థులకు అందించడం లేదు. మార్కులు ర్యాంకుల వెంట విద్యార్థులను పరుగులు తీయిస్తూ మానసిక ఉల్లాసానికి విద్యార్థులను దూరం చేస్తున్నారు. నేటి బాలలే రేపటి పౌరులు అనే సూక్తిని మరిచి సన్మార్గంలో విద్యార్థులను నడిపించాల్సిన పాలకులు పరోక్షంగా పెడధోరణుల వైపు ప్రోత్సహిస్తున్నారు. విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోకుండా ఉండేలా చూస్తూ విద్యార్థుల చైతన్యాన్ని నీరు కారుస్తున్నారు. అనేక అసమానలతో కూడిన నేటి సమాజంలో విద్యార్థులు సమాజ ప్రగతిని, సమాజ గత చరిత్రను అధ్యయనం చేస్తూ విద్యార్థులు శాస్త్రవేత్తల, మహనీయుల, పోరాట వీరులను ఆదర్శంగా తీసుకుంటూ వారి మార్గంలో పయనిస్తూ, సమాజంలో ఉన్నతులుగా ఎదాగలని, అదే సమయంలో సామాజిక పోరాటాలలో భాగస్వామ్యం అవుతు వెనుకడుగు వేయకుండా రెండు విధాల ఎదగాలని విద్యార్థులకు తెలిపారు. ఈ కౌన్సిల్ సభలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ఎస్ కె మదార్, పి.డి.ఎస్.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ సాంబ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ పాపారావు లు ప్రసంగించారు. రాష్ట్ర నాయకులు జె గణేష్, జిల్లా నాయకులు నవీన్, ప్రకాష్, సౌజన్య, నూతన్, వినోద్, రాంబాబు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత మాసోత్సవాలు



**విశ్వంభర, మహబూబాబాద్:** రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని మహబూబాబాద్ పట్టణంలోని ఫాతిమా స్కూల్ విద్యార్థులకు రోడ్ సేఫ్టీ భద్రత ట్రాఫిక్ నియమాలు పాటించవలసిన జాగ్రత్తలపై జిల్లా రవాణా శాఖ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. (వేర్ హెలిమెట్) హెల్మెట్ ధరించండి అని విద్యార్థిని విద్యార్థులు మానవహారంగా ఏర్పడి తెలియపరిచారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు, తేదీ జనవరి 1 నుండి 31, వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతీ ఒక్కరు బాధ్యతయూతంగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని డీటీఓ జైపాల్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్స్ సాయిచరణ్, వెంకట్ రెడ్డి, స్కూల్ ప్రిన్సిపల్ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాంస్కృతిక సారధి టీం లీడర్ గా శ్రీకాంత్



**విశ్వంభర, తిరుమలగిరి:** తెలంగాణ సాంస్కృతిక సారధి ఉద్యోగుల సంఘం సూర్యాపేట జిల్లా టీం లీడర్ గా పాలకుర్తి శ్రీకాంత్ ఏకగ్రీవ ఎన్నికయ్యాడు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సాంస్కృతిక సారధి కళాకారుల ఆధ్వర్యంలో తిరుమలగిరి మండలం గుండెపురి గ్రామానికి చెందిన పాలకుర్తి శ్రీకాంత్ ను ఏకాగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ ఎన్నికకు సహకరించిన సాంస్కృతిక సారధి కళాకారులు ఈర్ల సైదులు. గడ్డం ఉదయ్. కాటి నాగరాజు, దప్పు శంకర్, పాక ఉపేందర్, మేడిపల్లి వేణు, మద్దిరాల మంజుల, సిరిపంగి రాధ, నేమ్మాది స్రవంతి, పోతరాజు శిరీష, ఎన్నికల సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

## రోడ్డున పడ్డ వీధి వ్యాపారులు



**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ నల్లకుంట శంకరమఠం కూరగాయల మార్కెట్ 50 ఏళ్ల చరిత్ర కలిగినటువంటిది. ఈ మార్కెట్ నేడు కనుమరుగైంది. కొన్ని సంవత్సరాల నుండి కొనసాగుతున్న మార్కెట్ అటు ఇటు రాకపోకలు సాగించే వారికి ఇబ్బంది నెపంతో జీహెచ్ఎంసీ కమిషనర్కు కొందరు వ్యక్తులు కంప్లైంట్ చేయగా జీహెచ్ఎంసీ సంబంధిత అధికారులు నేడు తోపుడుబండ్లను చిరు వ్యాపారస్తులను సముదాయాలను భారీ పోలీసుల బందోబస్తు నడుమన తొలగించారు. తొలగిన చిరు వ్యాపార సముదాలతో రోడ్డున పడ్డ చిరు వ్యాపారస్తులు. ఏళ్ల తరబడి వ్యాపారాన్ని నమ్ముకుని జీవిస్తున్న కుటుంబీకులు ఒక్కసారిగా రోడ్డున పడ్డామని దుఃఖంతో కనిపించారు. మాకు తాత్కాలిక ఏర్పాట్లు కూడా చేయకపోవడంతో మరి ఇబ్బందిగా ఉంది ప్రభుత్వం చొరవ చూపి మాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయించాలని ప్రాధేయపడ్డారు.


## భూపాలపల్లిలో ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతి



**విశ్వంభర, భూపాలపల్లి:** తెలంగాణ ఉద్యమ కెరటం, ప్రజా యుద్ధ నౌక గద్దర్( గుమ్మడి విఠల్) జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి భూపాలపల్లి లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. తన కలం, గళంతో గద్దర్ తెలంగాణ ఉద్యమానికి ఊపిరులూదారని అన్నారు. సమాజంలో ఉన్న అసమానతలు, వివక్షలకు వ్యతిరేకంగా ఎలుగెత్తిన గొంతుక గద్దర్ అని స్మరించుకున్నారు. గద్దర్ జయంతిని ప్రజా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంతో పాటు, వారి పేరుతో అవార్డు నెలకొల్పి ప్రతి ఏటా కవులు, కళాకారులు, సినీ ప్రముఖులకు ప్రదానం చేయాలని నిర్ణయించిన విషయాన్ని ఎమ్మెల్యే ఈ సందర్భంగా గుర్తు చేశారు. భూపాలపల్లి మంజూరునగర్ సెంటర్లో గద్దర్ విగ్రహాన్ని ఆయన వర్ధంతి (ఆగష్టు 6) నాటికి ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

## బాధ్యతలు స్వీకరించిన డీటీ శ్రీనాథ్

**విశ్వంభర, ఇనుగుర్తి:** మండల ఉప తహసీల్దారుగా తోట శ్రీనాథ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీటీగా, ఇన్చార్జ్ తహసీల్దారుగా పనిచేసిన ఆకుల రవి పాలనాపరమైన ట్రాన్స్ఫర్స్ లో భాగంగా జిల్లా కేంద్రంలో ని ఆర్డీవో ఆఫీసుకు బదిలీ అయ్యారు. కాగా శ్రీనాథ్ చిన్న గూడూరు లో డీటీగా విధులు నిర్వర్తిస్తూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇనుగుర్తి లో జాయిన్ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల అభివృద్ధికి అన్ని పార్టీలతో పాటు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు.




# బీఆర్ఎస్ కార్పొరేటర్లీ అరెస్ట్ అప్రజాస్వామికం

**- మాజీమంత్రి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**



**విశ్వంభర, హైదరాబాద్:** అక్రమంగా బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్ ల అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ బడ్జెట్ సమావేశంలో సమస్యలపై ప్రశ్నించిన బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్ లను అరెస్ట్ చేసి రాంగోపాల్ పేట పోలీస్ స్టేషన్ కు తరలించిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పోలీస్ స్టేషన్ కు చేరుకొని కార్పొరేటర్ లు నిర్వహిస్తున్న ఆందోళనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీహెచ్ఎంసీ బడ్జెట్ సమావేశాలలో ప్రశ్నించిన కారణంగానే మా కార్పొరేటర్ లను అక్రమంగా అరెస్ట్ చేశారని అన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న తమ కార్పొరేటర్ లను బయటకు పంపి బడ్జెట్ ను ఆమోదించడం దుర్మార్గం అని ధ్వజమెత్తారు. ఎలాంటి చర్చ జరగకుండా బడ్జెట్ ఆమోదించడం సరికాదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక అభివృద్ధి పనులు చేపట్టి హైదరాబాద్ ను విశ్వ నగరంగా తీర్చిదిద్దిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారిందని విమర్శించారు. గత సంవత్సరం బడ్జెట్ లో కేటాయించిన నిధులలో ఎంత మేరకు ఖర్చు చేశారో చర్చించాలని ప్రశ్నించినందుకే బీఆర్ఎస్ కార్పొరేటర్ లను అరెస్ట్ చేశారన ఆరోపించారు. బడ్జెట్ సమావేశ మందిరంలో మార్షల్స్, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ లు వ్యవహరించిన విధానం సరైనది కాదన్నారు. భయానక వాతావరణం కల్పించే ప్రయత్నాలు చేశారని, మేయర్ కార్పొరేటర్ ల పట్ల ఎంతో దురుసుగా మాట్లాడారని, బెదిరించే ప్రయత్నం చేశారని కార్పొరేటర్ లు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలో జీహెచ్ఎంసీని ఎంతో హుందాగా నిర్వహించామని చెప్పారు. నగరంలోని ప్రజలు సమస్యలతో అనేక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. అధికారంలో ఉన్నామని ఇష్టానుసారంగా వ్యవహరిస్తామంటే ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రభుత్వ వైఖరిపై ప్రజాస్వామ్య యుతంగా ప్రజాక్షేత్రంలో పోరాడతామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీహరి, శేఖర్, ఆరీఫ్, కిషోర్, అఖిల్ తదితరులు ఉన్నారు.

## 217వ ఉచిత వివాహం



**విశ్వంభర, కొత్తపేట:** సంధ్య గార్ల ఆర్థిక సహకారం తో శ్రీ దాస ఆంజనేయ దేవాలయం కొత్తపేట లో మొగుళ్లపల్లి యూవ సేన ఉపేందర్ ఆధ్వర్యంలో సుమన్ కు మౌనిక తో హిందూ సంప్రదాయం ప్రకారం 217 వ ఉచిత వివాహం శుక్రవారం ఉదయం 9.53 గంటలకు జరిగింది. శ్రీ కోటగిరి సుధాకర్.. ఉదయ లక్ష్మి కుమారుడు సచిన్.. ముఖ్య అతిథి గా స్థానిక కార్పొరేటర్ శ్రీ నాయకోటి పవన్ నూతన దంపతులకు ఆశీస్సులు అందచేశారు. ఉచిత వివాహం ఇద్దరు స్త్రీ పురుషులను భగవంతుడు నిర్ణయిస్తే ఏకం చేసే పవిత్రమైన కార్యక్రమం దేవుడు ఇచ్చిన వరంగా భావిస్తూన్నానని ఉపేందర్ అన్నారు. ఈ వివాహ కార్యక్రమం చేయడం పూర్వ జన్మ సుకృతం గా భావిస్తూ.. సభ్యులు తుమ్మల బాల్ రెడ్డి దాత.. వై సత్యనారాయణ, చోళ్ళేటి ఆనంద్, చొప్పవరపు పవన్, అధ్యక్షులు ఇమ్మడి నారాయణ, విజయ్, బొడ్ల సత్యనారాయణ హాజరైనారు.

## జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశంలో రసాభాస

*** బీఆర్ఎస్ కార్పొరేటర్లు సస్పెండ్**

విశ్వంభర, హైదరాబాద్: జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశంలో రసాభాస నెలకొంది. బడ్జెట్ ఆమోదం తర్వాత ప్రజా సమస్యలపై చర్చించాలని భారాస పట్టుబట్టింది. ఈక్రమంలో కాంగ్రెస్, భారాస కార్పొరేటర్లకు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో భారాసకు చెందిన నలుగురు కార్పొరేటర్లను మార్షల్స్ బయటకు తీసుకెళ్లారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. దీన్ని నిరసిస్తూ మిగతా భారాస కార్పొరేటర్లు మేయర్ పోడియాన్ని చుట్టుముట్టి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అదుపులోకి తీసుకున్న కార్పొరేటర్లను మళ్లీ తీసుకువచ్చి సభను నిర్వహించాలన్నారు. ప్రశ్నోత్తరాలు నిర్వహించి ప్రజా సమస్యలపై చర్చించాలని చెప్పారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. మేయర్ ప్రజా సమస్యలపై చర్చిద్దామని సర్దిచెప్పినా భారాస కార్పొరేటర్లు పట్టువీడలేదు. ఈక్రమంలో ఆమె అసహనం వ్యక్తంచేస్తూనే మార్షల్స్ తీసుకెళ్లిన కార్పొరేటర్లను తిరిగి సభలోకి తీసుకురావాలని పోలీసులను ఆదేశించారు. మరోవైపు ఆ నలుగురు కార్పొరేటర్లు లోనికి రావడానికి నిరాకరించడంతో వాగ్వాదం జరిగింది. దీంతో భారాస కార్పొరేటర్లందరినీ మేయర్ సస్పెండ్ చేశారు. వారిని మార్షల్స్ బయటికి పంపించగా జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

# కార్మిక శాఖ కార్యాలయ ముట్టడి

* కార్మిక శాఖ మంత్రిని వెంటనే నియమించాలి



**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ ఆర్టీసీ ఎక్స్ రోడ్ తెలంగాణ కార్మిక శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో భవన నిర్మాణ రంగాల కార్మిక సంక్షేమ పథకాల అమలులో అవినీతి జరగకుండా ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు కట్టపెడుతున్నామని తప్పుడు ప్రచారం చేసి కార్మిక సంక్షేమానికి తీరని లోటు జరుగుతుందని కార్మికుల శ్రమ ద్వారా వచ్చినటువంటి వేలకోట్ల రూపాయల సెస్సును గత ప్రభుత్వం కరోనా కష్టకాలంలో దుర్వినియోగం చేసిందని, కార్మికుల ఆరోగ్య పరీక్షల పేరిట కార్మిక నిధులను దోపిడీ చేసి తప్పుడు లెక్కలు రాసి సుమారు 300 కోట్లు బోర్డులో నుండి దుర్వినియోగం చేశారని, ఆరోపిస్తూ జరిగిన అక్రమాలపై వెంటనే విచారణ చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. చంద్రం మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు వెల్ఫేర్ బోర్డు ద్వారా మాత్రమే ప్రభుత్వం నిర్వహించాలని కార్మికుడికి శాశ్వత కాలం కార్డులు పనిచేసే విధంగా ఉండాలని ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్ప చెప్పొద్దని టెండర్లు ను రద్దు చేయాలని కార్మికుల ఆరోగ్య పరీక్షల పేరిట కార్మికుల నిధులను దోపిడీ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వెల్ఫేర్ బోర్డుకు భవన నిర్మాణ కార్మికుడినే ఛైర్మన్ గా నియమించాలని ఉపాధి హామీ కూలీలని మా వెల్ఫేర్ బోర్డులో నుండి తొలగించాలని, వారి సభ్యత్వం రద్దు చేయాలని, ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులను నిషేధించాలని, కార్మికులకు 55 సంవత్సరాలకే పెన్షన్స్ సౌకర్యం కల్పించాలని, కార్మిక శాఖ మంత్రిని వెంటనే నియమించాలని అన్నాడు. అనంతరం ధర్నా చేస్తున్న కార్మికుల దగ్గరికి వచ్చిన కార్మిక శాఖ ఉన్నతాధికారి గంగాధర్ వారి సమస్యలకు సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా నని హామీ ఇవ్వడంతో ధర్నా ముగిసింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేందర్, రాష్ట్ర కార్యదర్శి అల్వాల ఎల్లయ్య, గంగాధర్, దశరథ, పరశురాములు, స్వామి, కృష్ణా, తదితరులు పాల్గొన్నారు.


## జిల్లా పర్యాటక అభివృద్ధి మండలి సమావేశం



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే దిశగా కృషి చేయాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో అటవి, దేవాదాయ, ఆర్కియాలజీ మ్యూజియం, విద్యా, ఇరిగేషన్, పర్యాటక శాఖ, పర్యాటక సంస్థ, సమాచార, యువజన సర్వీసులు, మైనార్టీ శాఖల అధికారులతో జిల్లా పర్యాటక అభివృద్ధి మండలి సమావేశం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలనే అంశాలపై చర్చించారు. పర్యాటక శాఖ ద్వారా మంజూరైన నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. గణపురం చెరువు, పాండవుల గుట్ట వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. కొడవటంచలో రాష్ట్ర పర్యాటక శాఖ ద్వారా విడుదలైన బడ్జెట్ వినియోగించాలనే అంశంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా మే నెలలో జరుగనున్న సరస్వతి పుష్కరాల సందర్భంగా కాళేశ్వరం వద్ద అవసరమైన ఏర్పాట్లు, మైలారం ప్రాంతంలోని అభివృద్ధి పనులకు అటవీ శాఖ భాగస్వామ్యం, పాఠశాలలు, కాలేజీల్లో యువ టూరిజం క్లబ్‌లు ఏర్పాటు ద్వారా టూరిజం అభివృద్ధి చేయు అంశాలపై చర్చించారు. తెలంగాణ దర్శిని ద్వారా పర్యాటక ప్యాకేజీలను రూపొందించి పర్యాటకులకు అందుబాటులోకి తేవాలని సూచించారు. జిల్లాలో కొత్త టూరిజం ప్రాంతాలను గుర్తించడం. ఘనపురం గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించడం. జిల్లాలో బడ్జెట్ హోటల్ మరియు హరిత హోటల్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయడం. కేంద్ర ప్రభుత్వ సహకారంతో టూరిస్ట్ హోమ్ స్టే ప్రాజెక్ట్‌ను అమలు చేయడం వంటి కార్యక్రమాలు గురించి చర్చించారు. ఈ సమావేశంలో అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, పర్యాటక, యువజన సర్వీసుల శాఖ అధికారి రఘు, పర్యాటక శాఖ ఏఈ విజయ్, ఆర్కియాలజీ ఏడీ రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ పాలకవర్గ సమావేశం

విశ్వంభర, భూపాలపల్లి: పోటీ పరీక్షలకు సిద్ధపడే పాఠకులకు పుస్తకాలు అందుబాటులో ఉంచాలని భూపాలపల్లి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎల్ విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో గ్రంథాలయ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుస్తక ప్రియులకు, పోటీ పరీక్షలకు సిద్ధపడే వారికి ఉపయోగకరంగా జిల్లాలోని గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలని, అదేవిధంగా జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ మరియు మునిసిపాలిటీ నుండి ఎప్పటికప్పుడు గ్రంథాలయ పన్ను చెల్లించాలని అదనపు సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాలోని ప్రతి గ్రంథాలయంలో విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను పాఠకులకు అందుబాటులో ఉంచాలని అన్నారు. 20242025 ఆర్థిక సంవత్సరంలో ఖర్చు చేసిన వివరాలు మరియు 20252026 బడ్జెట్ అంచనాల ఆమోదం కోసం పంపేందుకు అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి సత్యనారాయణరావు, జిల్లా గ్రంథాల సంస్థ కార్యదర్శి శ్రీమతి టి. శ్రీలత, జిల్లా విద్యాశాఖ నుండి రమేష్, పౌర సంబంధాల సమాచార శాఖ నుండి హన్మంత్, గ్రంథాలయ సిబ్బంది చంద్రమౌళి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.






హైదరాబాద్ ఉస్మాని ఆసుపత్రి నూతన భవనం నిర్మాణం కొరకు పూజలు చేసే శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రంలో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి తదితరులు.

- విశ్వంభర, హైదరాబాద్



శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ కూకట్ పల్లి లోని మహిమాన్వితమైన శ్రీ వాసవి మాత దేవాలయాన్ని దర్శించుకొని ప్రత్యేకమైన పూజల అనంతరం ఆత్మీయ సత్కారం అందుకున్న వైశ్య గళం సంపాదకులు పబ్బ శ్రీనివాస్

- విశ్వంభర, హైదరాబాద్

# వేసవిలో త్రాగునీటికి ఇబ్బందులు రాకుండా పటిష్ట చర్యలు

**- కలెక్టర్ రాహుల్ శర్మ**



**విశ్వంభర, భూపాలపల్లి:** వేసవిలో త్రాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా రానున్న 10 రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం నిర్వహించాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశపు హాలులో గ్రామ పంచాయితీ, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాబోవు వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను అదేశించారు. ఫిబ్రవరి 1వ తేది నుండి 10 రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి గ్రామాలలో నిరుపయోగంగా ఉన్న బోర్లు, చేతి పంపులు, పైపులైను లీకేజీలు, కొత్త పైపులైన్లు ఏర్పాటు, గేట్ వాల్స్ లీకేజీలను గుర్తించి నివేదిక అందచేయాలని ఆదేశించారు. గ్రామాలలో మంచినీటికి సంబంధించి ఏదైనా సమస్య ఉండి మిషన్ భగీరథ ద్వారా నీరు సరఫరా జరగకపోతే ప్రత్యామ్నయంగా గ్రామాలలోని ప్రైవేటు బోరు వెల్స్, బావులను గుర్తించాలని సూచించారు. నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో నీటి సరఫరాకు ట్యాంకర్లను పంపడానికి కార్యాచరణ సిద్దం చేయాలని ఆదేశించారు. గత వేసవిలో సమస్య ఎదురైన గ్రామాల్లోనే కాక అన్ని చోట్ల నీటి పంపులు, పైపులను తనిఖీ చేస్తారని, ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించి వచ్చే ఐదు నెలల పాటు నీటి సరఫరా సాగేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో ఎదురవుతున్న అవాంతరాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేలా గ్రామ, మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేయనున్నామని, ఈ కమిటీలతో పాటు అధికారులు సైతం క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను గుర్తిస్తారని తెలిపారు. వీటిని పరిష్కరించడం ద్వారా నీటి సరఫరా ఇక్కట్లను అధిగమించేందుకు మిషన్ భగీరథ నీటి విజియోహంపై అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. గతంలో మాదిరి సమస్యలు రాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిష్కరానికి శనివారం నుంచి 10వ తేదీ వరకు పరిశీలన చేపట్టనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్,విజయలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి నారాయణరావు, మండల ప్రత్యేక అధికారులు, మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎంపిఓలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాల పై అవగాహన కలిగి ఉండాలి

*** ఎస్ఐ సృజన్ కుమార్**




**విశ్వంభర, దేవరుప్పుల:** జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం దేవరుప్పుల ఎస్ఐ సృజన్ కుమార్ పోలీస్ అధికారులతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతు ప్రమాదాలు నివారించడానికి రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నియమాలు పాటించి పోలీసులకు సహకరించాలన్నారు. జాగ్రత్తగా రోడ్డు దాటడం, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవడం చిన్నతనం నుంచే అలవాటు చేసుకోవాలన్నారు. ప్రయాణ సమయంలో విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఎస్ఐ వెంట పోలీస్ కానిస్టేబుల్ యాకేష్, మహమ్మద్ మసూద్, మహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## కళాకారునికి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చేయూత

**విశ్వంభర, మహేశ్వరం:** తెలంగాణ సాధన పోరాటంలో ప్రజానాట్య మండలి కళాకారులు ప్రముఖ భూమిక పోషించిన విషయంలో ఏ మాత్రం సందేహం లేదని, తెలంగాణ సాయుధ పోరాటంలో కళాకారులు ఎంతో కష్టపడ్డారని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరంలో ప్రజానాట్యమండలి కళాకారుడు పెట్టుకున్న ఆర్జీకి చేయుతను అందిస్తామని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సానుకూలంగా స్పందించారని కళాకారుని తండ్రి కుమార్ తెలిపారు. అందుకు ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలిపారు. ఒక కళాకారుగా సాయి చందన్ అభ్యర్థనకు సపోర్ట్ చేస్తూ ఇన్ని రోజులు ఎందుకు ఆలస్యం చేశారని అడిగారు. ఆర్జీ పై ప్రత్యేక దృష్టి పెట్టి వెంటనే జిల్లా కలెక్టర్ కు లెటర్ పంపిస్తారని ఎమ్మెల్యే హామీ ఇచ్చారాన్ని సాయి చందన్ తండ్రి కుమార్ తెలిపారు.

## డివైడర్ పనులకు శంకుస్థాపన



**విశ్వంభర, హైదరబాద్:** హైదరాబాద్ అంబర్ పేట్ నియోజకవర్గం నల్లకుంట డివిజన్ ప్రధాన దారిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న డివైడర్ల పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ అమృత. ఈ డివైడర్ పనులు నల్లకుంట ఫీవర్ హాస్పిటల్ చౌరస్తా నుంచి బర్కత్ పుర రత్నా నగర్ ప్రధాన రహదారి వైపు కొనసాగుతాయని కాలేరు అన్నాడు. నల్లకుంట డివిజన్ పాత రామాలయం వీధిలో ఎగువ ప్రాంతమైనటువంటి పద్మకాలని నుండి రామాలయం వీధి ప్రాంతంలోకి వరదలు వచ్చినప్పుడు మురుగునీరు ప్రవాహం ఎక్కువైనా రామాలయం వద్ద సక్రమంగా వెళ్ళేవిధంగా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు స్థానికులు. అనంతరం స్థానిక ప్రజలతో కలిసి పలు వీధులలో తిరిగి పరిసరాలను పర్యవేక్షించారు. ఎప్పటికప్పుడు వీధులను శుభ్రం చేయాలని మున్సిపల్ సిబ్బందికి సూచన చేశాడు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, జలమండలి సిబ్బంది భారాస, భాజపా కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యాసంస్థలు, పాఠశాలలో నాణ్యమైన భోజనం అందించాలి

**జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**



**విశ్వంభర, మహబూబాబాద్:** విద్యార్థులకు నాణ్యమైన బోజనాన్ని మెనూ ప్రకారం అందజేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు.శుక్రవారం మహబూబాబాద్ పట్టణ కేంద్రంలోని శనిగాపురం, కంకర బోర్డు జెడ్.పి.హెచ్.ఎస్ పాటశాలలు, బాలికల ఆశ్రమ పాటశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మద్యాహ్న భోజనంలో విద్యార్థులకు వడ్డిస్తున్న మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను భోజనము ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏజెన్సీ వారు సరఫరా చేసే సామాగ్రి నాణ్యత వివరాలు అడిగి తెలుసుకున్నారు. డైనింగ్ హాలును, కిచెన్ షెడ్ ను, తనిఖీ చేసారు. చుట్టూ పరిసరాలను పరిశుభ్రతను పాటిస్తూ విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలన్నారు. టాయిలెట్లను తనిఖీ చేసి శుభ్రంగా ఉంచాలని అన్నారు. పట్టణంలోని కంకరబోర్డు ప్రాంతంలోని జిల్లా పరిషత్ పాటశాలను తనిఖీ చేసి మద్యాహ్న భోజనం మెనో ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ప్రతి విద్యార్థి యొక్క సామర్థ్యాలను అంచనా వేస్తూ సబ్జెక్టుల వారీగా విద్యా బోధనలు అందించాలని సూచించారు. నూరు శాతం ఫలితాలను సాధించేందుకు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు నిత్యం కృషి చేయాలని తెలిపారు. ఈ తనిఖీలో సంబంధిత పాటశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## కేఎల్ఆర్ చేతుల మీదుగా వినతి పత్రం అందుకున్న సేవాదళ్ అధ్యక్షుడు



**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం నూతన సేవాదళ్ అధ్యక్షుడిగా గద్ద గూటి హరికృష్ణ ముదిరాజ్ ఎన్నికయ్యారు. ఎన్నికైన శుభ సందర్భంగా శుక్రవారం మహేశ్వరం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే కే ఎల్ ఆర్ ఆధ్వర్యంలో నియామక పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కే ఎల్ ఆర్ మాట్లాడుతూ ఇంకా గొప్ప గొప్ప పదవులు సంపాదించుకోవాలని ఉన్నత శిఖరాలకు ఎదగాలని మంచి నాయకుడిలా పేరు సంపాదించుకోవాలని, సేవాదళ్ అధ్యక్షుడు గద్ద గూటి హరికృష్ణ ముదిరాజును అభినందించారు. ఈ ఈ కార్యక్రమంలో నాయకులు దే ప భాస్కర్ రెడ్డి, కాకి ఈశ్వర్, బంగారు గళ్ళ లాజర్, చాకలి యాదయ్య, ఇజ్రాయిల్, ఆవుల యాదయ్య, మంత్రి బాలరాజ్, నేనావత్ రాజు నాయక్, ఒత్తుల వెంకటేష్, స్వర్ణ గంటి సుభాష్, ఇంద్ర కంటి వెంకటేష్, రాజు, వెయ్యాల నరసింహ, సేవ్య నాయక్, నరసింహ చారి, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అన్ని గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డ్ మెంబర్స్ పాల్గొన్నారు.


## చెట్ల కొమ్మల తొలగింపు



**విశ్వంభర, హైదరబాద్:** హైదరబాద్ బాగ్ అంబర్ పేట్ డివిజన్ నందనవనం కాలనీలో రోడ్డుపైన వీధి దీపాలు వెలుతురు పడకుండా దట్టంగా చెట్లు కొమ్మలు పెరగడంతో స్థానిక కార్పొరేటర్ పద్మా రెడ్డి కాలనీవాసుల ఫిర్యాదు మేరకు శుక్రవారం దగ్గరుండి చెట్ల కొమ్మలని కొట్టించారు. ఈ కార్యక్రమంలో నందనం కాలనీ వాసులు శ్రీనివాస్, ప్రదీప్, అర్టికల్చర్ ఇన్స్పెక్టర్ శ్రీధర్, టిఆర్ఎస్ నాయకులు వెంకట్ రెడ్డి మిరియాల శ్రీనివాస్, సంతోష్ రెడ్డి పాల్గొన్నారు.

## దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

*** విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్**



**విశ్వంభర, సంగారెడ్డి:** పటాన్ చేరు నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని వెలిమల గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కామారతి సమేత బీరప్ప స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్యఅతిథిగా జరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరు దైవచింతనను పెంపొందించుకోవాలని కోరారు. నియోజకవర్గం వ్యాప్తంగా పరమత సహనాన్ని పెంపొందిస్తూ ఆలయాలు చర్చిలు మసీదులు నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ రాములు గౌడ్, సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోమిరెడ్డి,. మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, గూడెం మధుసూదన్ రెడ్డి, దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి ఆదర్శ్ రెడ్డి, రవీందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు రవీందర్ రెడ్డి, కొమరయ్య, శ్యామ్ రావు, ఉమేష్, శ్రీనివాస్, రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## వర్ధంతికి హాజరైన ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షుడు



**విశ్వంభర, రామన్నపేట:** సీనియర్ న్యాయవాది వంగేటి విజయభాస్కర్ రెడ్డి తండ్రి వంగేటి రంగారెడ్డి (మాజీ పట్వారి భువనగిరి) ప్రథమ వర్ధంతికి ఐలు సభ్యులు హాజరై పుష్పా గుచ్ఛంలు ఉంచి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర ఉపాధ్యక్షులు, యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలానికి చెందిన మామిడి వెంకట్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, భువనగిరి బార్ అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్ నాగారం అంజయ్య, నల్గొండ ఉమ్మడి జిల్లా డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాస రెడ్డి, మాజీ జిల్లా రైతు సమన్వయ సంఘాల జిల్లా అధ్యక్షులు కొలుపుల అమరేందర్, యాదగిరి గుట్ట బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడ్ల స్వామి, బీజేపీ నాయకులు నర్ల నర్సింగరావు, చందా మహేందర్ గుప్తా, సీనియర్ న్యాయవాదులు పాశం శ్రీధర్, నిసంగి విద్యాసాగర్, బద్దం అపర్ణ, విశ్రాంత జిల్లా కోర్టు సూపరిండెంట్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## దశదిన కర్మకు మాజీ ప్రధాన కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు



**విశ్వంభర, సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా జాజిరెడ్డి గూడెం నకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సుతారపు కిష్టయ్య దశదిన కర్మకు ఉమ్మడి రాష్ట్ర మాజీ ప్రధాన కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు, సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డాక్టర్ యర్రమాధ కృష్ణారెడ్డి, ఎస్ హెచ్ వీస్ జిల్లా కార్యదర్శి రాంమూర్తి, ఇరుగు సైదులు, నరసింహ హాజరై నివాళులు అర్పించారు. సంతాప సభలో డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కిష్టయ్య ఉద్యోగ నిర్వహణలో పాటించిన క్రమశిక్షణ, వారి నిబద్ధత గురించి,వారి నుండి విద్యను పొందిన విద్యార్థులు నేడు ఉన్నత స్థాయిలో ఉన్నారని అని అన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం వినియోగదారుల హక్కు చట్టం, సమాచార హక్కు చట్టంలపై స్వచ్ఛందంగా పనిచేస్తూ ప్రజలను చైతన్యం చెయ్యడం, వారి హక్కుల సమర్ధ అమలు కోసం చేసిన కృషి వల్ల ఎన్నో సమస్యలు పరిష్కరించడం ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరిగిందని అన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకుని ప్రజలకోసం పని చెయ్యాలని వీరి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చెయ్యడం ద్వారా వీరి ఆత్మకు శాంతి కలుగుతుందని అన్నారు.

## సమసమాజ నిర్మాణం కోసం పాటుపడ్డ గద్దరన్న

**- గద్దర్ జయంతి ఉత్సవాల్లో కేఎల్ఆర్**



**విశ్వంభర, మహేశ్వరం:** ప్రజాస్వామ్యయుతంగా ఉద్యమం చేస్తే రాజ్యాధికారం సాధ్యమని భావించే గద్దరన్న కాంగ్రెస్ లో చేరారని కేఎల్ఆర్ అన్నారు. దివంగత నేత, గాయకుడు గద్దర్ జయంతి ఉత్సవం సందర్భంగా తుక్కుగూడ బస్టాండ్ లో ఏర్పాటు చేసిన తెలంగాణ సాంస్కృతిక బృంద కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.సమసమాజం అభివృద్ధి చెంది బీదత్వం లేని కుటుంబాలుగా మారాలని లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు.ఓటుహక్కుతో మార్పు సాధ్యమని ఆఖరి జీవితంలో కాంగ్రెస్ లో చేరారని కేఎల్ఆర్ తెలిపారు. గద్దరన్నకు ఆరోగ్యం బాగోలేక పోతే ఆపరేషన్ కోసం వెంటనే ఆస్పత్రిలో జాయిన్ కావాలని సూచించినట్లు కిచ్చెన్న గుర్తు చేసుకున్నారు.ఆయన స్ఫూర్తిని కొనసాగించాలని యువతకు పిలుపునిచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా గద్దర్ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించటం గొప్ప విషయమన్నారు కేఎల్ఆర్. గద్దరన్న మన మధ్య లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గద్దర్ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## చరణ్ ఆచూకి చెప్పిన వారికి రూ.10 వేలు

*** పారితోషికం ప్రకటించిన ఎస్ఐ గిరిధర్ రెడ్డి**



**విశ్వంభర, ఇనుగుర్తి :** విద్యార్థి చరణ్ ఆచూకీ చెప్పిన వారికి గూడూరు ఎస్ఐ గిరిధర్ రెడ్డి రూ.10 వేలు పారితోషికం ప్రకటించారు.ఈ మేరకు ఎస్ఐ వివరాలు తెలుపుతూ మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం పాత తండా కు చెందిన ఇస్లావత్ నర్సింహ కుమారుడు ఇస్లావత్ చరణ్(13) గూడూరు మండలం సీత నగరం సోషల్ వెల్ఫేర్ హాస్టల్ లో చదువుతున్నాడు. సంక్రాంతి సెలవుల అనంతరం ఈనెల 23న బాలుడిని మధ్యాహ్నం హాస్టల్ ముందు దింపి, లోపలికి వెళ్ళమని చెప్పి తండ్రి ఇస్లావత్ నర్సింహ కూతురును గూడూరుకు ఇంటికి తీసుకు వెళ్లిపోయాడు. ఈనెల 30న, అదే గ్రామానికి చెందిన ఇస్లావత్ వికాస్ అనే అబ్బాయి వార్డెన్ ఫోన్ నుంచి ఫోన్ చేసి చరణ్ ను ఎప్పుడు పంపిస్తావని అడిగాడు. 23వ, తేదీనే పంపించాను కదా అనడంతో ఇక్కడ లేదని చెప్పాడు. చరణ్ కోసం వెతకగా ఆచూకీ లభించలేదు. దీంతో గూడూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. గూడూరు పోలీస్ స్టేషన్ 8712656963 నెం.కు ఫోన్ చేసి ఇస్లావత్ చరణ్ ఆచూకీ తెలిపిన వారికి రూ.10,000 లు పారితోషికం అందిస్తామని ఎస్ఐ గిరిధర్ రెడ్డి తెలిపారు.



**హయత్ నగర్ బస్టాండ్ కి ఎదురుగా ఉన్న మంచినీటి సరఫరా చేసే గేటువాల్ నుండి ప్రతిరోజు వేలాది లీటర్ల నీళ్లు వృధాగా పోతున్నాయి. జలమండలి అధికారులు పట్టించుకోని నీరు వృధాగా పోకుండా చూడాలని కోరుతున్న ప్రయాణికులు.**
**- విశ్వంభర, ఎల్బీనగర్**


## అక్రమ కేసులను ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలి




**విశ్వంభర, మెట్‌పల్లి :** గత ప్రభుత్వంపై రైతులు తెలిపిన శాంతియుత నిరసనలకు అక్రమ కేసులు పెట్టి తిప్పలు పెడుతుంది పసుపు బోర్డ్, పసుపుకు మద్దతు ధర, మక్కలు కొనాలని, చక్కెర ఫ్యాక్టరీ తెరవాలని తెలిపిన నిరసనలో రైతులపై అప్పటి ప్రభుత్వం రైతు ఉద్యమలకు సంబంధించిన వారిపై కక్ష పూర్వకంగా అక్రమ కేసులు నమోదు చేసింది. అప్పుడు రైతు ఉద్యమంలో కలిసి పనిచేసిన ప్రస్తుత అధికార పార్టీకి చెందిన నాయకులు గత ప్రభుత్వం మాదిరిగానే రైతులను విస్మరించడం బాధాకరమని ఈ సందర్భంగా రైతు నాయకులు గోస వెలిబుచ్చారు. ఇప్పటికైనా ప్రజా పాలన రైతు శ్రేయస్సు కోరే ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వర్గం రైతులపై దృష్టిసారించి రైతు ఉద్యమ నాయకుల పై గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను వెంటనే ప్రభుత్వం ఎత్తివేయాలని ఈ సందర్భంగా రైతు నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో రైతు ఐక్యవేదిక నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, కోడిపెల్లి గోపాల్ రెడ్డి, మారు మురళీధర్ రెడ్డి, బందెల మల్లయ్య, వేముల కర్ణాకర్ రెడ్డి, మహేందర్ రెడ్డి , కొమిరెడ్డి లింగారెడ్డి,అన్నాడి జలపతి రెడ్డి, ఏలేటి శంకర్ రెడ్డి, మహిపాల్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అందరికీ వైద్యం సరియైన టైంలో అందించాలి

**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి, నూతన కోర్టు భవన నిర్మాణ పనులను కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పరిశీలించారు.దావఖానాకు పెద్ద గేట్లును కే ఎల్ ఆర్ ట్రస్ట్ ద్వారా ఇస్తున్న గేట్ల పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు భవన నిర్మాణ పనులను కేఎల్ఆర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పటాన్ చేరు మత సామరస్యానికి ప్రతీక

**- పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



**విశ్వంభర, సంగారెడ్డి:** పటాన్ చేరు మినీ ఇండియా గా పేరొందిన పటాన్ చేరు నియోజకవర్గం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని పటాన్ చేరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చేరు పట్టణానికి చెందిన జీఎంఆర్ యువసేన నాయకుడు సోహైల్ బృందం ఆధ్వర్యంలో అజ్మీర్ దర్గా వెళ్తున్న సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ ఆధ్వర్యంలో చదర్ కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం దర్గాకు చదర్ ను సమర్పించారు. అల్లా ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ రెడ్డి, వెంకట్ రెడ్డి, అఫ్జల్, పాండు, గూడెం విక్రం రెడ్డి, మాణిక్ రెడ్డి, మేరాజ్ ఖాన్, షకీల్, ఇమ్రాన్, మసూద్, సోహైల్, ఆదిల్, ఇర్ఫాన్, వసీం, వినయ్ పాల్గొన్నారు.

## ఫంక్షన్ హాల్ ప్రారంభించిన కేఎల్ఆర్

**విశ్వంభర, కందుకూర్:** మహేశ్వరం కందుకూర్ మండల కేంద్రంలోని కార్ శుభం కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ ను మహేశ్వరం నియోజకవర్గం ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. కే ఎల్ ఆర్ మాట్లాడుతూ మండల కేంద్రంలోని పెళ్లిళ్లకు ఫంక్షన్లకు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని కన్వెన్షన్ యజమానాన్ని అభినందించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలను అందుబాటులో సరైన రేటుకు ఇచ్చి అందరికీ అనుకూలంగా ఉండేలా చూడాలని యజమాన్యానికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫంక్షనల్ యజమాన్యం కురకట్ల అబినాష్ రెడ్డి, రామిడి రవీందర్ రెడ్డి, మారం కిరణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వివిధ మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై ఎంపీడీఓ తొలి రివ్యూ



**విశ్వంభర, ఇనుగుర్తి:** కొత్తగా ఏర్పడిన ఇనుగుర్తి మండల పరిషత్ లో వివిధ గ్రామాల సమస్యలపై ఎంపీడీఓ హరిప్రసాద్ శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో తొలి రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సెక్రటరీ లను గ్రామాల్లోని పారిశుద్ధ్యం నీటి వసతి సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. సమస్యలను వేగంగా గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీడీవో కార్యదర్శులకు సూచించారు.కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు లక్ష్మీకాంత్,బొమ్మెర వాణి,కదిర రాజేష్ గౌడ్,ముఖేష్ అశోక్, నరేష్ నాయక్,జాఫర్,అనిల్ కుమార్,పాల్గొన్నారు.

## కాళేశ్వరంలో జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు



**విశ్వంభర, కాళేశ్వరం:** జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి తమాషా రెడ్డి ఆధ్వర్యంలో కాళేశ్వరం గ్రామంలో రోడ్డు భద్రత వారోత్సవాలను నిర్వహించారు.ఇందులో భాగంగా కాళేశ్వరం లోని ఆటో యూనియన్ సిబ్బందికి, వాహనదారులకు రోడ్డు భద్రతకు సంబంధించిన నియమాలను ఎస్ ఐ వివరించారు.ఈ కార్యక్రమంలో కాళేశ్వరం ఆటో సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొని స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు.

## గడప గడపకు తెలుగుదేశం పార్టీ సభ్యత్వం

*** డాక్టర్ విజయ్ కుమార్**



**విశ్వంభర, చింతపల్లి:** గడప గడపకు తెలుగుదేశం పార్టీ సభ్యత్వం వెళ్ళాలని నియోజకవర్గ ఇంచార్జి వస్కుల కృష్ణయ్య ఆదేశాల మేరకు చింతపల్లి మండలం మాల్ పట్టణంలో మండల సీనియర్ నాయకులు డాక్టర్ విజయ్ కుమార్ మరియు దోటి సంతోష్ ఆధ్వర్యంలో మాల్ పట్టణంలో గడప గడపకు తిరుగుతూ చరవాణి ద్వారా ప్రజలచే సభ్యత్వం చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ రూ.100 లతో సభ్యత్వం తీసుకుంటే రెండేళ్ల పాటు 5 లక్షల ప్రమాద బీమా పొందవచ్చని వారు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో తెలుగుదేశం పార్టీ బలోపేతం దిశగా పయనిస్తుందని త్వరలో తెలంగాణలో పార్టీకి పూర్వ వైభవం రావడం ఖాయం అన్నారు. సభ్యత నమోదులో ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిలా పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నల్గొండ పార్లమెంట్ అధ్యక్షుడు వస్కుల రాజేష్, ఎదుల్ల సాలయ్య, రెడ్డగొని పెద్దయ, పోకల యాదమ్మ, ఈదుల జంగయ్య, జయమ్మ, సూరు జంగిర్, పార్వతమ్మ, విజయ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



**నాగోబా జాతరలో పాల్గొనే ముందు ఆదివాసి సాంప్రదాయ వస్త్రాధారణ-తో ఇంద్రవెల్లి అమరుల స్తూపాన్ని సందర్శించిన మంత్రి సీతక్క అమరవీ-రుల స్తూపానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించిన మంత్రి సీతక్క**

**- విశ్వంభర, భూపాలపల్లి**

# నులిపురుగుల నివారణకు మాత్రలు తప్పనిసరి




**విశ్వంభర, భూపాలపల్లి:** నులి పురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు తప్పని సరిగా వేయాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశపు హాలులో నేషనల్ డి వార్మింగ్ డే జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటి సన్నాహక సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు. ఫిబ్రవరి 10న తీసుకోని వారికి తిరిగి 17 వ తేదీన అల్బెండజోల్ మాత్రలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 69,652 మంది పిల్లలు గుర్తించడం జరిగిందని జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్యాధికారి నుండి మొదలు కొని ఆశా సిబ్బంది వరకు డి వార్మింగ్ డే లో భాగస్వాములు కావాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు అందించాలని సూచించారు. కడుపులో నులిపురుగుల ఉండటం వల్ల తిన్న ఆహారం వంటబట్టక పిల్లలు రక్త హీనతను గురవుతారని మాత్రలు వేసుకోవడం వల్ల నులిపురుగుల చనిపోతాయని, ఆహారం మంచిగా జీర్ణం అయి పిల్లల ఎదుగుదల బావుంటుందని తెలిపారు.అనంతరం మాతా శిశు వైద్య ఆరోగ్య సేవలు, ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలపై గర్భిణీలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి గర్భిణీ సగటున రోజుకు తీసుకోవేయాల్సిన ఆహార నియమాలు తెలుపాలని అన్నారు. పిండం వృద్ధికి తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలు గర్భిణీలకు తెలియచేయాలని స్పష్టం చేశారు. ఆశా కార్యకర్తలు, అంగన్వాడి టీచర్ల ద్వారా గర్భిణుల, శిశువుల ఆరోగ్యం అలాగే బాలింతలు ఆరోగ్యంపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి ఆరోగ్యవంతమైన శిశు జననానికి అవగాహన కల్పించాలని సూచించారు. ఎప్పటి కపుడు వైద్య పరీక్షలు నిర్వహిస్తూ మాతా, శిశు మరణాలు జరగకుండా చూడాలని, ప్రభుత్వ ఆసుపత్రులలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయ లక్ష్మి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీదేవి, ఉమాదేవి, చైల్డ్ హెల్త్ ప్రోగ్రాం అధికారి డా ప్రమోద్ వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్



**విశ్వంభర, కాళేశ్వరం:** భూపాలపల్లి జిల్లాలోని మహాదేవపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ పరిధిలో మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ ను ఫిజికల్ సైన్స్ ఫోరం అధ్యక్షులు మడక మధు ఆధ్వర్యంలో కాంప్లెక్స్ హెడ్మాస్టర్ బండం రాజిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్ట్ కు ముఖ్యఅతిథిగా మహదేవపూర్ పోలీస్ స్టేషన్ ఎస్ ఐ పవన్ కుమార్ హాజరై మాట్లాడుతూ నేటి యువత సెల్ ఫోన్ కు బానిసలై తమ విలువైన సమయాన్ని కోల్పోతున్నారని విద్యార్థులుగా మీరు పుస్తకాలకే పరిమితమై సమయాన్ని జాగ్రత్తగా వినియోగించుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. టాలెంట్ టెస్ట్ లో మొదటి బహుమతి కాళేశ్వరం పాఠశాలకు చెందిన కె అలేఖ్య, రెండవ బహుమతి మహాదేవపూర్ బాలికల పాఠశాలకు చెందిన మస్కా యక్షిత, మూడవ బహుమతి మహాదేవపూర్ బాలుర పాఠశాలకు చెందిన మొహమ్మద్ ఇక్ర గెలుపొందారు. వీరు ఫిబ్రవరి 4 న జిల్లా స్థాయిలో జరిగే టాలెంట్ టెస్టు కు హాజరవుతారని ఉపాధ్యాయులు మడక మధు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ హెడ్మాస్టర్ సరిత, ఉపాధ్యాయులు బొక్కల ప్రభాకర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, సారంగపాణి, పద్మ తో పాటుగా మండలంలోని ఫిజికల్ సైన్స్ టీచర్లు పాల్గొన్నారు.

## బాలయేసు పాఠశాలను తనిఖీ చేసిన విద్యాశాఖ అధికారులు



**విశ్వంభర, దేవరుప్పల:** జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలోని బాల యేసు ప్రవేట్ పాఠశాల పై వచ్చిన ఫిర్యాదు మేరకు జనగామ ఎంఈఓ వంగాల రాజేంద్, ఈసీజీ, బాల యేసు పాఠశాలలో ఎన్ని బస్సులు కేటాయించి ఉన్నాయి, వాటికి ఎంతమంది నైపుణ్యం కలిగి లైసెన్స్ డ్రైవర్లు అటెండెన్ ఉన్నారు. బస్సులో రోజువారీగా అటెండెంట్ రోజు బస్సులో వెళ్తున్నారా లేదా అలాగే ఉపాధ్యాయులు జాబితా ఉపాధ్యాయుల ట్రైనింగ్ ఉపాధ్యాయులు ఉన్నారా, విద్యార్థిని లకు బాలికలకు సరిపడా బాత్రూంలు ఉన్నాయా అనే విషయంపై అలాగే పాఠశాల అనుమతి పత్రాలు వసతులు బోధన విషయాలు పలు అంశాలపై తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.

## ఎస్సీ రిజర్వేషన్ స్థానాలు కేటాయించాలి

*** ఎంపీడీవో, ఆర్టీవో లకు పోరుమల్ల గ్రామస్తుల వినతి**




**విశ్వంభర, మేడిపల్లి:** జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం పోరుమల్ల గ్రామంలో స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు అయినా ఇంతవరకు ఒక్కసారి కూడా ఎస్సీ రిజర్వేషన్ స్థానాలను గ్రామానికి కేటాయించాలి స్థానిక ఎన్నికల్లో ఎస్సీ రిజర్వేషన్ స్థానాలు కేటాయించాలని మేడిపల్లి ఎంపీడీవో పద్మావతి, ఆర్డీవోలకు, వినతి పత్రం ఇవ్వడం జరిగింది. గ్రామంలో 35 శాతం ఎస్సీ సామాజిక వర్గాలు ఉన్నాయి కావున ఈ స్థానిక సర్పంచ్ మరియు ఎంపీటీసీ ఎన్నికల్లో ఎస్సీ స్థానాలను పోరుమల్ల గ్రామానికి కేటాయించాలని గ్రామానికి చెందిన సవనపల్లి రెడ్డి, చిట్యాల రాజేందర్, సవన పెల్లి అరవింద్, మంద హరికృష్ణ, సవన పెల్లి శేఖర్, పోడేటి నరసయ్య, సామిల్, తదితరులు పాల్గొన్నారు.

## సారాయి విక్రేతకు రూ .50,000ల జరిమానా




**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ మండలం అనంతారం కు చెందినటువంటి ఎడ్ల పగడయ్య గతంలో సారాయి రవాణా చేస్తూ పట్టుపడగా, అతనిపై కేసు నమోదు చేసి మహబూబాబాద్ తాహసీల్దార్ ముందు బైండోవర్ చేయడం జరిగింది. అతను మరల సారాయి తో పట్టు పడగా అతనిపై కేసు నమోదు చేసి తాహసీల్దార్ ముందు హాజరు పరచగా రూ.50,000లు జరిమానా విధించడం జరిగింది. అట్టి జరిమనను ఈరోజు అతను చెల్లించడం జరిగింది. ఎక్సైజ్ ఎస్ హెచ్ ఓ చిరంజీవి పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**విశ్వంభర, చింతపల్లి:** చింతపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ లో 2025 2026 విద్యా సంవత్సరానికి 6వ తరగతి లో 100 సీట్లు, 7వ తరగతి, 8వ తరగతి, 9వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లకు నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ అమ్తుల్ జమాల్ అస్రా ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 6వ తేదీ నుండి ఫిబ్రవరి 28వ తేది వరకు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు. దరఖాస్తులు చేసుకున్నవారికి ఏప్రిల్ 13 పరిక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు రుసుము ఎస్సీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు రూ.125, ఇతర విద్యార్థులకు రూ.200 చెల్లించాలన్నారు. పరిక్ష హాల్ టికెట్లను ఆన్ లైన్ లో ఏప్రిల్ 3 నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థులకు ఏప్రిల్ 13న ఉదయం 10 నుండి 12 గంటల వరకు అడ్మిషన్ టెస్ట్ నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ఈ యొక్క అవకాశన్ని సద్వినియోగం చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మరియు అధ్యాపక బృందం తెలిపారు.

## విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్న టీచర్లపై చర్య తీసుకోవాలి



**విశ్వంభర, మహబూబాబాద్:** గార్ల మండల పరిధిలో ఆయా పాఠశాలల విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్న కొందరు టీచర్లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మండల వ్యాప్త సర్వత్రంగా వినవస్తున్నాయి. గతంలో కొన్ని పాఠశాలల ఉపాధ్యాయులు కొంతమంది నిర్ణీత సమయానికంటే ముందే వెళ్తున్నారు అని, ఇప్పటికైనా ప్రభుత్వ పాఠశాలలపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ పెంచాలని ప్రజలు కోరుతున్నారు. రాష్ట్ర విద్యాశాఖ నియమ నిబంధనల మేరకు పనిచేయని వారిపై జిల్లా విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

## ఘనంగా వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం

**విశ్వంభర, జూలూరుపాడు:** ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీ వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని శుక్రవారం జూలూరుపాడు లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వాసవి మాతాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. 50 రకాల నైవేద్యాలు అమ్మ వారికి సమర్పించి ప్రత్యేక హారతులు, పాటలతో మహిళలు సందడి చేశారు. ఆర్యవైశ్యులతో పాటు ప్రజలందరినీ చల్లంగా చూడాలని వ్యాపారంగ అభివృద్ధితోపాటు పాడి పంటలు పిల్లాపాపలతో తులతూగాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో మహిళా సంఘ రాష్ట్ర నాయకురాలు తొండెపు నాగమణి, జిల్లా నాయకురాళ్ళు తొండెపు సరిత, పెండ్యాల నదియా, పెండ్యాల భానుమతి, సీమ కుర్తి చిట్టెమ్మ, నంగునూరి మీనా, పెండ్యాల సీతాకుమారి, కంచర్ల రమాదేవి, పెండ్యాల ఝాన్సీ, వందనపు నాగమణి, కొదుమూరి అంజలి, చిట్లూరి పద్మ, పెండ్యాల రామలక్ష్మి ,వెచ్చ తాయారు, సీమ కుర్తి నాగలక్ష్మి, పెండ్యాల శిరీష, పుల్లకందం సంధ్య, పెండ్యాల పాల్గొన్నారు.



## నూతన ఎంపీటీసీ స్థానాన్ని ఏర్పాటు చేయాలి

*** ఎంపీడీవో కు వినతి పత్రం**



**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని గుడిమల్కాపురం, రాచకొండ, కడియల బావి తండ, తుంబాయి తండా, వెంకం బావి తండ, గ్రామపంచాయతీలను కలిపి నూతన ఎంపీటీసీ స్థానాన్ని ఏర్పాటు చేయాలని ఎంపీడీవో వినోద్ కుమార్ కి వినతి పత్రం అందజేశారు. పైన పేర్కొన్న గ్రామాల్లో ఒక గ్రామాన్ని ఎంపీటీసీ స్థానంగా ఏర్పాటు చేయాలని పరిపాలనకు సౌలభ్యంగా ఉంటుందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ మాధవ రెడ్డి, జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ మెంబర్ బాలు నాయక్, మండల నాయకుడు గోవర్ధన్ నాయక్, ఎస్టీషియల్ అధ్యక్షుడు కరంటోత్ రమేష్ నాయక్, మండల్ నాయకుడు రవీందర్ నాయక్, ప్రజ్ఞ నాయక్,లచ్చనాయక్, నాగరాజు, కేశీను నాయక్, మోతియా నాయక్ ,రాజు నాయక్, గన్ననాయక్ ,సిద్ధు నాయక్ పాల్గొన్నారు.

## కుళ్ళిన స్థితిలో మృతదేహం గుర్తింపు



**విశ్వంభర, కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మాదాపూర్ మండలం కాళేశ్వరం గ్రామంలోని మంగళికుంట చెరువులో కుళ్ళిన స్థితిలో మృతదేహం లభ్యమైంది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కాళేశ్వరం ఎస్ఐ తమాషా రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఆ మృతదేహం గురించి దర్యాప్తు చేయగా చెన్నూరు గ్రామానికి చెందిన మద్ది సమ్మయ్య గా గుర్తించారు. అతను గత కొన్ని రోజుల నుండి కాళేశ్వరం గుడి వద్ద ఉంటూ చెరువులోని పూలు తీసుకొని గుడి వద్ద అమ్ముకుంటూ ఉండేవాడు. అదే క్రమంలో కాళేశ్వరం లోని మంగలి కుంట నందు పూలు కోసుకోవడం కోసం వెళ్లి ప్రమాదవశాత్తు నీళ్లలో మునిగి చనిపోయినట్లు తెలిసింది. మృతుడి భార్య మద్ది రాజమ్మ కు కాళేశ్వరం గ్రామానికి చెందిన చింతకింది వెంకటి చనిపోయిన తన భర్త వివరాలను తెలుపగా ఆమె తన భర్త బట్టలను పరిశీలించి తన భర్త గా గుర్తించి తదుపరి చర్య నిమిత్తం కాళేశ్వరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది.


## నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**విశ్వంభర, వరంగల్:** వరంగల్ జిల్లా నర్సంపేట నల్లబెల్లి మండలం మేడపల్లి గ్రామం దేవాదుల నుంచి పైపుల ద్వారా వస్తున్న నీటిని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి విడుదల చేశారు. మేడపల్లి, మామిండ్ల చెరువు ల అయకట్టు రైతులకు యాసంగి పంటకి నీళ్లు ఇవ్వాలని రైతులు నర్సంపేట శాసనసభ్యులు మాధవరెడ్డి కోరగా స్పందించిన ఎమ్మెల్యే అధికారులను వెంటనే రైతులకు నీళ్లు ఇవ్వాలని ఆదేశించారు. అధికారులు శుక్రవారం ఆయకట్టు రైతులకు యాసంగి పంట నిమిత్తం నీరు విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నర్సంపేట నియోజకవర్గ నాయకులు మరియు నల్లబెల్లి మండల నాయకులు, గ్రామ నాయకులు, మెగా ఇంజనీర్లు, ఆదినారాయణ శివకుమార్, ఆయకట్టు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## కార్ శుభం కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ ప్రారంభించిన ఎమ్మెల్యే

**విశ్వంభర, కందుకూర్:** మహేశ్వరం కందుకూర్ మండల కేంద్రంలోని కార్ శుభం కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ ను మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రంలోని పెళ్లిళ్లకు ఫంక్షన్లకు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని కన్వెన్షన్ యజమానాన్ని కొనియాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలను అందుబాటులో సరైన రేటుకు ఇచ్చి అందరికీ అనుకూలంగా ఉండేలా చూడాలని యజమాన్యానికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫంక్షనల్ యజమాన్యం కురకట్ల అబినాష్ రెడ్డి, రామిడి రవీందర్ రెడ్డి, మారం కిరణ్ కుమార్, బీ ఆర్ ఎస్ సీనియర్ నాయకులు, వివిధ మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# తెలంగాణ పట్టణాలకు పదేళ్లలో అనేక జాతీయ అవార్డులు దక్కాయి: కేటీఆర్

**విశ్వంభర, హైదరబాద్:**




సమైక్య రాష్ట్రంలో మున్సిపాలిటీలు మురికి కూపాలుగా ఉండేవని.. బల్దియాలు అంటే ఖాయా.. పియా.. చల్దియా.. అనే సామెత ఉండేది బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. తెలంగాణ భవన్‌లో జరిగిన మున్సిపల్ చైర్‌పర్సన్ సన్మాన కార్యక్రమంలో కేటీఆర్, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక కేసీఆర్ పట్టణాల అభివృద్ధి కోసం ప్రత్యేక విజన్‌తో పని చేయాలని దిశా నిర్దేశం చేశారన్నారు. అందుకే ఆర్థిక ఇంజిన్లుగా ఉన్న పట్టణాలను, వాటిని సమగ్రంగా డెవలప్ చేయాలని అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. పట్టణీకరణ ఆపాలని కొన్ని దేశాలు చేసిన ప్రయత్నాలు విఫలం అయ్యాయన్నారు. పట్టణాల విస్తరణ ఆపడం వీలు కాదు.. కానీ ప్రభుత్వాలకు వాటిని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి మాత్రం అవకాశం ఉంటుందన్నారు. అందుకే ఆ దిశగా పదేళ్లు పనిచేశామన్నారు. చేసిన పనిని అభివృద్ధి నివేదికల రూపంలో ప్రజల ముందుంచామన్నారు.

**డైలాగులు కొడితే కాదు..**

పదేళ్ల పాటు జరిగిన పట్టణాలు అభివృద్ధి కేవలం డైలాగులు కొడితే కాలేదన్నారు. పక్కా ప్రణాళికతో పాటు అవసరమైన సంస్కరణలు, నిరంతర పర్యవేక్షణ అవసరమైన నిధులు అందించడం తదితర నిరంతర ఫోకస్‌తోనే తెలంగాణలోని పట్టణాలు ఈ రోజు మోడల్ పట్టణాలుగా తయారయ్యాయన్నారు. తెలంగాణ పట్టణాలకు పదేళ్లలో అనేక జాతీయ అవార్డులు దక్కాయన్నారు. గత పది సంవత్సరాలుగా మున్సిపల్ చైర్‌పర్సన్లు కౌన్సిలర్లుగా పట్టణాల అభివృద్ధి కోసం పని చేశారన్నారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి పూర్తి చేశారని చెప్పారు. పదవీ కాలం ముగిసిన చైర్మన్లు, కౌన్సిలర్లు ప్రజల్లోనే ఉండాలని.. మళ్లీ ఎన్నికలు వస్తే ప్రజలు గెలిపించుకుంటారన్నారు. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత పెద్ద ఎత్తున పరిపాలన వికేంద్రీకరణ కార్యక్రమాలు చేపట్టామన్నారు.

**కొత్త జిల్లాలతో ప్రజల దగ్గరకు పాలన..**

కొత్త జిల్లాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు పరిపాలన మరింత దగ్గరైందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధితో పట్టణాలతో పాటు ప్రజల ఆస్తుల విలువ కూడా పెరిగిందన్న కేటీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పట్టణాలు అభివృద్ధి కుంటుపడడంతో పాటు ప్రజల ఆస్తుల విలువ కూడా భారీగా పడిపోయిందన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన కొత్తగా కట్టాల్సింది పోయి హైడ్రా, మూసి ప్రాజెక్టుల పేరుతో కూలగొడుతున్నారన్నారు. ప్రభుత్వాన్ని నడిపే వారి ఆలోచనలు సానుకూలంగా ఉంటే రాష్ట్రం, పట్టణాలు అభివృద్ధి చెందుతాయన్నారు. గతంలో నల్లగొండ పట్టణాన్ని సమూలంగా అభివృద్ధి చేసిన మనల్ని కాంగ్రెస్ మంత్రులు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని.. కానీ అదే నల్లగొండ పట్టణంలో నాలుగు నెలలుగా సిబ్బందికి జీతాలు లేకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

**మంత్రి సీనియర్ అయినా అభివృద్ధి పట్టించుకోలే..**

నల్లగొండ పర్యటన తర్వాత నన్ను బచ్చగాడు అంటున్న మంత్రి.. సీనియర్ అయ్యుండి పట్టణ అభివృద్ధిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. మోసపూరిత 420 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు పాలన చేతకావడం లేదన్నారు. టకీ టకీ మని పైసలు పడుతాయన్నారని.. కానీ, టకీ టకీమని ఢిల్లీలో పైసలు పడుతున్నాయన్నారు. ఆరున్నర లక్షల కొత్త రేషన్ కార్డులను గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చినప్పటికీ.. కాంగ్రెస్ పార్టీ రేషన్ కార్డులు ఇవ్వనేలేదంటూ అబద్ధాలు చెబుతుందన్నారు. ఈ విషయం అప్పటి రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు కాంగ్రెస్ నాయకులను అడిగితే తెలుస్తుందన్నారు. డూప్లికేట్ గాంధీలకు తెలంగాణ ఇచ్చిన హామీలను అమలు చేసేలా బుద్ధి ఇవ్వాలని మహాత్ముడి విగ్రహాలకు వినతి పత్రాలు ఇచ్చామన్నారు.



## సోనియా గాంధీ వ్యాఖ్యలను వక్రీకరించారు: మంత్రి సీతక్క

**విశ్వంభర, హైదరాబాద్:** కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియా గాంధీ వ్యాఖ్యలను బీజేపీ వక్రీకరిస్తోందని, అసలు సమస్యలను పక్కదారి పట్టించేలా లేనిపోని వివాదాలు సృష్టిండం బీజేపీ కి వెన్నతో పెట్టిన విద్య అని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మండిపడ్డారు. రాష్ట్రపతి ప్రసంగంలో అన్ని అవాస్తవాలనే కేంద్ర ప్రభుత్వం చేర్చిందని శుక్రవారం ఒక ప్రకటనలో మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా సామాన్యులను పూర్తిగా రాష్ట్రపతి ప్రసంగం విస్మరించిందని.. నిరుద్యోగ సమస్య, ఆర్థిక రంగ ఒడిదుడుకులను రాష్ట్రపతి ప్రసంగంలో కనిపించలేదన్న విషయాన్ని కప్పిపుచ్చేందుకే సోనియా గాంధి వ్యాఖ్యలపై వివాదం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఆదివాసీ రాష్ట్రపతిని అవమానలపాలు చేసేలా నరేంద్రమోడి నేతృత్వంలోని బీజేపీ వ్యవహరించిందని గుర్తు చేసారు.నూతన పార్లమెంటు భవన ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆహ్వానించకుండా బీజేపీ తన కురుచ బుద్ధిని ప్రదర్శించిందని ఫైర్ అయ్యారు. ఆయోద్య రామమందిర ప్రారంభోత్సవానికి రాష్ట్రపతిని ఎందుకు ఆహ్వానించలేదని ప్రశ్నించారు. ఆదివాసీలకు అడుగడునా అన్యాయం చేసి...ఇప్పుడు రాష్ట్రపతి అంశాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. అటవీ హక్కు చట్టాన్ని నీరుగార్చి, ఏజెన్సీ ప్రాంతాల్లో ఇష్టారీతిన మైనింగ్ కు అనుమతులిస్తూ, పెసా చట్టాన్ని తుంగలో తొక్కిన బీజేపీ..ఆదివాసీల గౌరవం గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించడమేనన్నారు. ఆదివాసీల ప్రయోజనాలు కాదని..ఆదానీకి వంత పాడే బీజేపీ..రాష్ట్రపతి పదవిని అడ్డుపెట్టుకుని దిగజారుడు రాజకీయాలు చేస్తుందని మంత్రి సీతక్క మండిపడ్డారు.

## తెలంగాణలో ఆర్థిక ఎమర్జెన్సీ తప్పనిసరి

**ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్**



**విశ్వంభర, హైదరాబాద్:** ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, తక్షణమే రాష్ట్రంలో ఆర్థిక ఎమర్జెన్సీ ప్రకటించాల్సిన అవసరముందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ అన్నారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ధనిక రాష్ట్రంగా ఏర్పడినప్పటికీ, గత 10 ఏళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం పాలనలో విఫలమై రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న తప్పుడు ఆర్థిక నిర్ణయాలు, దుబారా ఖర్చులు, రాజకీయ నియామకాలు, కోట్లాది రూపాయల ప్రజాధనంతో అడ్వర్టైజ్‌మెంట్ల వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింత దిగజారిందన్నారు. తక్షణమే ఆర్థిక ఎమర్జెన్సీ ప్రకటించాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేస్తున్నామని.. ఇదే విషయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి దృష్టికి తీసుకెళ్తామని ఎన్వీఎస్ఎస్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఖజానా గుల్ల కావడంతో ఉద్యోగులకు జీతభత్యాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి మించి రాష్ట్రం చేరుకోవడమంటే ప్రమాదఘంటికలను మోగించడ మేనన్నారు. వన్ ట్రిలియన్ వ్యవస్థ దిశగా ముందుకెళ్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అనడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. నెలవారీ అప్పుల ప్రణాళికతో ముందుకెళ్తూ, త్రైమాసికం, అర్ధ వార్షిక, వార్షిక ఆదాయ వనరులను సమకూర్చుకునే విషయాన్ని కూడా పూర్తిగా గాలికొదిలేశారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రానికి కొత్త పెట్టుబడుల విషయంలో వివిధ విదేశీ కంపెనీలు, సంస్థలతో ఎంఓయూలు కుదుర్చుకున్నట్లు చెబుతున్నప్పటికీ, రాష్ట్రంలో గత ఏడాది కాలంలో ఎక్కడ కొత్త కంపెనీలు ప్రారంభించిన దాఖలాల్లేవన్నారు. కొత్త పరిశ్రమలు ఏర్పడకపోవడం ఆర్థిక విధానాల వైఫల్యాన్ని స్పష్టంగా ఎత్తి చూపుతుందన్నారు. రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## పంట ఉత్పత్తులకు మద్దతు ధర అందించాలి: మంత్రి తుమ్మల

**విశ్వంభర, హైదరాబాద్:** రైతులకు మేలు రకం పంట ఉత్పత్తులకు మద్దతు ధరఅందించేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఆదేశించారు. సామాజిక మాధ్యమాల్లో మార్కెటింగ్ అంశాలపై వస్తున్న కథనాలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరా తీశారు. రాష్ట్రంలో వివిధ మార్కెట్లతో పలు పంటలకు సంబంధించి మద్ధతు ధర సమస్యలను మార్కెటింగ్ శాఖ అధికారులు మంత్రి తుమ్మలకు వివరించారు.ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ రైతులు మార్కెట్లకు తీసుకువచ్చిన తమ పంటకు గరిష్ఠ ధర పొందేందుకు అన్ని అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు ఎటువంటి నష్టం జరగకుండా క్రయ, విక్రయాలు జరిగేటట్లు చూడాలన్నారు. ప్రతి అధికారి బాధ్యత తీసుకోవాలని మార్కెటింగ్ డైరెక్టర్, ప్రాంతీయ, జిల్లా అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చారు. మార్కెటింగ్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ మార్కెట్లకు పంపించాలని తుమ్మల ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలకు తగినట్లు ఉన్న పంట ఉత్పత్తులకు మద్దతు ధర అందించాల్సిందేనని తుమ్మల స్పష్టం చేశారు.అంతకుముందు మంత్రి తుమ్మల మద్ధతు ధరపై అధికారులతో సమీక్ష చేశారు. అన్ని పంటలను మద్ధతు మేరకు కొనుగోలు చేయాలని, రాష్ట్రంలో ఏర్పాటు చేసిన 21కందుల కొనుగోలు కేంద్రాలను, 14 పెసర కేంద్రాలు, 42సోయాబిన్ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంట నిల్వలకు మార్క్‌ఫెడ్ గోదాంలను వాడుకోవాలని సూచించారు. అర్హులైన రైతులందరికి రైతు భరోసా అందుతుందని స్పష్టం చేశారు. అయిల్ ఫామ్ సాగులో రాష్ట్రం నంబర్ వన్ కావాలని ఆకాంక్షించారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకాలతో రైతులు సాగు ఆధునీకరణ మెళకువలను పాటించాలన్నారు.

# 7 లోపు వర్గీకరణ చేయకుంటే హైదరాబాద్‌లో సునామీ సృష్టిస్తాం

## సీఎం రేవంత్ రెడ్డికి మందకృష్ణ మాదిగ హెచ్చరిక..!

**విశ్వంభర, సూర్యాపేట:**




కాంగ్రెస్ ప్రభుత్వంపై తమ యుద్ధం మొదలవుతుందని, ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణకు రేవంత్ రెడ్డి సర్కారు కట్టుబడి ఉంటే ఫిబ్రవరి 7వ తేదీకి ముందే నిర్ణయం తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. వచ్చే నెల ఏడో తేదీ లోపు ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ చేపట్టకుంటే ఫిబ్రవరి ఏడో తేదీన మాదిగల సునామీ హైద్రాబాద్‌ను తాకుతుందన్నారు. ఆ సునామీలో ఎవరైనా కొట్టుకుపోక తప్పదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం రాత్రి సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో 'హైద్రాబాద్‌లో నిర్వహించనున్న లక్ష డప్పులు వేల గొంతుల సన్నాహక సమావేశం'లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

అంతకు ముందు సూర్యాపేట పట్టణంలోని కొత్తబస్టాండ్ వద్ద బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్దకు చేరుకున్న ఆయనకు మాజీ కౌన్సిలర్ వల్దాస్ సౌమ్యాజాని మంగళ హారతితో స్వాగతం పలికారు. అక్కడ నుంచి డప్పు కొడుతూ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన నాడే సీఎం రేవంత్ రెడ్డి శాసనసభలో మాట్లాడుతూ తెలంగాణాలో మొదటగా ఎస్సీ వర్గీకరణ చేస్తామని ఇచ్చిన మాటను ఐదు నెలలు అయినా నిలబెట్టుకోలేదన్నారు. అందువల్లే లక్ష డప్పులు, వేల గొంతుల కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగిందన్నారు.సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటే వచ్చే నెల ఏడో తేదీన తమ లక్ష డప్పులు- వేల గొంతుల కార్యక్రమం నిర్వహించే అవసరమే ఉండేది కాదని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. నిండు శాసనసభలో చెప్పిన మాటను నిలబెట్టుకోలేక పోయాడన్నారు. కొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే అమలు చేశారని ఇక్కడ అమలు చేయలేకపోయారని అన్నారు. నోటిఫికేషన్‌కు ముందే వర్గీకరణ చేస్తామని చెప్పి.. మాల రాజకీయ నాయకులు తెచ్చిన వత్తిడి మేరకు ఎస్సీ వర్గీకరణ చేయకపోవడంతో ఎంతో మంది మాదిగ నిరుద్యోగులు నష్టపోయారన్నారు. ఎస్సీల వర్గీకరణకు అడ్డుతగిలే మాలలకు భవిష్యత్‌లో పుట్టగతులు లేకుండా చేస్తామని, వారి మాటలు విని వర్గీకరణ చేయకుంటే రేవంత్ సర్కార్ కూడా కుప్పకూలిపోతుందని హెచ్చరించారు. ఏది కావాలో తేల్చుకోవాలని స్పష్టం చేశారు.మాలలు స్వార్ధపరులని అన్ని రంగాల్లో ఎదిగారని వాళ్ళు ఇంకా తమకు అడ్డం తగిలితే మౌనంగా చూస్తూ ఊరుకోమని మందకృష్ణ మాదిగ తెలిపారు. వారి మాటలకు విలువిచ్చి వర్గీకరణ చేయకుంటే కాంగ్రెస్ ప్రభుత్వంపై తమ యుద్ధం మొదలవుతుందన్నారు. శాంతియుతంగా ప్రదర్శనకు వెళుతున్నామని, వర్గీకరణ అమలు చేస్తే తాము స్వాగతిస్తామని లేని పక్షంలో తమ డప్పులే తమ ఆగ్రహాన్ని తెలియజేస్తాయన్నారు. ప్రతి ఇంటి నుంచి ఒకరు డప్పు వేసుకుని సునామీలా హైద్రాబాద్‌కు తరలిరావాలని పిలుపునిచ్చారు. వేలాది మంది కళాకారుల గొంతులతో జరిగే సాంస్కృతిక కార్యక్రమాన్ని మాదిగ బిడ్డలు, అన్ని వర్గాల ప్రజలు, ప్రజాస్వామికవాదులు అందరూ విజయవంతం చేయాలని కోరారు.

# కాగ్ రిపోర్టు ప్రభుత్వానికి చెంపపెట్టు

**విశ్వంభర, హైదరాబాద్:**



కాళేశ్వరం సహా తెలంగాణ నీటి పారుదల వ్యవస్థపై కాంగ్రెస్ చేస్తున్న గోబెల్స్ ప్రచారం శుద్ధ తప్పు అని కాగ్ నివేదిక తేల్చి చెప్పిందని.. మిషన్ భగీరథపై కాంగ్రెస్ చేస్తున్న అసత్య ప్రచారాన్ని పటాపంచలు చేసిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. కేంద్రం విడుదల చేసిన ఎకనమిక్ సర్వే 2024-25 నివేదిక బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై అడ్డగోలు వ్యాఖ్యలు చేస్తున్న కాంగ్రెస్‌కు చెంపపెట్టు లాంటి సమాధానమని పేర్కొన్నారు. కేంద్రం వెల్లడించిన ఆర్థిక సర్వే రిపోర్టుపై హరీశ్‌రావు స్పందించారు.100 శాతం రూరల్ డ్రింకింగ్ వాటర్ సప్లై కలిగిన రాష్ట్రంగా తెలంగాణ ఘనత సాధించిందని తెలిపారు. 88 శాతం సొంత పన్నుల రాబడుల్లో అగ్రస్థానంలో రాష్ట్రం నిలిచిందని పేర్కొన్నారు.

ఐటీలో తెలంగాణ మేటి అని మరోసారి తేల్చిచెప్పిన ఎకనిమిక్ సర్వే.. కర్ణాటకతోపాటు తెలంగాణ అద్భుత ప్రగతి సాధించిందని వెల్లడించినట్లు పేర్కొన్నారు. అత్యధిక ఇరిగేటెడ్ ఏరియాతో దేశంలోనే తెలంగాణ నాలుగో స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడంలో వి హబ్ దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిందని.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఆర్థిక, ఐటీ, నీటి పారుదల, మహిళా సాధికారతలో సాధించిన ఘనతను ఆర్థిక సర్వే లెక్కలతో సహా వివరించిందని స్పష్టం చేశారు. ఎకనమిక్ సర్వే రిపోర్టు కాంగ్రెస్ ప్రభుత్వానికి బోగస్ ప్రచారమని అని పేర్కొనట్లు తెలిపారు.


తులు, చేనేత కార్మికులు.. ఇప్పుడు బిల్డర్లుబీఆర్ఎస్ పాలనలో నిర్మాణ రంగానికి స్వర్గధామంగా ఉన్న హైదరాబాద్‌లో ఫ్లాట్లు అమ్ముడు పోలేదని బిల్డర్ ఉరేసుకునే పరిస్థితి రావడం శోచనీయమని హరీశ్‌రావు పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లాలో బిల్డర్ సూసైడ్ చేసుకోవడంపై హరీశ్‌రావు 'ఎక్స్' వేదికగా స్పందించారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, చేనేత కార్మికులు, ఆటో డ్రైవర్లు.. ఇప్పుడు బిల్డర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ నిర్లక్ష్య పాలన, అనాలోచిత అసమర్థ విధానాలే ఈ ఆత్మహత్యలకు కారణమని తెలిపారు. అనుమతి ఉన్న ఇళ్లను సైతం హైడ్రా కూల్చివేయడం.. మూసి, ఫార్మా సిటీ, మెట్రో కారిడార్ల విషయంలో ద్వంద్వ ప్రకటనలు చేయడం.. ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ చేయకపోవడం.. భవన నిర్మాణ అనుమతులకు బలవంతపు వసూళ్లు చేయడం వంటివి కారణంగా నిలిచాయని తెలిపారు. కొత్త పెట్టుబడులు రాకపోవడంతో రియల్ ఎస్టేట్ రంగంపై పెను ప్రభావాన్ని చూపాయని పేర్కొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు.. చంచల్‌గూడ జైలు నుంచి విడుదలైన భుజంగరావు, రాధాకిషన్‌రావు




**విశ్వంభర, హైదరాబాద్:** గత ప్రభుత్వ హయాంలో ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన కేసులో కీలక నిందితులైన సస్పెండెడ్ మాజీ అదనపు ఎస్పీ నాయిని భుజంగరావు, మాజీ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావులు శుక్రవారం చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యారు. వీరిద్దరికీ గురువారం హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.రూ.లక్ష వ్యక్తిగత బాండుతోపాటు అంతే మొత్తానికి మరో రెండు పూచీకత్తులను సమర్పించాలని ఆదేశించింది. పాస్‌పోర్టులు కింది కోర్టులో స్వాధీనం చేయాలంది. 8 వారాలపాటు ప్రతి సోమవారం దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని షరతు విధించింది. చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్‌కు వ్యక్తిగత బాండుతో పాటు పూచీకత్తులు సమర్పించడంతో ఇవాళ సాయంత్రం ఇద్దరినీ జైలు నుంచి విడుదల చేశారు. భుజంగరావు, రాధాకిషన్‌రావు ఇద్దరూ దాదాపు 10 నెలలుగా చంచల్‌గూడ జైల్లోనే ఉన్న విషయం తెలిసిందే.

## ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ వద్ద అగ్ని ప్రమాదం



**విశ్వంభర, హైదరాబాద్:** నిత్యం రద్దీగా ఉండే ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ పక్కన శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. మెట్రో స్టేషన్ కింద విశ్వేశ్వరయ్య భవన్ వైపు పార్క్‌లో భారీగా మంటలు ఎగసిపడటంతో ప్రయాణికులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన మెట్రో సిబ్బంది స్టేషన్‌లో లిఫ్ట్‌ను నిలిపివేశారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలు అదుపు చేశారు.

## ఒంటరిననే భావన వచ్చినప్పుడల్లా గద్దర్ దగ్గరికి వెళ్లే వాడిని: రేవంత్‌రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** ''రాజకీయంగా ఒంటరిననే భావన వచ్చినప్పుడల్లా గద్దర్ దగ్గరకు వెళ్లి సలహాలు తీసుకునే వాడిని. నీ బాధ్యత నెరవేర్చు ప్రజలు తప్పకుండా నిన్ను గుర్తించి అవకాశం ఇస్తారని చెప్పేవారు. వారి మాట నిజమైంది'' అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన గద్దర్ జయంతి కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ... గద్దర్ ఆఖరి శ్వాస వరకు తాను నమ్మిన సిద్ధాంతాల కోసం జీవించారని కొనియాడారు.''గద్దర్, గోరటి వెంకన్న, చుక్కా రామయ్య, అందెశ్రీ, జయధీర్ తిరుమలరావుకు పద్మ అవార్డులు ఇవ్వాలని కేంద్రానికి సిఫార్సు చేశాం. పక్క రాష్ట్రానికి ఐదు అవార్డులు ఇచ్చారు.. వాళ్లకంటే మేం ప్రతిపాదించిన వాళ్లు తక్కువా? కేంద్రం చేసిన తప్పును సరిదిద్దుకుంటారని లేఖ రాశా. తప్పు సరిదిద్దుకోకుండా.. గద్దర్‌కు అవార్డు ఇవ్వం అని చెప్పారు. అవార్డులు ఇచ్చేది మేమే అని భాజపా నేతలు అంటున్నారు. వారి పార్టీ కార్యాలయం తెలంగాణలో ఉంది. ఇంకోసారి గద్దర్ గురించి తప్పుగా మాట్లాడితే భాజపా ఆఫీసు ఉన్న ప్రాంతానికి, కాలనీకి గద్దరన్న పేరు పెడతాం. ప్రతి దానికీ మా దగ్గర మందు ఉంది. గతంలో గద్దర్‌ను అవమానించిన వారికి తగిన శాస్తి జరిగింది. గద్దరన్నపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం'' అని రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.

## నాలుగో టీ-20లో ఇంగ్లండ్‌పై 15 పరుగులతో టీం ఇండియా విజయం

పుణెలో ఇంగ్లండ్, టీం ఇండియా మధ్య శుక్రవారం జరిగిన నాలుగో టీ-20 మ్యాచ్‌లో టీం ఇండియా 15 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-1 తేడాతో కైవసం చేసుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 182 పరుగులు చేయాల్సిన ఇంగ్లండ్ 19.4 ఓవర్లలో 166 పరుగులకే ఆలౌట్ అయింది. ఇంగ్లండ్ బ్యాటర్లలో హారి్‌బ్రూక్ 26 బంతుల్లో 51 పరుగులు చేసి వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో అర్షదీప్ సింగ్ కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ దారి పట్టాడు. ఓపెనర్లలో బెన్ డెకెట్ 39 పరుగులు, ఫిల్ సాల్ట్ 23 పరుగులు మినహా మిగతా బ్యాటర్లు ఎవరూ నిలవలేక పోయారు. భారత్ బౌలర్లలో రవి బిష్ణోయ్, హర్షిత్ రాణా చెరో మూడు, వరుణ్ చక్రవర్తి రెండు, అర్షదీప్ సింగ్, అక్సర్ పటేల్ చెరో వికెట్ తీశారు.అంతకు ముందు తొలుత బ్యాటింగ్ చేసిన టీం ఇండియా నిర్దేశిత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్‌లు కోల్పోయి 181 పరుగులు చేసింది. శివం దూబే, హార్దిక్ పాండ్యా చెరో 53 పరుగులు చేశారు. రింకూ సింగ్ 30, అభిషేక్ శర్మ 29 పరుగులతో పర్వాలేదనిపించారు. ఇంగ్లండ్ బౌలర్లలో సాఖిబ్ మహ్మద్ మూడు, జామీ ఓవర్‌టన్ రెండు, బ్రైడన్ కార్సె, అదిల్ రషీద్ చెరో వికెట్ తీశారు.






## సచిన్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు..
# ప్రకటించిన బీసీసీఐ

**ముంబయి:** టీమిండియా దిగ్గజ క్రికెటర్, మాజీ కెప్టెన్ సచిన్ టెండూల్కర్‌కు బీసీసీఐ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రకటించింది. శనివారం బీసీసీఐ వార్షిక కార్యక్రమంలో సచిన్‌ను అవార్డుతో సత్కరించనున్నది. సీకే నాయుడు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుకు సచిన్‌ను ఎంపిక చేసినట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. భారత క్రికెట్‌కు దిగ్గజ ఆటగాడు అందించిన సేవలు అమోఘమని పేర్కొన్నాయి. ఈ పురస్కారాన్ని స్వీకరించనున్న 31వ ఆటగాడు సచిన్ టెండూల్కర్ కావడం విశేషం. గతంలో మాజీ హెడ్‌కోచ్ రవిశాస్త్రి, లెజెండరీ వికెట్ కీపర్ ఫరూక్ ఇంజినీర్ సహా పలువురు ఈ అవార్డును అందుకున్నారు. 1994లో భారత జట్టు తొలి కెప్టెన్ కర్నల్ సీకే నాయుడు గౌరవార్థం ఈ అవార్డును బీసీసీఐ తీసుకువచ్చింది. సీకే నాయుడు 1916 నుంచి 1963 వరకు సుదీర్ఘంగా 47 సంవత్సరాల పాటు ఫస్ట్‌క్లాస్‌లో కొనసాగారు. ఇది ప్రపంచ రికార్డు కావడం విశేషం.

**సచిన్ గణాంకాలు..**

ఇంటర్నేషనల్ క్రికెట్ అత్యధిక పరుగులు చేసిన ఏకైక ఆటగాడు సచిన్. సెంచరీల్లోనూ సెంచరీ కొట్టిన ఏకైక ఆటగాడు. టెస్ట్ క్రికెట్‌తో పాటు, వన్డే ఫార్మాట్‌లోనూ సచిన్ అనేక రికార్డులు నెలకొల్పాడు. అతను వన్డేల్లో 44.83 సగటుతో 18,426 పరుగులు చేయగా.. ఇందులో 49 సెంచరీలు, 96 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఇక టెస్ట్‌ల్లో 53.78 సగటుతో 15,921 పరుగులు చేశాడు. ఇందులో 51 సెంచరీలు, 68 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. తన కెరియర్‌లో కేవలం ఒకే ఒక టీ20 ఇంటర్నేషనల్ మ్యాచ్ ఆడాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు ఆటగాడు సచిన్ టెండూల్కర్. భారత్ తరఫున మొత్తం 664 మ్యాచ్‌లు ఆడాడు. 48.52 సగటుతో 34,357 పరుగులు చేశాడు. వీటిలో 100 సెంచరీలు, 164 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

**క్రికెట్ ఐకాన్‌గా..**

సచిన్ కేవలం అద్భుతంగా పరుగులు సాధించడమే కాకుండా క్రికెట్‌కు ఐకాన్‌గా మారాడు. 1989లో 16 సంవత్సరాల వయసులో పాకిస్తాన్‌తో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో అరంగేట్రం చేశాడు. రెండు దశాబ్దాల పాటు భారత జట్టుకు విశేష సేవలు అందించాడు. 2011లో వరల్డ్ కప్ గెలిచిన జట్టులో సచిన్ సభ్యుడు కాగా.. కప్‌ని గెలువడంలోనూ తన వంతు పాత్ర పోషించాడు. సచిన్ తన బ్యాట్‌తో ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ బౌలర్లు సైతం వణికించాడు. దివంగత షేన్ వార్న్ నుంచి ముత్తయ్య మురళీధరన్ వరకు అందరూ సచిన్‌ను ప్రశంసించారు. ఏ సమయంలోనైనా మ్యాచ్ గమనాన్ని మార్చగల సత్తా సచిన్లో ఉందని చెప్పారు. అలాగే, పలువురు ప్రముఖ బౌలర్లు సైతం సచిన్‌కు బౌలింగ్ చేయడం కష్టమని పనిగా చెప్పారు. పోటీ జట్లు సచిన్‌ను అవుట్ చేసేందుకు ప్రత్యేకంగా ప్రణాళిక రూపొందించేవి. అవార్డుకు ఎంపికైన సచిన్ టెండూల్కర్‌కు పలువురు క్రికెటర్లతో పాటు అభిమానులు సైతం సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

## ఫైనల్‌లో యువ భారత్.. ఫిబ్రవరి 2న దక్షిణాఫ్రికాతో
# టీమిండియా ఫైట్!

**కౌలాలంపూర్:** కౌలాలంపూర్ వేదికగా జరిగిన అండర్-19 వుమెన్స్ టీ20 ప్రపంచకప్‌లో యువ భారత్ ఫైనల్‌లోకి ప్రవేశించింది. ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో సెమీ ఫైనల్‌లో ఇంగ్లాండ్‌ను తొమ్మిది వికెట్ల తేడాతో టీమిండియా ఓడించింది. 114 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా.. మరో ఐదు ఓవర్లు మిగిలి ఉండగానే.. ఘన విజయం సాధించింది. ఫిబ్రవరి 2న ఆదివారం దక్షిణాఫ్రికాతో టీమిండియా తలపడనున్నది.

**మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్..**

నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసింది. టీమిండియా బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి ఇంగ్లిష్ జట్టును తక్కువ స్కోర్‌కే పరిమితం చేశారు. ఆ తర్వాత బరిలోకి దిగిన టీమిండియా వికెట్ నష్టపోయి 15 ఓవర్లలోనే 117 పరుగులు చేసి ఫైనల్‌లోకి అడుగుపెట్టింది. లక్ష్య చేధనలో కమలిని-త్రిష జోడీ టీమిండియాకు మంచి శుభారంభం అందించింది. ఇద్దరు తొలి వికెట్‌కు 60 పరుగుల భాగస్వామ్యాన్ని నెలల్పారు. ఫోబ్ బ్రెట్ బౌలింగ్ త్రిష అవుట్ అయ్యింది. 29 బంతుల్లో 35 పరుగులు చేసింది. త్రిష తొలి సూపర్ సిక్స్ మ్యాచ్‌లో సెంచరీ చేసిన తొలి బ్యాట్స్‌వుమెన్‌గా నిలిచింది. ఆ తర్వాత కమలిని, సానిక చల్కే జోడీ టీమిండియా విజయాన్ని ఖరారు చేశారు. భారత్ ఐదు ఓవర్లు మిగిలి ఉండగానే విజయం సాధించింది. కమలిని 50 బంతుల్లో 56 పరుగులతో రాణించింది. సానికా 12 బంతుల్లో ఒక ఫోర్ సహాయంతో 11 పరుగులు చేసి అజేయంగా నిలిచింది.ఇంగ్లాండ్ టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. దేవినా పెర్రిన్, కెప్టెన్ అబి నార్గ్రోవ్ తప్ప ఇతర బ్యాటర్స్ రాణించలేకపోయారు. పెర్రిన్ 40 బంతుల్లో ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో 45 పరుగులు చేయగా, నార్గ్రోవ్ 25 బంతుల్లో మూడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 30 పరుగులు చేసింది. పారుణిక సిసోడియా, వైష్ణవి శర్మ బంతితో ఆకట్టుకున్నారు. ఇద్దరు చెరో మూడు వికెట్ల పడగొట్టారు. ఆయుషి శుక్లాకు రెండు వికెట్లు దక్కాయి.




## ఎలాంటి బ్రాండ్ క్రికెట్ ఆడాలో
# మా కుర్రాళ్లకు తెలుసు

### సూర్యకుమార్ యాదవ్



**పుణె:** ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ ఇంకో మ్యాచ్ మిగిలుండగానే 3-1తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. పుణె వేదికగా జరిగిన నాలుగో మ్యాచ్‌లో భారత్ 15 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 181 పరుగులు చేసింది. అనంతరం ఇంగ్లండ్ 19.4 ఓవర్లలో 166 పరుగులకే పరిమితం అయింది. మ్యాచ్ అనంతరం కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాట్లాడాడు. మ్యాచ్ విజయానికి జట్టు సభ్యులందరూ ఎంతో కష్టపడినట్లు పేర్కొన్నాడు. ఈ ప్రదర్శనతో ఎంతో సంతోషంగా ఉన్నట్లు తెలిపాడు. ''జట్టులో ప్రతి ఒక్కరూ అత్యుత్తమ రీతిలో ప్రదర్శన చేశారు. 10 పరుగులకే మూడు వికెట్లు పడడంతో ఎట్టి పరిస్థితుల్లోనూ మ్యాచ్‌పై పట్టు కోల్పోకూడదని నిర్ణయించుకున్నాం. మేము ఎలాంటి బ్రాండ్ క్రికెట్ ఆడాలనుకుంటున్నామో మా ప్లేయర్లకు తెలుసు. అందుకు తగ్గట్లే వారి ప్రదర్శన ఉంది. అయితే ఒకే ఓవర్‌లో మూడు వికెట్లు కోల్పోవడం ఇబ్బందికరం. ఈ కష్ట సమయంలో హార్దిక్ పాండ్య, శివమ్ దూబె తమ అనుభవంతో గొప్పగా బ్యాటింగ్ చేశారు. సమయానికి తగ్గట్లు ఆడారు. సానుకూల ప్రదర్శనతో మెప్పించారు. నెట్స్‌లో ఎలా అయితే బ్యాటింగ్ చేస్తామో మ్యాచ్‌లోనూ అలాంటి ప్రదర్శన చేయాలని మేం మాట్లాడుకుంటాము. ఈ మ్యాచ్‌లోనూ బ్యాటర్లు నమ్మశక్యం కాని ప్రదర్శనతో మెప్పించారు. ఈ మ్యాచ్‌తో మేము సరైన విధంగానే ఆడుతున్నట్లు అనిపిస్తోంది. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో పవర్ ప్లే తర్వాత మ్యాచ్ మా నియంత్రణలోకి వస్తుందని తెలుసు. అలాగే జరిగింది. వికెట్లు పడ్డాయి. దీంతో మ్యాచ్ మా నియంత్రణలోకి వచ్చింది. శివమ్ దూబె స్థానంలో వచ్చిన హర్షిత్ రాణా అద్భుతంగా బౌలింగ్ వేశాడు. మ్యాచ్ ప్రారంభం నుంచి చివరి దాకా అభిమానులు మాకు ఎంతో మద్దతుగా నిలిచారు'' అని సూర్యకుమార్ పేర్కొన్నాడు.

# భారత ప్లేయర్లతో స్నేహం చేయొద్దు

### పాక్ క్రికెటర్లకు మాజీ కెప్టెన్ మొయిన్ ఖాన్ హెచ్చరిక




**ఇస్లామాబాద్:** ప్రత్యర్థి ఆటగాళ్లపై తనకెలాంటి అగౌరవం లేదని.. కాకపోతే మైదానంలో వారితో స్నేహపూర్వకంగా ఉండటం సరైంది కాదని పాకిస్థాన్ మాజీ కెప్టెన్ మొయిన్ ఖాన్ వ్యాఖ్యానించాడు. అందుకే, తమ ప్లేయర్లను భారత క్రికెటర్లతో స్నేహం చేయొద్దని హెచ్చరించాడు. మైదానంలో పోటీపడేలా ఉండాలని.. అప్పుడే గెలవాలనే పట్టుదల వస్తుందని పేర్కొన్నాడు. గౌరవించడం మంచిదే కానీ, ప్రొఫెషనలిజం కట్టుబాట్లను దాటకూడదని హెచ్చరించాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ -పాకిస్థాన్ జట్లు ఫిబ్రవరి 23న తలపడనున్నాయి. ఈ క్రమంలో మొయిన్ ఖాన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ''ఇటీవల భారత్--పాకిస్థాన్ మ్యాచ్‌లను చూస్తుంటే ఓ విషయం అర్థం కావడంలేదు. టీమ్‌ఇండియా క్రికెటర్లు క్రీజ్‌లోకి వచ్చినప్పుడు మా ఆటగాళ్లు వెళ్లి వారి బ్యాట్లను చెక్ చేయడం.. వారి భుజాలను తట్టడం, స్నేహంగా మాట్లాడటం చేస్తున్నారు. అలా ఎందుకు చేస్తున్నారో తెలియడం లేదు. ఇక్కడ నేను ప్రత్యర్థి ప్లేయర్లను గౌరవించవద్దని చెప్పడం లేదు. గతంలో మా సీనియర్లు ఒకటే మాట చెప్పేవారు. భారత్‌తో బరిలోకి దిగినప్పుడు ఎలాంటి మినహాయింపులు ఇవ్వకూడదన్నారు. మైదానంలో కనీసం వారితో మాట్లాడటం కూడా చేయొద్దని సూచించారు. ఎప్పుడైతే స్నేహపూర్వకంగా స్పందిస్తామో.. అది మన బలహీనత అనేకొనే ప్రమాదం లేకపోలేదు'' అని వ్యాఖ్యానించాడు.

**మనకంటూ కొన్ని పరిమితులు ఉంటాయిగా..**

''ఇప్పటి రోజుల్లో భారత్‌తో మా ప్లేయర్లు ఆడే తీరు నాకు సరిగ్గా అనిపించడం లేదు. మైదానంలోనే కాదు.. అవతల కూడా ప్రొఫెషనల్స్‌కు కొన్ని పరిమితులు ఉంటాయి. వాటిని తప్పనిసరిగా పాటించాలి. కానీ, మా వాళ్లకు ఇది అర్థంకావడం లేదు. మైదానంలో అలా ఉండటం వల్ల అనవసరమైన ఒత్తిడి తెచ్చుకున్నట్లవుతుంది. అప్పుడు ఆ ప్రభావం ఆటపైనా పడుతుంది. మా తరంలోనూ భారత ఆటగాళ్లను గౌరవించేవాళ్లం. కానీ, దానిని మైదానం వరకూ తీసుకురాలేదు'' అని మొయిన్ ఖాన్ స్పష్టంచేశాడు.

# యమహా బంపరాఫర్

### యమహా ఎంటీ-03పై భారీగా ధర తగ్గింపు..



**ముంబయి:** ప్రముఖ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ యమహా మోటార్ ఇండియా బైక్ రైడర్లకు తీపి కబురందించింది. యమహా ఎంటీ-03 మోటారు సైకిల్‌పై భారీగా ధర తగ్గించింది. శనివారం (2025 ఫిబ్రవరి 1) నుంచి రూ.1.10 ధర తగ్గిస్తున్నట్లు శుక్రవారం తెలిపింది. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి యమహా ఎంటీ-03 మోటార్ సైకిల్ రూ. 3.49 లక్షలు (ఎక్స్ షోరూమ్) పలుకుతుంది. ప్రీమియం మోటారు సైకిళ్ల సెగ్మెంట్‌లో కేటీఎం డ్యూక్ 390 , బీఎండబ్ల్యూ జీ 310 ఆర్ మోటార్ సైకిళ్లకు యమహా ఎంటీ-03 మోటార్ సైకిల్ పోటీ ఇస్తుంది. యమహా ఎంటీ-03 మోటారు సైకిల్ కంప్లీట్‌లీ బిల్ట్ అప్ (సీబీయూ) రూపంలో విదేశాల నుంచి దిగుమతి అవుతుంది. యమహా ఎంటీ-03 మోటార్ సైకిల్ లాంచింగ్ ధర రూ. 4.60 లక్షలు (ఎక్స్ షోరూమ్) కాగా, రూ.1.10 లక్షల ధర తగ్గింపుతో రూ.3.49 లక్షల (ఎక్స్ షోరూమ్)కు లభిస్తుంది. కేటీఎం డ్యూక్ 390 మోటార్ సైకిల్ ధర రూ.3.13 లక్షలు (ఎక్స్ షోరూమ్) పలుకుతుంది.

ఇవీ యమహా ఎంటీ-03 ఇంజిన్ స్పెషిఫికేషన్స్

యమహా ఎంటీ-03 మోటార్ సైకిల్ 321సీసీ లిక్విడ్ కూల్డ్, ట్విన్ సిలిండర్ ఇంజిన్‌తో వస్తోంది. ఈ ఇంజిన్ 10,750 ఆర్పీఎం వద్ద 41 బీహెచ్‌పీ విద్యుత్, 9,000 ఆర్పీఎం వద్ద 29.5 ఎన్ఎం టార్క్ వెలువరిస్తుంది. 6-స్పీడ్ గేర్‌బాక్స్‌తో వస్తోంది. యమహా ఎంటీ-03 మోటార్ సైకిల్ సీటు 780 మి.మీ ఎత్తు, 1380 మిమీ వీల్ బేస్, 160 మిమీ గ్రౌండ్ క్లియరెన్స్, 167 కిలోల వెయిట్ ఉంటుంది. ఫ్రంట్‌లో 298 ఎంఎం డిస్క్, 220 ఎంఎం రేర్ డిస్క్ ఉంటాయి. ఈ రెండు డ్యుయల్ చానెల్ ఏబీఎస్‌తో వస్తున్నాయి.

**యమహా ఎంటీ-3 — స్పెషిఫికేషన్స్..**

ఇంజిన్ – 321సీసీ లిక్విడ్ కూల్డ్
పవర్ – 10,750 ఆర్పీఎం వద్ద 41 బీహెచ్‌పీ
టార్క్ – 9,000 ఆర్పీఎం వద్ద 29.5 ఎన్ఎం
గేర్ బాక్స్ – 6- స్పీడ్
మోటారు సైకిల్ – ధర (ఎక్స్ షోరూమ్)..
యమహా ఎంటీ-3 – రూ.3.49 లక్షలు
కేటీఎం 390 డ్యూక్ – రూ.3.13 లక్షలు
బీఎండబ్ల్యూ జీ 310 ఆర్ – రూ.2.90 లక్షలు

# బడ్జెట్ తర్వాత బంగారం మరింత ప్రియం?

**ముంబయి:** భారత్‌లో స్వర్ణానికి ఉన్నంత క్రేజ్ మరే వస్తువుకు ఉండదు. 2024 ద్వితీయార్థంలో భారత్‌లో దీని దిగుమతులు భారీగా పుంజుకొన్నాయి. గత బడ్జెట్‌లో దిగుమతి సుంకాలకు కోత వేయడంతో దీనికి ఆజ్యం పోసినట్లైందని నిపుణులు చెబుతున్నారు. దీంతో ప్రభుత్వం ఈసారి దిద్దుబాటు చర్యలు చేపడుతుందన్న అంచనాలు మార్కెట్‌లో బలంగా ఉన్నాయి. దీనికితోడు పుత్తడి కారణంగా జీడీపీకి అదనపు విలువ జోడింపు లేదా ఎగుమతుల్లో వృద్ధి కూడా పెద్దగా కనిపించకపోవడం ప్రభుత్వాన్ని నిరాశకు గురిచేసింది.

**ఆర్థిక వ్యవస్థకు తలనొప్పిగా..**

ఇది చాలదన్నట్లు ఇబ్బడిముబ్బడిగా స్వర్ణం దిగుమతి చేసుకోవడం ద్రవ్యలోటు, కరెన్సీ పతనానికి దారితీస్తోంది. ప్రస్తుతం రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే రూ.87 వద్దకు చేరడానికి గల కారణాల్లో ఇది కూడా ఒకటి. 2024 డిసెంబర్ 16న విడుదలైన వాణిజ్య గణాంకాల్లో రికార్డు స్థాయి లోటు బయటపడింది. దీనికి పుత్తడి కొనుగోళ్లే కారణమని తేలింది. ప్రాథమిక అంచనాల ప్రకారం 14.8 బిలియన్ డాలర్ల మేరకు దిగుమతి చేసుకొనగా.. దీనిలో 21శాతం మాత్రమే వినియోగాల నిమిత్తం కొనుగోలు చేసింది. ప్రపంచంలోనే దీనిని అత్యధికంగా దిగుమతి చేసుకొనే రెండో దేశంగా భారత్ నిలిచిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

గత జులైలో విడుదల చేసిన బడ్జెట్‌లో స్వర్ణం దిగుమతిపై సుంకాలను ప్రభుత్వం తగ్గించింది. దీంతో ఒక్కసారిగా కొనుగోళ్లు పెరిగిపోయాయి. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఆగస్టులో దిగుమతుల్లో 104 శాతం వృద్ధి కనిపించిందంటే కేంద్ర నిర్ణయం ఎఫెక్ట్‌ను అర్థం చేసుకోవచ్చు. ఆ తర్వాత నెలల్లో కూడా దీని కొనుగోళ్లలో వృద్ధి కనిపిస్తూనే ఉంది.

**సుంకం ఇంకా తగ్గించాలని పరిశ్రమ వాదన..**

మరోవైపు నగల పరిశ్రమ మాత్రం దిగుమతి సుంకాల తగ్గింపును కొనసాగించాలని బలంగా కోరుతోంది. అప్పుడు స్వర్ణం ధర కూడా దిగొస్తుందని చెబుతోంది. దీనికితోడు స్మగ్లింగ్‌ను అరికట్టొచ్చని వాదిస్తోంది. నగల తయారీ సంస్థలకు మూల ధనవ్యయాలు తగ్గడం, పోటీ పెరగడం వంటివి చోటు చేసుకొని పరిశ్రమ మరింత మెరుగుపడుతుందని చెబుతున్నాయి. మరోవైపు వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ కూడా దిగుమతి సుంకాలు ఈసారి బడ్జెట్‌లో పెరిగితే పరిశ్రమపై ప్రతికూల ప్రభావం తప్పదని హెచ్చరిస్తోంది. స్మగ్లింగ్ పెరగడంతోపాటు.. దేశీయంగా ధరలు ఆకాశాన్నంటుతాయని చెబుతోంది. ఇవి జువెలరీ పరిశ్రమను వెనక్కి నెట్టే ప్రమాదం ఉందంటోంది.

గత బడ్జెట్‌లో పుత్తడి, వెండి వస్తువులు, కడ్డీలపై కస్టమ్స్ డ్యూటీని కుదించారు. ఇప్పటివరకు బంగారం, వెండిపై 10% బీసీడీ ఉండగా, దీన్ని 5 శాతానికి పరిమితం చేస్తున్నట్లు తెలిపారు. దీనికి అదనంగా విధిస్తున్న వ్యవసాయ మౌలిక వసతుల అభివృద్ధి సుంకం (ఏఐడీసీ)ని 5% నుంచి 1 శాతానికి పరిమితం చేయడంతో మొత్తంగా 6 శాతానికి తగ్గింది.

## ఆహాలో స్ట్రీమ్ కానున్న "కాఫీ విత్ ఏ కిల్లర్"




ఆర్పీ పట్నాయక్ కథ రచనా దర్శకత్వంలో సెవెన్ హిల్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సతీష్ నిర్మాతగా ఆహా ఓటీటీలో నేటి నుండి ప్రేక్షకులకు అందుబాటులో ఉండనున్న చిత్రం "కాఫీ విత్ ఏ కిల్లర్". టెంపర్ వంశీ, శ్రీనివాసరెడ్డి, సత్యం రాజేష్, రవిబాబు, అంబటి శ్రీను, శ్రీరాప, జెమిని సురేష్ తదితరులు కీలకపాత్ర పోషిస్తున్న ఈ చిత్రం క్రైమ్ జోనర్ లా అనిపిస్తుంది. అనుష్ గోరక్ ఈ చిత్రానికి డీఓపీ, ఎడిటర్, డీఐగా వ్యవహరించగా తిరుమల డైలాగులు రాశారు. నేటి నుంచి ఆహాలో స్క్రీన్ స్ట్రీమ్ కానున్న సందర్భంగా ఈ చిత్ర యూనిట్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నటుడు అంబటి శ్రీను మాట్లాడుతూ... ఈ చిత్రం చాలా అద్భుతంగా ఉండబోతుంది. మంచి కాఫీ తాగే ఫీల్ కలిగిస్తుంది. ఈ చిత్రంలో నాకు మంచి పాత్రను ఇచ్చిన ఆర్ పి పట్నాయక్‌కి నా కృతజ్ఞతలు. ఆయన అంటే నాకు ఎంతో అభిమానం. నేను ఆయన పాటలకు వీరాభిమానిని. ఆర్ పి పట్నాయక్ గారి అభిమానులు ఆయన నుండి ఒక యూత్ ఫుల్ లవ్ స్టోరీ రావాలని కోరుకుంటున్నారు. అలాగే ఈ చిత్రం నిర్మాత సతీష్ కి, గౌతం పట్నాయక్ కి నా కృతజ్ఞతలు. ఈ సినిమాలో నటించిన నటీనటులు ఎవరికీ కూడా ఈ చిత్ర కథ ఏంటి అనేది తెలీదు. కాబట్టి చిత్రాన్ని అందరూ తప్పకుండా ఆహ్వానం చూసి ఎంజాయ్ చేయండి" అన్నారు.

నటి శ్రీరాప మాట్లాడుతూ... "కాఫీ విత్ ఏ కిల్లర్ సినిమా గురించి మాట్లాడాలి అంటే ముందుగా నేను గౌతమ్ గురించి మాట్లాడాలి. ఆయన ఈ చిత్రానికి ఎంత ముఖ్యమైన వ్యక్తి. నాకు ఈ చిత్రంలో నటించే అవకాశం ఇచ్చిన వారికి నా కృతజ్ఞతలు. అలాగే ఆర్ పి పట్నాయక్ అంటే తెలియని వారు లేరు. ఆయన సంగీత దర్శకుడుగా అలాగ దర్శకుడిగా ఎంతో మంచి పేరు ఉన్న వ్యక్తి. ఆయన దర్శకత్వంలో పనిచేయడం ఎంతో ఆనందంగా అనిపించింది" అన్నారు.

నిర్మాత సెవెన్ హిల్స్ సతీష్ మాట్లాడుతూ... " అందరికీ ఎంతో ఇష్టమైన సంగతి దర్శకుడు అలాగే ప్రతిసారి ప్రత్యేకమైన చిత్రాలతో ప్రేక్షకులకు ముందుకు వచ్చే దర్శకుడు ఆర్పీ పట్నాయక్. ఆయన చేసిన చిత్రం ఈ "కాఫీ విత్ ఏ కలర్" నేటి నుంచి ఆహాలో స్క్రీన్ అవుతుంది. రెండు గంటలపాటు మిమ్మల్ని ఎక్కడికి కదలకుండా చేసే ఒక ప్రత్యేకమైన చిత్రంగా ఉండబోతుంది. తిరుమల నాగ్ డైలాగ్స్ చాలా బాగుంటాయి. శ్రీనివాస్ రెడ్డి పాత్ర ఎంతో అద్భుతంగా ఉండబోతుంది. ఈ చిత్రానికి సాంకేతిక బృందం చాలా కష్టపడి పనిచేశారు. ఈ చిత్రం ప్రేక్షకులు అందరికీ నచ్చుతుందని అనుకుంటున్నాను ఎందుకంటే సినిమా అంటే పాటలు, యాక్షన్ వంటి సీన్లతో ఉండేలా కాకుండా ఒక కాన్సెప్ట్ ని కథగా అనుకుని సినిమాగా తీసే ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాము. ఈ సినిమాను మా సెవెన్ హిల్స్ ప్రొడక్షన్స్ లో నిర్మించినందుకు ఆర్ పి పట్నాయక్ గారికి ధన్యవాదాలు. ఈ చిత్రం ఆహాలు స్ట్రీమ్ అవుతుంది. అందరూ ఆదరిస్తారని కోరుకుంటున్నాను" అన్నారు.

దర్శకుడు ఆర్ పి పట్నాయక్ మాట్లాడుతూ... "ఈ సినిమా ఆహాలో విడుదల కావడానికి కారణమైన సాయి రాజేష్ కి థాంక్స్ చెప్పాలి. అందరి ఆలోచనలు ఎక్కడ ఆగిపోతాయో మన ఆలోచన అక్కడ మొదలవ్వాలి కానీ నేను ఆనందిస్తాను. హీరో హీరోయిన్ లేకుండా ఒక సినిమా తీయాలి అంటే ఎలా అని ఆలోచనతో ఈ కథ మొదలైంది. కథ హీరో అయితే ఎలా ఉండబోతుంది అని ఈ కథ రాశాము. ఈ చిత్రానికి పనిచేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు. ఈ సినిమాను మొత్తం దగ్గరుండి చూసుకున్నది మా అన్నయ్య గౌతమ్ పట్నాయక్. ఈ చిత్రంలోని కీలక పాత్ర విషయానికి వస్తే నాకు వంశీ మాత్రమే కచ్చితంగా ఈ కథకు, పాత్రకు పర్ఫెక్ట్ అని అనిపించింది. వేరే ఎవరిని నేను ఆ పాత్రలో ఊహించుకోలేకపోయాను. జెమిని సురేష్ క్యారెక్టర్ ప్రత్యేకమైనది. చిత్రంలో నటించిన నటీనటుల క్యారెక్టర్లు చూస్తే కొన్ని ఎంతో ప్రత్యేకంగా అలాగే కొత్తగా ఉంటాయి. శ్రీనివాస్ రెడ్డి గారికి ఆయన కాకుండా ఇంకా ఎవరు అంత బాగా చేయలేరు అన్నట్లు వచ్చింది. ఆయన టైమింగ్ ప్రత్యేకం అని చెప్పుకోవాలి. నిర్మాత సెవెన్ హిల్స్ సతీష్‌గారికి ప్రత్యేక కృతజ్ఞతలు. ఆయన త్వరలోనే పెద్ద నిర్మాతల స్థాయికి చేరతారు. మా డైరెక్షన్ టీం 24 గంటలు అందుబాటులో ఉంటూ ఎంతో కష్టపడి పని చేశారు. చివరిగా యాంకర్ గీతా గారికి ప్రత్యేక ధన్యవాదాలు. ఆమె మా రైటింగ్ టీమ్ లో కూడా ఉంటారు" అన్నారు.



## సన్యాసిగా మారిన నటికి షాక్..



మహా కుంభమేళా ప్రారంభంలో ప్రాపంచిక జీవనాన్ని పరిత్యజించి, సన్యాసినిగా మారిన ప్రముఖ బాలీవుడ్ నటి మమతా కులకర్ణి (52) కిన్నెర అఖాడా నుంచి బహిష్కరణకు గురయ్యారు. మహా మండలేశ్వర్‌గా ఆమె తీసుకున్న దీక్షను రద్దు చేశారు. పలువులు మతపెద్దలు, అఖాడాల నుంచి వస్తున్న అభ్యంతరాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అఖాడాలు వెల్లడించారు. అంతేకాకుండా ఆమెను అఖాడాలో చేర్పించిన కిన్నెర అఖాడా ఆచార్య మహామండలేశ్వర్ డాక్టర్ లక్ష్మీనారాయణ్ త్రిపాఠిని సైతం అఖాడా నుంచి తొలగిస్తున్నట్లు తెలిపారు.

కిన్నెర అఖాడాలో కులకర్ణి చేరిక తర్వాత అందులోని సభ్యుల మధ్య వివాదాలు చెలరేగాయి. అఖాడాలో చేరిన మొదట్లోనే ఆమె అత్యున్నత స్థానమైన మహామండలేశ్వర్ హోదాను పొందడాన్ని పలువురు వ్యతిరేకించారు. మహా కుంభమేళా పవిత్రమైన ఆధ్యాత్మిక కార్యక్రమమని, కానీ కొందరు వ్యక్తులు ఇందులో అసభ్యతను ప్రోత్సహిస్తున్నారంటూ ప్రముఖ యోగా గురువు బాబా రామ్‌దేవ్ మండిపడ్డారు. ఇప్పటి వరకు ప్రాపంచిక సుఖాల్లో మునిగిపోయిన వ్యక్తులు ఒక్కసారిగా సన్యాసులుగా మారిపోయి.. మహామండలేశ్వర్ వంటి బిరుదులను కూడా పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే అఖాడా వ్యవస్థాపకులు అజయ్ దాస్, కులకర్ణి గురువు లక్ష్మీ నారాయణ్ త్రిపాఠి మధ్య విభేదాలు తీవ్రమయ్యాయి. అజయ్‌దాస్ అఖాడా నుంచి బయటకు వెళ్లి, తన కుటుంబంతో నివసిస్తున్నారని.. కిన్నెర అఖాడా నియమాల ప్రకారం కుటుంబంతో ఉన్నవారికి ఈ విషయంలో నిర్ణయం తీసుకునే అధికారం లేదని త్రిపాఠి పేర్కొన్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఆమెపై బహిష్కరణ వేటు వేసినట్లు తెలుస్తోంది.

90వ దశకంలో బాలీవుడ్‌లో మంచి క్రేజ్ సంపాదించుకున్న నటి మమతా కుల్‌కర్ణి 2003 తర్వాత సినిమాల నుంచి తప్పుకొని, విదేశాలకు వెళ్లిపోయారు. ఈ క్రమంలోనే డ్రగ్స్ రాకెట్ లో ఆమె పేరు వినిపించింది. పోలీసులు నోటీసులు సైతం పంపారు. ఇన్నేళ్ల తర్వాత కుంభమేళ సందర్భంగా భారత్‌కు వచ్చిన ఆమె అందరినీ ఆశ్చర్యపరుస్తూ కిన్నెర అఖాడాలో చేరి.. తన పేరును 'మాయీ మమతానంద్ గిరి'గా మార్చుకున్న విషయం తెలిసిందే.

## 'ఎస్ఎస్ఎంబీ 29' మూవీ కోసం ప్రియాంక చోప్రా రెమ్యునరేషన్ ఎంతంటే..!

సూపర్ స్టార్ మహేశ్ బాబు, ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ బడ్జెట్, యాక్షన్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్ 'ఎస్ఎస్ఎంబీ 29'. ఇందులో మహేశ్ బాబు సరసన హీరోయిన్ గా గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా నటించబోతున్న విషయం తెలిసిందే.

గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తోంది అన్న విషయం ఆమె హైదరాబాదులో అడుగు పెట్టిన తర్వాత కన్ఫర్మ్ అయింది. ఇక తాజాగా కీరవాణి, రాజమౌళిలతో కలిసి దిగిన ఫొటోలు వైరల్ కావడంతో ఆమె హీరోయిన్ అని స్వయంగా రాజమౌళి నిర్ధారించినట్టు అయ్యింది.

ఇక, పాన్ వరల్డ్ సినిమాగా రూపొందబోతున్న ఈ మూవీ కోసం ఆమెకు భారీ రెమ్యూనరేషన్ అందుకోబోతున్నట్లు తాజాగా నెట్టింట ఓ వార్త బాగా హల్‌చల్ చేస్తోంది.

తాజా కథనాల ప్రకారం జక్కన్న ప్రాజెక్ట్ కోసం ప్రియాంక చోప్రా ఏకంగా రూ. 30 కోట్లు పారితోషికంగా అందుకుంటోందని ఫిలిం నగర్ సర్కిల్స్ లో ఓ వార్త చక్కర్లు కొడుతోంది. ఇదే నిజమైతే భారతీయ సినీ పరిశ్రమలో రీఎంట్రీ తర్వాత ఆమె తీసుకుంటున్న భారీ మొత్తం ఇదే అవుతుందనేది సినీ వర్గాల మాట. ఇందులో ఎంత నిజం ఉందనేది తెలియదు.

మరోవైపు జక్కన్న 'ఎస్ఎస్ఎంబీ 29' మూవీ పూజా కార్యక్రమాలను ఎలాంటి హడావుడి లేకుండా ఈనెల ప్రారంభంలోనే పూర్తి చేశారు. ఇక ఇప్పుడు చిత్రబృందం ఈ అడ్వెంచర్ థ్రిల్లర్ మూవీ షూటింగ్‌ను హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీ, కెన్యా అడవుల్లో, అలాగే మరికొన్ని కీ లొకేషన్లలో షూట్ చేయబోతున్నారని సమాచారం. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ హైదరాబాద్‌లోనే జరుగుతుందనేది తాజా అప్‌డేట్.

## హిట్-4 సినిమాలో బాలకృష్ణ..!

న్యాచురల్ స్టార్ నాని, ప్రస్తుతం తన స్వీయ నిర్మాణంలో నటిస్తున్న సినిమా 'హిట్ 3'. హిట్ సిరీస్ దర్శకుడు శైలేష్ కొలను ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే 70 % షూటింగ్ ఫినిష్ చేసుకున్న ఈ చిత్రంలో నాని పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నాడు. లేటెస్ట్‌గా రిపబ్లిక్ డే సందర్భంగా కొత్త పోస్టర్ రిలీజ్ చేయగా అర్జున్ సర్కార్‌గా నాని మాస్ లుక్‌లో కనిపించాడు. అయితే ఈ సినిమాలో బాలయ్య కూడా నటించనున్నారనే న్యూస్ మరోసారి వైరల్ అవుతోంది. గతంలో హిట్ 2 సినిమా చూసిన బాలకృష్ణ చిత్ర యూనిట్‌ని కూడా అభినందించారు. ఆ సమయంలోనే హిట్ 3లో బాలయ్య గెస్ట్ రోల్‌లో కనిపించే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి. ఇక ఇప్పుడు హిట్ 3 క్లైమాక్స్‌లో ఒక మాస్ హీరో కనిపిస్తారని ఆ హీరోతోనే హిట్ 4 ఉంటుందని అంటున్నారు. దీంతో హిట్ 3 క్లైమాక్స్‌లో ఎంట్రీ ఇచ్చేది బాలయ్యనే అని, హిట్ 4 హీరో ఆయనే అని ప్రచారం జరుగుతోంది. ఇందులో నిజమెంతో తెలియదు కానీ, ఒకవేళ బాలయ్య ఈ ప్రాజెక్ట్ లో ఇన్వాల్వ్ అయితే మాత్రం నెక్స్ లెవల్లో ఉంటుందని చెప్పడంలో ఎలాంటి డౌట్స్ అక్కర్లేదు. రూత్ లెస్ పోలీస్ ఆఫీసర్ గా బాలయ్యను చూస్తారని ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఓ వైపు హీరోగా చేస్తునే నిర్మాతగా కూడా రానిస్తున్నాడు నాని. ఇటీవలె శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో మెగాస్టార్‌తో ఓ మాస్ సినిమా అనౌన్స్ చేశాడు. ఇప్పుడు బాలయ్యతో కూడా తన నిర్మాణంలో హిట్ 4 చేసే ఛాన్స్ లేకపోలేదు. ఈ విషయంలో క్లారిటీ రావాలంటే హిట్ 3 రిలీజ్ అయ్యే వరకు వెయిట్ చేయాల్సిందే.



## ప్రభాస్ ఇంటి భోజనానికి హీరోయిన్ ఫిదా

బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో స్టార్ హీరో ప్రభాస్ ఫుల్ బిజీగా ఉన్నారు. ప్రభాస్ కోసం రెడీ చేసుకున్న కథలతో డైరెక్టర్లు, నిర్మాతలు సిద్ధంగా ఉన్నా... ప్రభాస్ డేట్స్ మాత్రం దొరకడం లేదు. ప్రస్తుతం ప్రభాస్ చేస్తున్న సినిమాలలో హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న సినిమా 'ఫౌజీ' ఒకటి. ఈ చిత్రంలో ఇమాన్వీ హీరోయిన్ గా నటిస్తోంది. మరోవైపు, సెట్స్ కు ప్రభాస్ ఇంటి నుంచి పలు రుచికరమైన వంటకాలతో కూడిన భోజనం వస్తుంటుందనే విషయం అందరికీ తెలిసిందే. ప్రభాస్ ఇంటి భోజనానికి, ఆయన ఆతిథ్యానికి ఎంతో మంది సెలబ్రిటీలు ఫిదా అయ్యారు. ప్రస్తుతం ఈ జాబితాలో ఇమాన్వీ కూడా చేరిపోయింది.

ప్రస్తుతం 'ఫౌజీ' షూటింగ్ రామోజీ ఫిలిం సిటీలో జరుగుతోంది. ఇమాన్వీ కోసం ప్రభాస్ ఇంట్లో వండిన భోజనం వచ్చింది. షూటింగ్ బ్రేక్ టైమ్ లో ఈ భోజనాన్ని ఇమాన్వీ రుచి చూసింది. ఈ విషయాన్ని ఇన్స్టాగ్రామ్ లో షేర్ చేసింది. రుచికరమైన భోజనాన్ని రుచి చూపించిన ప్రభాస్ కు ధన్యవాదాలు అని కామెంట్ పెట్టింది.






## తండేల్ మూవీలో ఆ సీక్వెన్స్ కోసమే రూ.18 కోట్ల ఖర్చు.. : దర్శకుడు చందూ మొండేటి



టాలీవుడ్ యంగ్ హీరో నాగచైతన్య, సాయిపల్లవి లీడ్ రోల్ నటించిన చిత్రం తండేల్. ఈ సినిమాను పాన్ ఇండియా లెవెల్‌లో దర్శకుడు చందూ మొండేటి తెరకెక్కించారు. శ్రీకాకుళం జిల్లా డి మత్స్యలేశం గ్రామంలో జరిగిన సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపొందింది. వేటకు వెళ్లిన పలువురు మత్స్యకారులు పాకిస్థాన్ కోస్ట్ గార్డుకు చిక్కి రెండేళ్లు జైలు శిక్ష అనుభవించిన స్టోరీ లైన్‌పై ఈ సినిమా రూపొందింది. ఫిబ్రవరి 7న ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఈ సినిమా గురించి దర్శకుడు చందూ ఓ ఆసక్తికర విషయం షేర్ చేశాడు. ఈ చిత్రంలో ఓ సీక్వెన్స్‌ను చిత్రీకరించేందుకు ఏకంగా రూ.18కోట్లు ఖర్చు చేశారట. అంతేకాకుండా పలు ఇంటర్వ్యూల్లో తండేల్ గురించి ఆసక్తికర విషయాలు షేర్ చేసుకున్నారు.

'ఆ సినిమా అనుభవంతో'

" నేను ఇంతకముందు తీసిన కార్తికేయ 2 అనుభవం తండేల్‌కు బాగా ఉపయోగపడింది. నేనెప్పుడూ అనుకున్న బడ్జెట్‌ను దాటి సినిమా చేయను. ఈ చిత్రం విషయానికొస్తే రీసెర్చ్ తర్వాత స్టోరీ రాయడం పూర్తయింది. తర్వాత హీరో బాడీ లాంగ్వేజ్ ఎలా ఉంటే బాగుంటుందో టెస్ట్ చేసేందుకు మళ్లీ డి మత్స్యలేశం వెళ్లాం. ఇంకా ఏం జరిగింది? అని అక్కడి వారిని అడగ్గా సముద్రంలో జరిగిన తుపాను, ఆ సమయంలో మత్స్యకారుల సమయస్ఫూర్తి గురించి వివరించారు. అప్పటికే పూర్తయిన స్టోరీకి తగ్గట్టు బడ్జెట్ అప్పటికే నిర్ణయించినా ఇలాంటి విజువల్స్ ఉంటే బాగుంటుందని భావించా. అదే విషయం చెబితే నిర్మాతలు అంగీకరించారు. ఆ ఒక్క సీక్వెన్స్‌కే రూ.18 కోట్లు బడ్జెట్ అయింది. లైవ్ లొకేషన్(సముద్రం)లో, స్టూడియోలో, మినియేచర్, వర్చువల్‌గా సీన్స్ తీశాం. ఈ సినిమాలో ఎమోషన్ ఉంటుంది" అని చందూ అన్నారు.పాన్ ఇండియా స్థాయిలో రూపొందిన ఈ చిత్రం తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది. గతంలో ఎన్నడూ చేయని సరి కొత్త పాత్రలో చైతూ, డీగ్లామర్ లుక్స్‌లో సాయి పల్లవి కనిపించనున్నారు. దేవి శ్రీ ప్రసాద్ స్వరాలు ఈ చిత్రానికి చక్కటి స్వరాలు అందించారు.

రిపోర్టర్స్ కావలెను
V3 NEWS
తెలుగు దినపత్రిక విశ్వంభర అక్షరం సాక్షిగా...
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాల వారిగా
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్స్,
కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్స్ కావలెను.
Wanted Reporters & Marketing Executives
Contact: 9441222429 | 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com